www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 19-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 261 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 10.03 తదుపరి పంచమి; నక్షత్రం: ఆశ్లేష రా. 2.00 తదుపరి మఖ; వర్జ్యం: మ.2.19-3.59; దుర్ముహూర్తం: ఉ.10.22-11.06, మ.2.45-3.29; అమృతఘడియలు: రా.12.19-2.00; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 5.41 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పిన్ యోధుడు ఆపేశాడు



ఎలాంటి
ముందస్తు ప్రకటనా లేదు..
హంగూ ఆర్భాటం అసలే లేదు..
అస్సలు రిటైర్మెంట్ ఆనవాళ్లే కనిపించలేదు..
అందరిలోనూ ఆశ్చర్యం తప్ప అక్కడేమీ లేదు..
ఎన్నో అద్భుత ప్రదర్శనలు, మరెన్నో మరపురాని అనుభూతులు భారత క్రికెట్‌కు అందించిన స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తన పద్నాలుగేళ్ల సుదీర్ఘ ప్రయాణానికి అనూహ్య ముగింపు పలికాడు. ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మూడో టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించి ఆశ్చర్య పరిచాడు.

అశ్విన్ అనూహ్య వీడ్కోలు

బ్రిస్బేన్: భారత క్రికెట్‌లో ఓ అధ్యాయం ముగిసింది. వెటరన్ ఆఫ్ స్పిన్నర్, 38 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్ ప్రస్థానానికి తెరపడింది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా టీమిండియాలో చెరగని ముద్ర వేసిన అశ్విన్.. బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్ జరుగుతుండగానే ఆటకు వీడ్కోలు పలికాడు. ఏమాత్రం విజయావకాశాల్లేని మ్యాచ్‌లను ఎన్నింటినో తనదైన ప్రదర్శనతో గెలిపించిన అశ్విన్.. క్రికెట్ నుంచి అనూహ్యంగా తప్పుకొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగినా, ఐపీఎల్‌లాంటి లీగ్‌లతో పాటు క్లబ్ క్రికెట్‌లో కొనసాగుతానని అశ్విన్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం కెప్టెన్ రోహిత్‌తో కలిసి అశ్విన్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అశ్విన్ మాట్లాడుతూ.. 'భారత క్రికెటర్‌గా నాకిదే చివరిరోజు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నా. అయితే, నాలో ఇంకాస్త క్రికెట్ ఉందని అనుకుంటున్నా. తప్పకుండా క్లబ్ క్రికెట్‌లో ఆడతా. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఎన్నో అనుభవాలను అందించిన నా సహచర ఆటగాళ్లతో పాటు బీసీసీఐకి, నా ఎదుగుదలలో కీలకపాత్ర పోషించిన కోచ్‌లకు ధన్యవాదాలు. ఇక, రోహిత్, రహానె, పుజారాలాంటి ఆటగాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పాలి. వీళ్లంతా స్లిప్స్‌లో క్యాచ్‌లు అందుకోవడం వల్లే నేనివాళ ఇన్ని వికెట్లు సాధించగలిగా. ఆస్ట్రేలియా జట్టుకు బిగ్ థాంక్యూ. వాళ్లతో ఆడడాన్ని ఆస్వాదించా' అని అన్నాడు. ఇక.. 'ఇది భావోద్వేగపూరితమైన క్షణం. ఈ సమయంలో మీ ప్రశ్నలకు సమాధానమివ్వలేను. ఇందుకు నన్ను క్షమించండి' అని మీడియానుద్దేశించి అశ్విన్ వ్యాఖ్యానించాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో తొలి టెస్టుకు దూరమైన అశ్విన్.. అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో మాత్రం ఆడాడు. ఆ మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన అశ్విన్‌ను డ్రాగా ముగిసిన మూడో టెస్టుకు మాత్రం తీసుకోలేదు.



అశ్విన్ కెరీర్ గ్రాఫ్..

ఫార్మాట్	మ్యాచ్‌లు	వికెట్లు	బెస్ట్	పరుగులు	సెం.	అ.సెం.
టెస్టులు	106	537	7/59	3503	6	14
వన్డేలు	116	156	4/25	707	-	1
టీ20లు	65	72	4/8	184	-	-

37 సార్లు - టెస్టుల్లో 5 వికెట్ల ప్రదర్శన
8 సార్లు - ఒక టెస్టులో 10 వికెట్ల ప్రదర్శన

టెస్టుల్లో రారాజు...

చెన్నైకి చెందిన అశ్విన్.. 2010 జూన్ 5న శ్రీలంకతో వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అదే ఏడాది జూన్ 12న జింబాబ్వేతో తొలి టీ20 మ్యాచ్ ఆడిన అశ్విన్.. 2011 నవంబరు 6న వెస్టిండీస్‌తో టెస్టుల్లోకి అడుగుపెట్టాడు. గతేడాది అక్టోబరులో ఆస్ట్రేలియాతో కెరీర్ చివరి వన్డేను ఆడిన అశ్విన్.. 2022లో ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20లో పాల్గొన్నాడు. టెస్టు క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న అశ్విన్.. అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్‌ల ఘన వారసత్వాన్ని నిలబెట్టే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కుంబ్లే (619) తర్వాత టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డుకెక్కాడు. టెస్టుల్లో అత్యధికసార్లు (11) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న ఆటగాడిగా ముత్తయ్య మురళీధరన్‌తో సమంగా నిలిచాడు.

నాడు ధోనీ.. నేడు అశ్విన్

అశ్విన్ తీసుకున్న రిటైర్మెంట్ నిర్ణయం.. గతంలో ధోనీ ఉదంతాన్ని గుర్తుచేస్తోంది. 2014లో ధోనీ కూడా ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ ఏడాది డిసెంబరులో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ధోనీ.. నాలుగు మ్యాచ్‌ల ఆ సిరీస్‌లో అప్పటికే రెండు టెస్టులు ముగిసిన అనంతరం అనూహ్యంగా తన వీడ్కోలు ప్రకటన చేశాడు. ఎలాంటి సంకేతాలు ఇవ్వకుండా కేవలం ఓ ప్రకటన రూపంలో ధోనీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని తెలియజేశాడు. ఇప్పుడు అశ్విన్ కూడా మరో రెండు టెస్టులు మిగిలుండగానే సిరీస్ మధ్యలో ఆటకు గుడ్‌బై చెప్పేశాడు.

నా అవసరం లేకుంటే..ఎందుకు?

తన అనూహ్య రిటైర్మెంట్ ప్రకటనకు ముందు అశ్విన్..కెప్టెన్ రోహిత్ శర్మతో ఘాటుగానే మాట్లాడాడట ! 'సిరీస్‌లో నా అవసరం లేకుంటే ఆటకు వీడ్కోలు పలకడమే ఉత్తమం' అని అశ్విన్ ఖరాఖండిగా చెప్పాడని కెప్టెన్ రోహిత్ వెల్లడించాడు. నిజానికి..స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్ ముగిసిన తర్వాత నుంచే రిటైర్మెంట్‌పై అశ్విన్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తనకు తుది 11 మంది జట్టులో స్థానం లభించకపోతే..తానసలు ఆస్ట్రేలియానే వెళ్లనని జట్టు యాజమాన్యానికి సిరీస్‌కు ముందే అశ్విన్ స్పష్టం చేసినట్టు సమాచారం.

హఠాత్ నిర్ణయం అందుకేనా?

సిరీస్ మధ్యలో అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇంకా రెండు టెస్టులు మిగిలున్న నేపథ్యంలో అతడు ఆడే అవకాశాలు దాదాపు లేవనే భావించాలి. తాజాగా గాబా టెస్ట్‌లో జడేజా ఆకట్టుకొనే ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకొన్నాడు. దీంతో తర్వాతి 2 మ్యాచ్‌ల్లో తనకు అవకాశాలు కష్టమని అశ్విన్ భావించి ఉండవచ్చు. పైగా వాషింగ్టన్ సుందర్‌ను మేనేజ్‌మెంట్ ఎక్కువగా ప్రోత్సహిస్తోంది. దీంతో ఇక తాను జట్టుతో ఉండడంలో అర్థం లేదని భావించి ఉంటాడని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా భారత జట్టుకు వచ్చే ఏడాది జూన్‌దాకా టెస్టుల్లేవు. అందుకే అశ్విన్ ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడు.

బ్రిస్బేన్‌ను వీడిన అశ్విన్..

రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే అశ్విన్.. బ్రిస్బేన్‌లోని భారత జట్టును వీడి స్వదేశానికి బయల్దేరాడు. కాగా, జట్టు మేనేజ్‌మెంట్ అశ్విన్‌కు బ్రిస్బేన్‌లోనే ఘనంగా విందు ఏర్పాటు చేయాలనుకుందట. అయితే, సమయాభావం కారణంగా అది సాధ్యం కాలేదని సమాచారం.



ఆసీస్ ఆటగాళ్ల సంతకాలు చేసిన జెర్సీని అశ్విన్‌కు అందజేస్తున్న కమిన్స్

భావోద్వేగ వీడ్కోలు..



అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటనతో మూడో టెస్టు ముగిసిన తర్వాత టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో పూర్తిగా ఉద్వేగభరిత వాతావరణం కనిపించింది. సహచరులంతా అశ్విన్‌ను హత్తుకొని భావోద్వేగ వీడ్కోలు పలికారు. అతనికోసం కేక్ తెప్పించి కట్ చేశారు. ఆసీస్ ఆటగాళ్లు కమిన్స్, లియోన్ వచ్చి తమ జట్టు ఆటగాళ్లంతా కలిసి సంతకాలు చేసిన జెర్సీని అశ్విన్‌కు అందజేశారు. ఇక, తీవ్ర భావోద్వేగానికి గురైన అశ్విన్.. 'రోహిత్, విరాట్, గౌతీ భాయ్‌కు థ్యాంక్స్. ఈరోజు సంతోషంగా ఉంది. ఇప్పుడే మొదటిసారి ఆస్ట్రేలియాలో పర్యటించినట్టు అనిపిస్తోంది. కెరీర్ ఆరంభంలో దిగ్గజాలతో కలిసి ఆడా. క్రమంగా రాహుల్ పాజీ (ద్రవిడ్), సచిన్ పాజీ ఇలా.. ఒక్కొక్కరు రిటైర్ అయ్యారు. ప్రతి ఒక్కరికీ వీడ్కోలు సమయం వస్తుంది. ఈరోజు నాకొచ్చింది. నేను తిరిగి ఇంటికి వెళ్తున్నా. మీరు మెల్‌బోర్న్‌లో ఎలా ఆడతారో టీవీలో చూస్తా.మీకెప్పుడైనా నాతో అవసరమనిపిస్తే ఫోన్ కాల్‌కు అందుబాటులో ఉంటా' అని సహచరులతో వీడ్కోలు సందేశంలో అశ్విన్ పేర్కొన్నాడు. ఈ వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

రిటైర్మెంట్‌కిదా సమయం: సన్నీ

అశ్విన్ అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడాన్ని సునీల్ గవాస్కర్ తప్పుపట్టాడు. సిరీస్ మధ్యలో ఇలాంటి నిర్ణయాల వల్ల జట్టు ప్రణాళికలు దెబ్బతింటాయన్న సన్నీ.. సిరీస్ ముగిశాక గుడ్‌బై చెబితే బాగుండేదన్నాడు. 'గతంలో ధోనీ కూడా ఇలాగే చేశాడు. నాలుగోటెస్ట్ వేదిక మెల్‌బోర్న్ పిచ్ ఎలా ఉందో తెలియదు. కానీ సిడ్నీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. కాబట్టి, ఆ టెస్టులో భారత్ ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగొచ్చు. అప్పుడు అశ్విన్‌కు ఆడే అవకాశం వచ్చేదేమో' అని గవాస్కర్ అన్నాడు.

నీకు నీవే సాటి..

బౌలింగ్ ప్రయోగాలు చేయడంలో, బ్యాటింగ్‌లో మార్పులను అర్థం చేసుకోవడంలో నీకు నీవే సాటి.
- సచిన్ టెండూల్కర్

ఆడిన తొలి మ్యాచ్ మొదలు ఆఖరి వరకు మ్యాచ్ విన్నర్ అనే ముద్ర వేసి వెళ్లావు.
- రోహిత్ శర్మ

రిటైర్మెంట్ విషయం చెప్పగానే ఉద్వేగానికి లోనయ్యా. ఒక్కసారిగా మనం కలిసి ఆడిన క్షణాలన్నీ గుర్తొచ్చాయి. ఈ ప్రయాణంలో నీతో కలిసి ఆడిన ప్రతి క్షణాన్ని ఆస్వాదించా. - విరాట్ కోహ్లీ

బంతితో మాయ చేసే మాంత్రికుడు. ఆటను చదవగలిగే ప్రజ్ఞాశీలి. - జైషా (ఐసీసీ చైర్మన్)



క్రికెట్ మాస్టర్ మైండ్

అశ్విన్ ఓ క్రికెట్ మేధావి. శక్తిని.. యుక్తిని కలగలిపి.. మైదానంలో బ్యాటర్ల బుర్రలను చదివేస్తాడు. కొందరు అతడు అతిగా ఆలోచిస్తాడని అంటే.. కాదు లోతుగా ఆలోచిస్తానని కౌంటరిస్తాడు. క్రికెట్ సైంటిస్ట్‌లా వినూత్న ఆవిష్కరణలతో అభిమానులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తూనే ఉంటాడు.

వికెట్‌తో సంబంధంలేదు.. వాతావరణం గురించి పట్టించుకోడు..ఆటను వేగంగా చదువుతాడు.. పక్కాగా లెక్కలేస్తాడు.. ఎత్తులు, జిత్తులతో ప్రత్యర్థులను ఉచ్చులో బిగిస్తాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తాడు.. గెలుపు కోసం బ్యాట్‌తోనూ పోరాడతాడు. ఇలా.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అనేక పాత్రలు పోషించిన అశ్విన్.. విలువలను వదలడు.. విమర్శలకు బెదరడు.. సవాళ్లకు వెరవడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అభద్రతా భావంలో జీవించడం అంటే.. మన శక్తిసామర్థ్యాలను మనమే తక్కువ చేసుకోవడం. దీన్ని చిన్ననాడే అధిగమించిన అశ్విన్.. కెరీర్ ఆసాంతం డేర్‌డెవిల్‌గానే సాగాడు. ఒడిదుడుకులు ఎదురైనా.. వాటిని సానుకూల దృక్పథంతో అధిగమించాడు. సమస్య మూలాలకు వెళ్లి శోధించాలి.. సాధించాలి అనేది అతడి నైజం. అలాంటి మనస్తత్వంతోనే మ్యాచ్ మ్యాచ్‌కూ తన నైపుణ్యాలను మెరుగులు దిద్దుకొంటూనే ఉన్నాడు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకొంటాడు.. ఎప్పుడూ నిత్యనూతనంగా ఉండేందుకు శ్రమిస్తూనే ఉంటాడు. జట్టులో చోటు కోల్పోయినా పట్టువదలకుండా ప్రయత్నించి ఎన్నోసార్లు పునరాగమనం చేశాడు.

పేసర్‌గా మొదలుపెట్టి..

మీడియం పేసర్, ఓపెనింగ్ బ్యాటర్ అశ్విన్‌ను ఆఫ్ స్పిన్నర్‌గా మార్చడంలో కోచ్ విజయ్ కుమార్ పాత్ర ఎంతో ఉంది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో ఓసారి నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ అలసిపోయాడు. దీంతో ఆఫ్ స్పిన్ ట్రై చేస్తానని కోచ్‌ను అడగడంతో సరేనన్నాడు. అయితే, బంతిపై అతడి నియంత్రణ చూసిన విజయ్ ఆశ్చర్యపోయాడు. దీంతో అశ్విన్‌ను ఇష్టం లేకపోయినా.. స్పిన్ బౌలర్‌గా మార్చాడు. దేశానికి గొప్ప బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను అందించాడు. మురళీధరన్, షేన్ వార్న్ తరహాలో బంతికి ఎక్కువగా స్పిన్ చేయకపోయినా.. తన ఎత్తును ఆసరాగా చేసుకొని అదనపు బౌన్స్‌ను రాబడుతూ ప్రత్యర్థులకు సింహస్వప్నంలా కనిపించేవాడు. బంతిని ఎక్కడైతే వేయాలనుకొంటాడో.. అక్కడే కచ్చితంగా ల్యాండ్ చేయడం అతడి ప్రత్యేకత. ఈ క్రమంలో తన రనప్, సీమ్, వివిధ రకాల ట్రిక్కులతో ప్రయోగాలు చేస్తుంటాడు.

సొంత పిచ్‌లపై ఎదురులేదు..

2010లో అంతర్జాతీయ అరంగేట్రం దరిమిలా అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. సొంతగడ్డపై 383 వికెట్లు పడగొట్టడం విశేషం. 2021లో సిడ్నీ టెస్ట్‌లో హనుమ విహారితో కలసి జట్టును ఓటమి నుంచి తప్పించాడు. ఎడమచేతి వాటం బ్యాటర్లకు అశ్విన్ అంటే దడ. టెస్టుల్లోనే 268 సార్లు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. ఇక జడేజాతో జోడీగా వికెట్ల జాతర చేశాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకు వీరిద్దరూ కలసి 45 టెస్టులు ఆడగా.. అందులో భారత్ 34 మ్యాచ్‌లు గెలిచింది. కోహ్లీ కెప్టెన్సీలో ప్రాధాన్యం కోల్పోయినా.. ఆశ వదులుకోకుండా టీమ్‌లోకి రావడానికి శ్రమించాడు. 2015 చెన్నై వరదల్లో తన కుటుంబం చిక్కుకున్నప్పుడు కూడా అతడు విదేశాల్లో ఎంతో ధైర్యంగా జట్టు కోసం పోరాడాడు. ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్‌తో సిరీస్ సందర్భంగా తల్లికి గుండెపోటు వచ్చినప్పుడు కూడా విరామం తీసుకొని వచ్చి మళ్లీ జట్టులో చేరాడు. బ్యాటర్‌గానూ అశ్విన్ సత్తాచాటాడు.

క్యారమ్ బాల్‌తో..

సమకాలీన క్రికెట్‌లో తెలివైన బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు పొందాడు. తన నైపుణ్యాలకు నిత్యం సానబెడుతూనే ఉంటాడు. బంతులతో కొత్తకొత్త ప్రయోగాలు చేస్తుంటాడు. అలా కనిపెట్టిందే క్యారమ్ బాల్. ఫింగర్ స్పిన్నర్లు దూస్రాలు మాత్రమే వేయగలరన్న అభిప్రాయాన్ని అతడు మార్చిచూపాడు. తనదైన రాంగ్ వన్ 'క్యారమ్ బాల్'ను సృష్టించి అందరినీ ఆశ్చర్యపర్చాడు. దీంతో కుడి చేతి వాటం బ్యాటర్లకు వణకుపుట్టించాడు. రానురాను అదే అతడి ట్రంప్ కార్డ్‌గా మారింది.

ప్రపంచకప్ సాధించడంలో..

ఐసీసీ టోర్నీల్లోనూ అశ్విన్ ఎంతో గొప్పగా రాణించాడు. 2011 వన్డే వరల్డ్‌కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీలను భారత జట్టు నెగ్గడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. 2010, 2016 ఆసియాకప్ నెగ్గిన జట్టులోనూ అశ్విన్ సభ్యుడు. 2023 వరల్డ్ కప్, 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2014 టీ20 వరల్డ్ కప్, 2019-21, 2021-23 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ అతను ఆడాడు.

వరుణుడు అడ్డుపడ్డాడు

ఆసీస్‌తో భారత్ మూడో టెస్ట్ డ్రా

బ్రిస్బేన్: భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్ట్‌లో ఊహించిన ఫలితమే వచ్చింది. ఎక్కువ భాగం వర్షార్పణమైన మ్యాచ్‌లో కీలక డ్రాతో రోహిత్ సేన గట్టెక్కింది. 5 టెస్ట్‌ల బోర్డర్-గవాస్కర్ సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉండగా..బాక్సింగ్ డే టెస్ట్ ఈనెల 26న మెల్‌బోర్న్‌లో ప్రారంభమవుతుంది. భారీ వర్షం..ఉరుములు, మెరుపులతో చివరి రోజు 22 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఇక..ఓవర్‌నైట్ 252/9 స్కోరుతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మరో 24 బంతులు ఆడి 260 పరుగులకు ఆలౌటైంది. దాంతో 185 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో 89/7 స్కోరుతో డిక్లేర్ చేసి సవాలు విసిరింది. ఆపై 275 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్..వెలుతురు లేమి, వర్షం వల్ల ఆట ఆపివేసే సమయానికి వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది.

ఆసీస్ సవాల్: నాలుగు ఓవర్లలోనే భారత ఇన్నింగ్స్‌కు ముగింపు పలికిన ఆస్ట్రేలియాను బుమ్రా, ఆకాశ్‌దీప్, సిరాజ్ కలిపి 11 ఓవర్లలో ఐదు వికెట్లు తీసి దెబ్బకొట్టారు. కాగా చివర్లో కేరీ, కమిన్స్ దూకుడుగా ఆడారు. కమిన్స్ అవుటయ్యాక ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో 54 ఓవర్లలో 275 పరుగుల లక్ష్యంతో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. కానీ మూడు ఓవర్లు కూడా పూర్తి కాకముందే వెలుతురు మందగించడం..ఆపైన భారీ వర్షంతో ఇక ఆట సాధ్యం కాలేదు. కాగా ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా బుమ్రా (53) నిలిచాడు. ఈ క్రమంలో కపిల్ దేవ్ (51 వికెట్లు) రికార్డును దాటేశాడు.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445; భారత్ తొలి ఇన్నింగ్స్: 260; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** మెక్‌స్వీనే (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 4; ఖవాజా (బి) బుమ్రా 8; లబుషేన్ (సి) పంత్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 2; హెడ్ (సి) పంత్ (బి) సిరాజ్ 17; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 4; కేరీ (నాటౌట్) 20; కమిన్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22; స్టార్క్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: 18 ఓవర్లలో 89/7 డిక్లేర్డ్; వికెట్లపతనం:**1-11, 2-16, 3-16, 4-28, 5-33, 6-60, 7-85 ; **బౌలింగ్ :** బుమ్రా 6-1-18-3; సిరాజ్ 7-0-36-2; ఆకాశ్‌దీప్ 5-1-28-2; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (నాటౌట్) 4; రాహుల్ (నాటౌట్) 4; **మొత్తం:2.1 ఓవర్లలో 8/0; బౌలింగ్:** స్టార్క్ 1.1-0-4-0; కమిన్స్ 1-0-4-0.

బిజినెస్

ఎస్‌బీఐ ఎండీగా తెలుగు బిడ్డ రామమోహన రావు



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా తెలుగువాడైన అమర రామమోహన రావు నియమితులయ్యారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థాగత ఆర్థిక సేవల బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ఈ ఏడాది సెప్టెంబరులో ఈ పదవికి ఆయన పేరును సిఫారసు చేసింది. నియామకాల కేంద్ర కేబినెట్ కమిటీ బుధవారం ఇందుకు ఆమోద ముద్ర వేసింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన రామమోహన రావు 1991లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బీఐలో చేరారు. ప్రస్తుతం బ్యాంకు డిప్యూటీ ఎండీగా పని చేస్తున్నారు. గత 33 సంవత్సరాలుగా ఆయన ఎస్‌బీఐకు చెందిన వివిధ విభాగాల్లో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది ఆగస్టు వరకు ఎస్‌బీఐ అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కార్డ్స్‌కు ఎండీ, సీఈఓగానూ పని చేశారు. అంతకు ముందు ఎస్‌బీఐ భోపాల్ సర్కిల్ సీజీఎంగానూ సేవలు అందించారు. సింగపూర్, అమెరికా దేశాల ఎస్‌బీఐల్లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పనితీరు ఆధారంగా రామమోహన రావు పదవీ కాలాన్ని రిటైర్మెంట్ వయసు 2028 ఫిబ్రవరి 29 వరకు పొడిగించే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు. మరో తెలుగువారైన శ్రీనివాసులు శెట్టి ఇప్పటికే ఎస్‌బీఐ చైర్మన్‌గా పని చేస్తున్నారు. ఎస్‌బీఐ చరిత్రలో ఇద్దరు తెలుగువారు ఒకే సమయంలో రెండు కీలక బాధ్యతలు నిర్వహించడం ఇదే మొదటిసారి. శ్రీనివాసులు శెట్టిని ఎస్‌బీఐ చైర్మన్‌గా నియమించడంతో ఏర్పడిన ఎండీ పోస్టులోనే రామ మోహన రావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

రియల్టీలో సంస్థాగత పెట్టుబడులు రూ.75,395 కోట్లు



2007 తర్వాత అత్యధికం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు ఈ రంగంలోకి 887 కోట్ల డాలర్ల (రూ.75,395 కోట్లు) మేరకు సంస్థాగత పెట్టుబడులు వచ్చినట్టు జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన 587 కోట్ల డాలర్ల (రూ.49,895 కోట్లు) కన్నా ఇది 51 శాతం అధికం. భారత రియల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడుల్లో ఇది ఒక మైలురాయి అని జేఎల్ఎల్ తాజా నివేదికలో పేర్కొంది. మొత్తం 78 డీల్స్ చోటు చేసుకున్నాయి. డీల్స్ సంఖ్య కూడా గత ఏడాదితో పోల్చితే 47 శాతం పెరిగింది. 2007లో వచ్చిన 840 కోట్ల డాలర్ల తర్వాత నమోదైన అధిక పెట్టుబడులివే. గృహ, కార్యాలయ, వేర్‌హౌసింగ్ ప్రాపర్టీలకు ఏర్పడిన డిమాండును సొమ్ము చేసుకునేందుకు సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెడుతున్నట్టు జేఎల్ఎల్ తెలిపింది. భారత రియల్టీ రంగంలో పెట్టుబడులు పెట్టిన వాటిలో 63 శాతం విదేశీ సంస్థలేనని పేర్కొంది. ప్రధానంగా రెసిడెన్షియల్ విభాగంలో 45% పెట్టుబడులు రాగా కార్యాలయ భవనాల విభాగంలో 28% , వేర్‌హౌసింగ్‌లో 23% పెట్టుబడులు వచ్చాయి. దేశీయ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరగడం కూడా ఒక విశేషమని జేఎల్ఎల్ సీనియర్ ఎండీ లతా పిళ్లై అన్నారు.

నవంబరులో పీఈ/వీసీ పెట్టుబడుల జోరు

పీఈ/వీసీ పెట్టుబడులు నవంబరు నెలలో భారీగా పెరిగాయి. గత ఏడాది నవంబరుతో పోల్చితే 156 శాతం పెరిగి 400 కోట్ల డాలర్లకు (రూ.34 వేల కోట్లు) చేరాయి. అక్టోబరుతో పోల్చితే వృద్ధి 15% ఉంది. మొత్తం 87 డీల్స్ చోటు చేసుకున్నాయని ఈవై ఒక నివేదికలో తెలిపింది. విభాగాల వారీగా చూసినట్టయితే 100 కోట్ల డాలర్లతో పారిశ్రామికోత్పత్తి రంగం అగ్రస్థానంలో ఉండగా 72.3 కోట్ల డాలర్లతో సర్వీసులు, 55 కోట్ల డాలర్లతో ఈ కామర్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మూడో రోజూ మార్కెట్‌కు నష్టాలే

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ మరో 502.25 పాయింట్లు పతనమై 80,182.20 వద్దకు జారుకుంది. నిఫ్టీ 137.15 పాయింట్లు క్షీణించి 24,198.85 వద్ద స్థిరపడింది. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణం. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు సైతం తరలిపోతుండటం మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.

జీవితకాల కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి క్షీణించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు నష్టపోయి రూ.84.94 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతోపాటు దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమైందని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.

● క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా సంస్థాగత ఇన్వెస్టర్లకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,000 కోట్లు సమీకరించినట్లు కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ (కేపీఐఎల్) వెల్లడించింది.

మార్చి నాటికి ఏపీ, తెలంగాణల్లో వొడాఫోన్ ఐడియా 5జీ సేవలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే ఏడాది మార్చిలోగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 5జీ సేవలు ప్రారంభించేందుకు వొడాఫోన్ ఐడియా సిద్ధమవుతోంది. కంపెనీ ఏపీ, తెలంగాణ, కర్ణాటక క్లస్టర్ బిజినెస్ హెడ్ ఆనంద్ దాని ఈ విషయం వెల్లడించారు. దీనికి సంబంధించి రెండు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ప్రయోగాత్మక పరీక్షలు జరుపుతున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఉన్న 4జీ మౌలిక సదుపాయాలను ఇందుకోసం రూ.4,122 కోట్లతో మరింత ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 4జీ సేవల డౌన్‌లోడ్ స్పీడ్, వీడియో ఎక్స్‌పీరియన్స్, లైవ్ వీడియో ఎక్స్‌పీరియన్స్, వాయిస్ యాప్ ఎక్స్‌పీరియన్స్ అంశాల్లో మిగతా ఆపరేటర్ల కంటే వొడాఫోన్ ఐడియా ముందున్నట్టు ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం 11,500కు పైగా టవర్లతో ఏపీ, తెలంగాణల్లోని 96 శాతం జనాభాకు వొడాఫోన్ ఐడియా 4జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లో త్వరలో మరో 11 సొంత స్టోర్లు ప్రారంభించనున్నట్టు ఆనంద్ తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం ఆరింటి వరకు ఉచిత డేటా, రూ.299 రీచార్జిపై అదనంగా 10 జీబీ డేటా ప్యాకేజిలకు ఖాతాదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్టు చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.ల్లో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,840 ▼	71,350 ▼	1,00,000 ▼
విజయవాడ	79,000 ▼	72,700 ▲	91,500 ▼
విశాఖపట్నం	77,050 ▲	70,630 ▲	90,630 ▲
రాజమండ్రి	77,840 ▼	71,350 ▼	91,900 ▼
ప్రొద్దుటూరు	78,700 ▼	72,880 ▲	91,070 ▼
ముంబై	76,650 ▲	70,220 ▲	89,060 ▲

ఫెడ్ రేటు 0.25% తగ్గింపు

ఈ ఏడాది మూడోసారి

న్యూయార్క్: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును మరో 0.25 శాతం తగ్గించింది. ఫెడ్ రిజర్వు చైర్మన్ జెరోం పావెల్ అధ్యక్షతన రెండ్రోజుల పాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఫెడ్ రేట్ల శ్రేణి 2022 డిసెంబరు నాటి స్థాయి 4.25-4.50 శాతానికి తగ్గింది. ఈ ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం వరుసగా ఇది మూడోసారి. 2025లో మాత్రం వడ్డీ రేట్లను మరో రెండు సార్లే తగ్గించే అవకాశం ఉందని ఫెడ్ రిజర్వ్ సంకేతాలిచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	610
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	102
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	97
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	108	అనంతపురం	97
గోదావరి	99		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ద్వితీయ శ్రేణి నగరాల్లో 30వేల ఐటీ ఉద్యోగాలు

2

తొలి విడతలో ఐదు జిల్లాల్లో కంపెనీల ఏర్పాటు

ఐటీసర్వ్ అలయన్స్‌తో ప్రభుత్వం భారీ ఒప్పందం

రాష్ట్ర ఐటీ ముఖ చిత్రమే మారిపోయే నిర్ణయమిది

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

గురువారం | 19-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 261 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



అదానీకి ప్రధాని అండ

చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీగా వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

ఇద్దరూ కలిసి దేశం పరువు తీశారు

కాంగ్రెస్ 75 ఏళ్లలో పెంచిన ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

అదానీ అవినీతిపై జేపీసీ ఎందుకు వేయడంలేదు?

బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ, ప్రధాని వైపా?

ఆ పార్టీ వైఖరేంటో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ చెప్పాలి

మోదీ జైల్లో పెడతారనే భయంతోనే మాట్లాడటం లేదు

జేపీసీపై బీఆర్ఎస్ డిమాండ్ చేస్తే అసెంబ్లీ తీర్మానం

నిరసన తెలిపే హక్కు సీఎంకూ ఉంటుంది: రేవంత్‌రెడ్డి

టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్

సీఎం, మంత్రులు, నేతల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ ముందు రోడ్డుపై సీఎం బైఠాయింపు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అదానీ, ప్రధాని కలిసి ప్రపంచం ముందు మన దేశం పరువు తీశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో వ్యాపారం చేయాలంటే లంచం ఇవ్వాలనే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లు కష్టపడి పెంచిన దేశ ప్రతిష్ఠను ప్రధాని, అదానీ అనుబంధం దెబ్బతీస్తోందన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల వైపు ఉంటారా? అదానీ-ప్రధాని వైపు ఉంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీకి వ్యతిరేకంగా మాట్లాడితే మోదీ జైల్లో వేస్తారని కేసీఆర్ కుటుంబం భయపడుతోందన్నారు. అమెరికాలో అదానీపై

మిగతా 2వ పేజీలో...



రోడ్డుపై బైఠాయించిన సీఎం రేవంత్

భూమికి భరోసా

సామాన్యుల భూహక్కులను పరిరక్షిస్తాం

ధరణితో అన్యాక్రాంతమైన భూముల గుట్టు రట్టు చేస్తాం

సభలో 'భూభారతి' బిల్లు ప్రవేశపెట్టిన పొంగులేటి

మ్యుటేషన్ సమస్యలు తీర్చేందుకు అప్పిలేట్ అథారిటీ

మళ్లీ రెవెన్యూ సదస్సులు, భూసమస్యల పరిష్కారం

భూవివాదాల అప్పీళ్లకు 'ల్యాండ్ ట్రైబ్యునల్స్' ఏర్పాటు

సాదా బైనామాలకు పరిష్కారం, భూధార్ నంబర్లు

బిల్లులోని ప్రత్యేకతలను వివరించిన మంత్రి పొంగులేటి

ప్రభుత్వ భూములను ఆక్రమించినవారిని వదలబోమని..

ఆ భూముల్ని స్వాధీనం చేసుకుని పేదలకిస్తామని వెల్లడి

ప్రభుత్వ ఆస్తుల్ని తారుమారు చేసే అధికారులకు శిక్షలు

అసైన్డ్ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ



ధరణిలో 33 మాడ్యూళ్లు ఉండేవి. ఇప్పుడు దాన్ని 6 మాడ్యూళ్లకు కుదిస్తున్నాం. మాన్యువల్ పహాణీలో ఉండే 32 కాలమ్‌లను గత ప్రభుత్వం ఒకే కాలమ్‌కు కుదించింది. ఇప్పుడు దాన్ని 11 కాలమ్‌లు చేస్తున్నాం. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించింది. భూభారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంది. - మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించినవారు ఎంత పెద్దవారైనా వదిలేది లేదని.. ఆ భూములను స్వాధీనం చేసుకుని, పేదలకు పంచుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇద్దరు వ్యక్తులు రెవెన్యూ చట్టం-2020ను ప్రజలపై రుద్దారని, పూర్తి అవినీతితో నిండిపోయిన ఆ చట్టానికి మూడేళ్లకే నూరేళ్లు నిండిపోయేలా ప్రజలు మార్గ నిర్దేశం చేశారని వ్యాఖ్యానించారు. దాని స్థానంలో తాము అందరికీ ఆమోదయోగ్యమైన చట్టాన్ని తెస్తున్నామని పేర్కొంటూ.. 'తెలంగాణ భూభారతి (భూమిపై హక్కుల రికార్డు) బిల్లు-2024'ను బుధవారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆ చట్టంలోని కీలక అంశాలు వెల్లడించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలో అనేక పొరపాట్లు ఉన్నాయని, 'ధరణి'తో రైతులకు అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. అందులోని పొరపాట్లు, లోపాలన్నింటినీ సరిదిద్ది, మేధావులతో చర్చించి కొత్త చట్టాన్ని రూపొందించామని, కాస్త ఆలస్యమైనా సమగ్రంగా తీసుకొచ్చామని పొంగులేటి వివరించారు. భూములున్న ప్రతి వ్యక్తికీ

మిగతా 11వ పేజీలో...

భూభారతి వచ్చేదాకా భూ సంబంధ ఆర్డర్లు వద్దు: మిత్తల్ ఆదేశాలు

ధరణితో 25వేల ఎకరాలు అన్యాక్రాంతం

11

ఇందులో ఎక్కువ శాతం జీహెచ్ఎంసీ పరిధిలోనివే

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోనే 10వేల ఎకరాలు

ఫోరెన్సిక్ ఆడిట్‌తో ఆ భూముల్ని గుర్తించి స్వాధీనం: భట్టి



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

పెనుగొండకు

లక్ష్మీనారాయణ రచించిన 'దీపిక'కు పురస్కారం

యాభై ఏళ్లకుపైగా తెలుగు సాహితీ సేద్యం

అరసం జాతీయ అధ్యక్షుడిగా సేవలు

2

వచ్చే ఏడాది మార్చి 8న అవార్డు ప్రదానం

అధిక పెన్షన్ పథకం


12

వివరాల సమర్పణకు

గడువు పెంపు

జనవరి 31 వరకు అవకాశం: ఈపీఎఫ్‌వో

ఇరకాటంలో అమిత్‌షా





12

అంబేడ్కర్ విషయంలో ఆయన వ్యాఖ్యలపై దుమారం

అంబేడ్కర్ చరిత్రను

తుడిచిపెట్టే కుట్రలు!

కాంగ్రెస్ బండారాన్ని అమిత్ షా బయటపెట్టారు

అందుకే కొత్త నాటకాలు.. ప్రధాని మోదీ ఆగ్రహం

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ 2 సార్లు ఎన్నికల్లో ఓడించింది

వ్యతిరేకంగా నెహ్రూ ప్రచారం.. 'భారతరత్న' ఇవ్వలేదు

పార్లమెంటు సెంట్రల్ హాలులో చిత్రపటం పెట్టలేదు

ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం: మోదీ

అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఎన్నటికీ మాట్లాడను: షా

ఇప్పుడు ఇదొక ఫ్యాషన్‌గా మారింది.. అంబేడ్కర్, అంబేడ్కర్, అంబేడ్కర్, అంబేడ్కర్, అంబేడ్కర్...

వారు ఇన్ని సార్లు భగవంతుడి పేరు తలచుకొంటే ఏడేడు జన్మల స్వర్గవాసం లభించేది.. అంబేడ్కర్ పేరు తలచుకోవడం మాకూ ఆనందమే! కానీ.. అదే సమయంలో మీరు (కాంగ్రెస్) ఆయన పట్ల అనుసరించిన వైఖరేమిటో ఇప్పుడు చెబుతా... అంటూ అమిత్‌షా మంగళవారం రాజ్యసభలో చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అంబేడ్కర్‌ను షా అవమానించారని విపక్షాలు ఆరోపించగా... తన వ్యాఖ్యలను వక్రీకరించారని షా మండిపడ్డారు. బుధవారం ఇదే అంశంపై రాజ్యసభ దద్దరిల్లింది. షా క్షమాపణ చెప్పాల్సిందేనని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. షా నోటి దురుసును దేశం సహించబోదని 'ఫేస్‌బుక్'లో రాహుల్ స్పష్టంచేయగా, కేంద్ర క్యాబినెట్ నుంచి షాను తక్షణం తొలగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. విపక్ష వాదనలను ప్రధాని గట్టిగా తిప్పికొట్టారు. అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు చేసిందని నిప్పులు చెరిగారు. అంబేడ్కర్ విషయంలో కాంగ్రెస్ పాపాలు చేసిందంటూ చిట్టాను బయటపెట్టారు. తాను అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని, మాట్లాడబోననీ అమిత్ షా స్పష్టం చేశారు.

12



పార్లమెంటు వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్, ఖర్గే, ప్రియాంక

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు: రాహుల్

క్యాబినెట్ నుంచి షాను తక్షణమే తొలగించాలి: ఖర్గే

2 నుంచి టెట్

ఫిబ్రవరి 5న ఫలితాలు

ఈ నెల 26 నుంచి హాల్ టికెట్లు

హైదరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టెట్ పరీక్షలు జనవరి 2 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2 నుంచి 20వరకు జరగనున్న పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు. రోజూ రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. టెట్ హాల్‌టికెట్లను ఈ నెల 26 నుంచి అందుబాటులోకి తీసుకొస్తారు. ఫలితాలను ఫిబ్రవరి 5న వెల్లడిస్తారు.



ముంబైలో పడవ ప్రమాదం..

13 మంది మృతి

ప్రాణాలతో బయటపడిన 101 మంది

ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొన్న నౌకాదళ బోటు

12

ఎఫ్-1ను హెచ్-1బీగా మార్చుకోవచ్చు!

వీసా నిబంధనలు సరళతరం

అమెరికా కంపెనీల్లో విదేశీ నిపుణులకు సులభంగా కొలువులు

బైడెన్ నిర్ణయం.. 17నుంచి అమలు

లక్షల మంది భారత ఐటీ నిపుణులకు ప్రయోజనం

12

కెనడాలో పాగా ఈజీ కాదు

జాబ్ ఆఫర్లపై ఇమిగ్రేషన్ పాయింట్ల ఎత్తివేత





గురుకులాలపై మాటల యుద్ధం

వసతులు, కలుషితాహార ఘటనలపై

అసెంబ్లీలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

పిల్లల ఆహారంలో తప్పు జరిగితే కఠిన చర్యలు

ఆహార భద్రతా కమిటీలు, టాస్క్‌ఫోర్స్‌లు

కోడిగుడ్డుకు 6 చొప్పున ఇవ్వాలని నిర్ణయం

విద్యా వ్యవస్థను గాడిన పెడుతున్నాం: సీతక్క

గురుకులాల్లో చదవాలంటే భయపడుతున్నారు

ఈ ఏడాది 54 మంది పిల్లల మృతి: గంగుల

ఇంకా యూనిఫాంలు ఇవ్వలేదు: హరీశ్

వ్యవస్థను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్: అక్బర్

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో గురుకులాలు, పాఠశాలల్లో మౌలిక వసతులపై చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. గురుకులాల్లో చదవాలంటేనే పిల్లలు భయపడుతున్నారని బీఆర్ఎస్ విమర్శించగా.. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ విద్యా వ్యవస్థను విస్మరించి.. ఇప్పుడు రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. గురుకులాల్లో కలుషితాహార

మిగతా 11వ పేజీలో...

సీఎం రేవంత్ ధర్నా

విడ్డూరం

2

అదానీపై మాట్లాడే నైతిక హక్కు సీఎంకు లేదు

అవినీతి జరిగిందని ఒక్క సాక్ష్యమైనా చూపగలరా?

తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు

స్కిల్స్ వర్సిటీ కోసం అదానీని రూ.100కోట్లు అడిగినప్పుడు ఈ అంశం గుర్తు లేదా?

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు

అంబేడ్కర్‌లో 'అ' పలికే అర్హత కూడా

కాంగ్రెస్‌కు లేదు

3

కేంద్ర మంత్రి బండి సంజయ్



ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

దమ్ముంటే చర్చ పెట్టండి

'ఫార్ములా-ఈ'పై శాసనసభలో చర్చించాలి

అప్పుడే ప్రజలకు నిజాలు తెలుస్తాయి

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

ఆటో నడుపుకుంటూ అసెంబ్లీకి వచ్చిన కేటీఆర్

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్

అదానీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ర్యాలీపై ఎద్దేవా

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఫార్ములా ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చర్చ జరిగితేనే ప్రజలకు నిజానిజాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు

మిగతా 9వ పేజీలో...

లగచర్ల రైతులకు ఊరట

23 మందికి బెయిల్..

3

పట్నం నరేందర్‌రెడ్డికి కూడా

విచారణకు సహకరించాలి: కోర్టు

ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించాలనలేదు

సచివాలయం పక్కన అసెంబ్లీ కట్టాలని మాత్రమే అన్నాను

ఎన్టీఆర్ ఓ లెజండరీ.. ఆయనంటే నాకు అభిమానం

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించాలని తాను అనలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సచివాలయం పక్కన కొత్త అసెంబ్లీ కడితే బాగుంటుందని మాత్రమే అన్నానని చెప్పారు. తాను అనని మాటలను కొందరు కావాలని ప్రచారం చేస్తున్నారని తప్పుబట్టారు. ఎన్టీఆర్ అంటే తనకు ఎంతో అభిమానమని, ఆయన ఓ లెజండరీ పర్సనాలిటీ అని అన్నారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన వ్యక్తి అని కొనియాడారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ సచివాలయం పక్కన కొత్త అసెంబ్లీ కడితే బాగుంటుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించి అక్కడ అసెంబ్లీ కట్టాలంటూ రాజగోపాల్‌రెడ్డి అన్నట్లుగా కొన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. దీంతో ఆయన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఎన్టీఆర్ అభిమానులు నిరసన తెలిపారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీలోనూ అంతర్గతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. తెలంగాణలో పెద్దసంఖ్యలో ఎన్టీఆర్‌కు అభిమానులు ఉన్నారని, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి తన వ్యాఖ్యలపై బుధవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు.

ద్వితీయశ్రేణి నగరాల్లో 30వేల ఐటీ ఉద్యోగాలు

- **తొలి విడతలో ఐదు జిల్లాల్లో కంపెనీల ఏర్పాటు**
- **ఐటీసర్వ్ అలయన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం భారీ ఒప్పందం**

హైదరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఐటీ కంపెనీల అతి పెద్ద సంఘంగా ఉన్న ఐటీ సర్వ్ అలయన్స్ రాష్ట్ర ప్రభుత్వంతో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో 30వేల ఐటీ ఉద్యోగాలు కల్పించేందుకు సహకారం అందించనుంది. దీనికి సంబంధించిన ఒప్పంద కార్యక్రమం బుధవారం సచివాలయంలో జరిగింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఐటీ సర్వ్ అలయన్స్ జాతీయ అధ్యక్షుడు జగదీశ్ మోసాలి పాల్గొన్నారు. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీని విస్తరిస్తారు. తొలి విడతలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఐటీ కంపెనీల విస్తరణతో పాటు అక్కడ స్థానికులకు కావాల్సిన నైపుణ్య శిక్షణను అందిస్తారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ కార్యక్రమాలు చేపడతారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉన్న సానుకూలతలు, ప్రయోజనాలపై సభ్య కంపెనీల్లో అవగాహన కల్పించేందుకు ఐటీ సర్వ్ అలయన్స్ ప్రధానంగా దృష్టి పెడుతుందని ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జగదీశ్ మోసాలి తెలిపారు. ఐటీని జిల్లాలకూ విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఐటీని జిల్లాలకు విస్తరించాలన్న తమ లక్ష్యానికి అనుకూలంగా ఈ ఒప్పందం కీలక అడుగు అన్నారు. ద్వితీయశ్రేణి నగరాల్లో 30వేలకు పైగా ఐటి ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వం లక్ష్యమని, దీంతో రాష్ట్ర ఐటి ముఖచిత్రమే మారుపోతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌తో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా భేటీ

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న విధానాలపై తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్(టీజీపీఎస్సీ) అధికారులు అధ్యయనం ప్రారంభించారు. బుధవారం ఢిల్లీలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఐదుగురు కమిషన్ సభ్యులతో కలిసి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)ను సందర్శించారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ చైర్‌పర్సన్ ప్రీతి సుడాన్‌తో విస్తృత చర్చలు జరిపారు. యూపీఎస్సీలో అమలవుతున్న విధానాలు, విధులకు సంబంధించిన ప్రదర్శనను(ప్రజంటేషన్) ఈ బృందం తిలకించింది. కమిషన్‌కు నిధులను సమకూర్చడంతో పాటు, నియామకాల్లో ఐటీని ఉపయోగించుకునే అంశంపై చర్చించారు. నియామకాల్లో భాగంగా నిర్వహించే పరీక్షలను మరింత సమర్థంగా ఎలా జరపాలి? పారదర్శకతను పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. కాగా ఈ ఏడాది కాలంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో 13 వేల పోస్టులను భర్తీ చేసినట్లు చైర్మన్ ఈ సందర్భంగా వెల్లడించారు.

కొత్త రెవెన్యూ చట్టం వచ్చేదాకా.. భూ సంబంధ ఆర్డర్లు ఇవ్వొద్దు

- **కలెక్టర్లకు నవీన్ మిత్తల్ ఆదేశాలు**

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురానుందని, అప్పటి వరకు భూములకు సంబంధించిన అంశాలపై ఎలాంటి ఆర్డర్లను జారీ చేయవద్దని భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం ఆదేశాలను జారీ చేశారు. రాబోయే కొత్త చట్టం ప్రకారమే భూ సంబంధ సమస్యలను పరిష్కరించాలని ఆ ఆదేశాల్లో కలెక్టర్లకు సూచించారు. తదుపరి ఆదేశాలను జారీ చేసే వరకు భూ సంబంధిత విషయాల జోలికి వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈ ఆదేశాలను అతిక్రమించి ఏవైనా ఆర్డర్లను జారీ చేసినా, అవి చెల్లుబాటు కావని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలోని అధికారులందరికీ ఈ ఆదేశాలను చేరవేయాలని, ఉల్లంఘనలకు పాల్పడేవారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈఎన్‌సీగా విజయ భాస్కర్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈఎన్‌సీ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్)గా జి. విజయ భాస్కర్‌రెడ్డికి బాధ్యతలు కట్టబెట్టింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మెమో జారీ చేశా రు. ప్రస్తుతం నాగర్‌కర్నూలు చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా విజయభాస్కర్ పనిచేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులో ఆయన పదవీ కాలం ముగియనుంది. ఈ నియామకం పట్ల హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

పుస్తక ప్రియులకు పండుగ!

- **నేటి నుంచి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో బుక్ ఫెయిర్**

కవాడిగూడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రియులకు పండుగ తీరొక్క పుస్తకాలు చూసి.. నచ్చిన పుస్తకాలను సొంతం చేసుకునేందుకు పుస్తక ప్రదర్శన వచ్చేసింది. ఎన్టీఆర్ స్టేడియంలోని తెలంగాణ కళాభారతిలో గురువారం నుంచి జనవరి 29వ తేదీ వరకు 37వ బుక్‌ఫెయిర్ నిర్వహించనున్నారు. మొత్తంగా 350 స్టాళ్లు ఉంటాయని.. వీటిలో 171 తెలుగు, 135 ఇంగ్లిష్, 17 ప్రభుత్వ స్టాళ్లు, ఏడు రచయితల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య పేరు పెట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న రెండు వేదికల్లో ఒకదానికి బోయి విజయభారతి పేరు, మరోదానికి తోపుడు బండి సాధిక్ పేరు పెట్టనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారుల కోసం చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోసం ప్రత్యేకంగా సలహాదారుల కమిటి ఏర్పాటు చేశారు. కమిటీలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీనియర్ పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ రమామేల్కోటే ఉన్నారు. బుక్ ఫెయిర్‌కు వచ్చే పుస్తక ప్రియుల కోసం మంచినీటి వసతి, మొబైల్ టాయిలెట్లు, శాశ్వత టాయిలెట్లు, ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం, ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్ష కార్యదర్శులు కవి యాకుబ్, వాసు వివరాలు వెల్లడించారు. బుక్ ఫెయిర్‌ను మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ నుంచి వస్తున్న 22 ధాన్యం లారీలు వెనక్కి

- **రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు**

కోదాడ రూరల్, దామరచర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ వైపు నుంచి తెలంగాణలోకి వస్తున్న 22 ధాన్యం లోడు లారీలను అధికారులు అడ్డుకుని వెనక్కు పంపించారు. సరిహద్దు చెక్‌పోస్టు దాటి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణలోకి రాకుండా నిఘా పటిష్ఠం చేశారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి రాష్ట్రంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన 12 ధాన్యం లారీలను, నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద 10 ధాన్యం వాహనాలను చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

ఎంపీ అర్వింద్‌కు హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. మాజీ సీఎం కేసీఆర్‌ను అసభ్యపదజాలంతో దూషించారనే ఆరోపణలపై వివిధ పోలీసుస్టేషన్లలో తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టేయాలని ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లను హైకోర్టు బుధవారం కొట్టేసింది. అయితే, ఆయా కేసుల్లో ట్రయల్ కోర్టు ఎదుట వ్యక్తిగత హాజరు నుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. విచారణకు హాజరు కావాలని ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేస్తే మాత్రం హాజరవ్వాల్సిందేనని తీర్పు ఇచ్చింది.

కాకినాడ పోర్టు కేసు.. రంగంలోకి ఈడీ!

- **వైవీ తనయుడికి నోటీసులు?**
- **మనీలాండరింగ్‌పై ప్రాథమికంగా నిర్ధారణ**

కాకినాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీలోని కాకినాడ సీపోర్టులో వాటాలను కారుచౌకగా కొట్టేసిన కేసు కీలక మలుపు తిరిగింది. ఇందులో లోగుట్టు వెలికి తీసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. జగన్ హయాంలో చోటు చేసుకున్న ఈ బలవంతపు డీల్ వెనుక భారీగా మనీ లాండరింగ్ జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఈ వ్య వహారంలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. కాకినాడ సీపోర్టు అసలు యజమాని కేవీరావును జగన్ సన్నిహితులు బెదిరించి, భయపెట్టి కారుచౌకగా వాటాలు కొట్టేసిన వైనంపై ఈడీకి పలు ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. వాటిని పరిశీలించిన ఈడీ.. ఈ 'డీల్'లో మనీలాండరింగ్ చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించిన మరి న్ని వివరాలు రాబట్టేందుకు విక్రాంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

అదానీకి ప్రధాని అండ

(మొదటిపేజీ తరువాయి)

నమోదైన కేసుల్లో, ఆర్థిక అవకతవకలపై జేపీసీ వేసి విచారణ జరపాలని, మణిపూర్‌లో తీవ్రమైన శాంతిభద్రతల సమస్య ఉన్నప్పటికీ ప్రధాని మోదీ ఇప్పటివరకు సందర్శించక పోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో 'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమం చేపట్టారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ రోటరీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరారు. అయితే పోలీసులు రాజ్‌భవన్‌కు సమీపంలోనే బారికేడ్లు పెట్టి ర్యాలీని అడ్డుకున్నారు. దాంతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ ముందే రోడ్డుపై బైఠాయించారు. ప్రధాని, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుందని తెలిపారు. దేశ పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలని, ఈ విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలని డిమాండ్ చేశారు. కానీ, అదానీ అవినీతిపై చర్చకు, జేపీసీ వేసేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా లేరని అన్నారు. అలా చేస్తే అదానీ జైలుకు వెళ్లాల్సివస్తుందని ఆయనను కాపాడేందుకే మోదీ యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

ప్రజల వైపా? అదానీ, ప్రధాని వైపా?

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వమే ధర్నాలో కూర్చోవడమేంటని కొందరు అనుకోవచ్చని, కానీ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చట్టసభలను స్తంభింపజేసినా, ఎన్ని నిరసనలు చేపట్టినా మోదీ దిగి రావడం లేదని, అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చిందని తెలిపారు. "ముఖ్యమంత్రి నిరసన ఎలా చేస్తాడని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. అయితే నేను చేయను.. మరి మీరు చేయాలి. అదానీ విషయంలో కేసీఆర్ విధానమేంటో చెప్పాలి. బీజేపీ పెద్దల కాళ్లు మొక్కి అరెస్టులను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీపై వారు స్పందించడం లేదు. అదానీపై, జేపీసీపై మీ వైఖరేంటో చెప్పి.. మీ ఎంపీలతో లేఖ రాయించాలి" అని సీఎం రేవంత్ అన్నారు. మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదని, నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారని విమర్శించారు. బీఆర్ఎస్ జేపీసీపై డిమాండ్ చేస్తే అసెంబ్లీ తీర్మానం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్విటర్‌లో కారుకూతలు కూయకుండా చర్చకు రావాలని సవాల్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశ సంపదను, వనరులను బీజేపీ నాయకత్వానికి దగ్గరగా ఉండే కొద్ది మందికి దోచి పెట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా, మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచే అదానీతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ అన్నారు. జాతి వివక్షతో మణిపూర్ రాష్ట్రం తగలబడుతున్నా మోదీ మౌనం దాలుస్తున్నారని మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ అదానీ కుంభకోణాలపై ఎన్డీఏ ప్రభుత్వం జేపీసీ వేయడానికి ఎందుకు జంకుతోందని ప్రశ్నించారు.



'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, దామోదర, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు

ఇందిరా రోటరీ నుంచి సీఎం ర్యాలీ..

చలో రాజ్‌భవన్ ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల నుంచి 12.45కు నేరుగా చేరుకున్నారు. నేతలు, కార్యకర్తలంతా ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో భారీగా నిల్చోగా.. సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు విగ్రహం వైపు వెళ్లకుండా ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ముందుకు సాగగా.. వెనకాల సీఎం, మంత్రులు, నేతల వాహన శ్రేణి కదిలింది. అయితే రాజ్‌భవన్ వరకు ర్యాలీకి పోలీసులు అనుమతినివ్వకపోవడంతో నేతలంతా లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ఎదుట రోడ్డుపైనే బైఠాయించారు. మోదీ, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై సీఎం బైఠాయింపు నేపథ్యంలో ఖైరతాబాద్ నుంచి రాజ్‌భవన్ వైపు రోడ్డును పూర్తిగా మూసేశారు. రాజ్‌భవన్‌కు ఇరువైపులా వంద మీటర్ల మేర బారికేడ్లను ఏర్పాటు చేసి కాంగ్రెస్ నేతలెవరూ రాకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీఎం రేవంత్ ధర్నా విడ్డూరం

- **కాంగ్రెస్ దివాలాకోరుతనానికి నిదర్శనం**
- **అదానీపై మాట్లాడే నైతిక హక్కు సీఎంకు లేదు**
- **ఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్, ఆయన మంత్రి వర్గ సహచరులు, పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి రాజ్ భవన్ ఎదుట ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, అదానీపై విమర్శలు చేస్తూ సీఎం, కాంగ్రెస్ నేతలు ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. అదానీపై మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్‌కు లేదని అన్నారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100కోట్ల మేర సాయం చేయాలని అదానీని ఎందుకు అడిగారు? ఎవరు అడిగారు? అప్పుడు ఈ విషయాలన్నీ గుర్తు లేవా?... ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఢిల్లీలోని అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలి? అవినీతి జరిగిందని ఒక సాక్ష్యమైనా చూపిస్తారా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సీఎం రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. అమెరికాలో ఎవడో ఆధారాల్లేకుండా అదానీపై మాట్లాడితే దానిమీద రాద్ధాంతం చేయడం కాంగ్రెస్ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవనం ఎదుట ధర్నా చేస్తామని రేవంత్ చెప్పడం సిగ్గుచేటని, తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని స్పష్టం చేశారు.

వసూళ్లలో దొందూ దొందే

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారని, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేయడంలో దొందూ దొందేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను వంచించడంలో, తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు తేడా లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల్లోనూ ఆ రెండు పార్టీల తీరు ఒక్కటేనని గుర్తు చేశారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే, రేవంత్ మరింత దిగజారుస్తున్నారని విమర్శించారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి సెన్సేషన్ క్రియేట్ చేయడం, హైడ్రా-మూసీ పేరుతో ఇళ్లు కూలగొట్టడం... తప్ప ఏమైనా చేశారా? అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు.

రాహుల్‌కు విజనుంది.. త్యాగ గుణమూ ఉంది

మోదీకి ఆ రెండూ లేవు.. తాను, అదానీ బాగుండాలన్నదే ఆయన నినాదం

- **అందుకే దేశ సంపదను దోచి పెడుతున్నడు**
- **ప్రజల కోసమే 'మోదీ, అదానీకో హటావో, దేశ్‌కో బచావో' నినాదాన్ని రాహుల్ ఎత్తుకున్నడు**
- **హరీశ్ కోరినట్లు అసెంబ్లీలో 'డ్రంకెన్' టెస్టు పెట్టేందుకు సీఎంకు ఏ అభ్యంతరం లేదు..**
- **ఆ టెస్టు పెడితే కేసీఆర్ అసెంబ్లీకే రాడేమో..!**
- **రాహుల్ దాకా ఎందుకు మాట్లాడతవు కిషన్‌రెడ్డీ.. అదానీ గురించి అమెరికా చెప్పలేదా?**
- **కవిత 3 నెలలు జైల్లో ఉండి డిస్ట్రబ్ అయింది..**
- **మూసీ గురించి ఆమెకు తొందరెందుకు?**
- **టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి**



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అదానీ కళ్లలో ఆనందం చూసేందుకు దేశాన్నే ప్రధాని నరేంద్ర మోదీ పణంగా పెడుతున్నారని, ప్రజల సంపదను ఆయనకు దోచి పెడుతున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి మండిపడ్డారు. దేశ భవిష్యత్తు, ప్రజల మేలు కోసమే 'అదానీ, మోదీకో హటావో, దేశ్ కో బచావో' నినాదాన్ని రాహుల్ గాంధీ ఎత్తుకున్నారని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పేదల కడుపు నింపేందుకు ఉపాధి హామీ వంటి అద్భుత పథకాలను సోనియా, మన్మోహన్‌సింగ్‌ల నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం తెచ్చిందని, పేదల సంక్షేమం కోసమూ పని చేసిందని గుర్తుచేశారు. అయినా మోదీ మాటలను దేశం నమ్మిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలే గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేసుకుంటూ డబ్బులు సంపాదించుకుంటుంటే.. మోదీ మాత్రం పేదల డబ్బును అదానీకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ విజన్ ఉన్న.. త్యాగం చేసే గుణమున్న నాయకుడని.. మోదీకి ఆ రెండూ లేవని.. తాను, అదానీ బాగుండాలన్నదే ఆయన నినాదమని విమర్శించారు. ప్రజలు ఇది గమనించాలని కోరారు.

కిషన్‌రెడ్డి.. స్క్రిప్టు రెడ్డి!

'అదానీపై ఆరోపణలకు ఆధారాలుంటే ఇవ్వాలంటూ కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నడు. ఆయన సెంట్రల్ మినిస్టర్‌గిరీ చేస్తున్నడా.. లేక చౌకీదార్ పని చేస్తున్నడా? రాహుల్ దాకా వెళ్లి మాట్లాడుతున్నడు. అదానీ మోసం చేసినట్లుగా అమెరికానే చెబుతుంటే ఆయనకు ఇంకేం సాక్ష్యం కావాలి?' అంటూ జగ్గారెడ్డి నిలదీశారు. కిషన్‌రెడ్డి సొంతంగా ప్రెస్‌మీట్ కూడా పెట్టలేడని, ఎవరో స్క్రిప్టు రాసిస్తే చదువుతాడన్నారు. అందుకే ఆయన ప్రెస్‌మీట్లలో స్పష్టత ఉండదని చెప్పారు. కిషన్‌రెడ్డి కాదు.. ఆయన స్క్రిప్టురెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. ఆయన పార్టీ ఇచ్చిన స్క్రిప్టు కన్నా ఎక్కువ మాట్లాడితే ఉద్యోగం ఊడుతదన్న భయం ఆయనకు ఉందన్నారు.

అప్పుడు కేసీఆర్ అసలే రాడేమో..

'అసెంబ్లీలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలంటూ హరీశ్‌రావు మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు ఎందుకు? ఇప్పటికే కేసీఆర్ సభకు రావట్లేదు. ఆ టెస్టు పెడితే సభకు అసలే రాడు' అని జగ్గారెడ్డి అన్నారు. హరీశ్ కోరిక మేరకు అసెంబ్లీలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టడానికి సీఎంకు ఏ అభ్యంతరం లేదని, అయితే హరీశ్ మళ్లొకసారి కేసీఆర్‌ను అడిగి చెబితే మంచిదన్నారు. కేసీఆర్ అసలు సభకు రావద్దనే డ్రంకెన్ టెస్టు పెట్టాలని హరీశ్ అనుకుంటున్నారని అనుమానం వ్యక్తం చేశారు. కవిత జైలుకు వెళ్లి వచ్చాక మెంటల్‌గా డిస్ట్రబ్ అయి ఏదేదో మాట్లాడుతోందని, ఆమెకు రెస్టు అవసరమన్నారు. తాను జైల్లో ఉన్నా ఆమెలాగే డిస్ట్రబ్ అవుతానని చెప్పారు. మూసీ గురించి ఇప్పుడే ఆమెకు ఎందుకంత తొందరని ప్రశ్నించారు.

రచయిత పెనుగొండకు సాహిత్య అకాడమీ అవార్డు

లక్ష్మీనారాయణ వ్యాససంపుటి 'దీపిక' ఎంపిక .. పల్నాడులో జననం.. న్యాయస్థానంలో ప్రాక్టీస్

- **50 ఏళ్లకుపైగా తెలుగు సాహితీ సేద్యం**
- **అరసం జాతీయ అధ్యక్షుడిగా సేవలు**
- **వచ్చే ఏడాది మార్చి 8న అవార్డు ప్రదానం**



గుంటూరు, న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు 2024 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆయన రచించిన దీపిక అనే సాహిత్యవిమర్శ సంపుటికి ఈ పురస్కారం ఇస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రకటించారు. దేశంలో 21 భారతీయ భాషల్లో సాహిత్య అకాడమీ పురస్కారాల వివరాలను ఆయన వెల్లడించారు. అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ పురస్కారాలను ఖరారు చేసినట్లు ఆయన చెప్పారు. కాగా, అవార్డు దక్కించుకున్న 'దీపిక'ను ఆయన 2021లో రచించారు. కాగా తెలుగులో అవార్డు ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులుగా 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకుడు కె.శ్రీనివాస్, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, విహారి వ్యవహరించారు. పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.

సాహితి కొండ.. పెనుగొండ

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువు కొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టారు. అటుపై గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా 1989-90లో పనిచేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగాను, బార్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్‌గాను బాధ్యతలు నిర్వహించారు. తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 2023 ఆగస్టు నుంచి అరసం జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితివేత్త ఆయనే కావడం విశేషం. వివిధ అంశాలపై 200 వ్యాసాలు, దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందుమాటలు, పదుల సంఖ్యలో పుస్తక సమీక్షలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. ఇదీ పెనుగొండ లక్ష్మీనారాయణ ట్రాక్ రికార్డు. 1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. అటుపై రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతోపాటు అనేక పుస్తక సమీక్షలు, డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపాదకత్వం వహించారు. ఉగాది కవి సమ్మేళనాలకు ప్రత్యామ్నాయంగా మేడే నాడు కవితా గోష్ఠులను గుంటూరులో 'అవగాహన'తో కలిసి నిర్వహిస్తున్నారు.


కా.రా.ను కదిలించిన పరిశోధన

కేంద్ర సాహిత్య అకాడమీ 1997లో హైదరాబాద్‌లో నిర్వహించిన వర్క్‌షాపులో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ఈ పరిశోధన ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావును కదిలించింది. దాని ఆధారంగానే శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు.

గర్వంగా భావిస్తున్నాను....

సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. "ఇప్పటివరకు నేను చేసిన రచనల్లో 'దీపిక' ప్రత్యేకమైంది. సాహిత్య అకాడమీ అవార్డు వరించడాన్ని గర్వంగా భావిస్తున్నా. సాహితీ ప్రపంచంలో అరసం నాకు ఒక స్థానం కల్పించింది. ఇకపైనా అరసం వారసత్వాన్ని కొనసాగిస్తాను"అని పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు.

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న మేకల తిరుపతన్న(అప్పటి అడిషనల్ ఎస్పీ) బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ పిటిషన్ బుధవారం జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనల తర్వాత జనవరి 2కు కేసు విచారణను వాయిదా వేసింది.





సదస్సులో తెలుగు ఎంపీలు మల్లు రవి, చామల, ఆర్ కృష్ణయ్య

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాల్సిందే

» పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తుతాం: తెలుగు ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. 'కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి' అనే అంశంపై బుధవారం కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో సదస్సు జరిగింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలు ఈ సదస్సుకు హాజరై మాట్లాడారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలనడం న్యాయమైన డిమాండ్ అని ఎంపీ మల్లు రవి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి రాష్ట్రపతికి లేఖ రాశారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఆర్బీఐ రూపకల్పనలో కృషి చేసిన అంబేడ్కర్ ఫొటోనే కరెన్సీ నోట్లపై లేకపోవడం బాధాకరమని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

అరెస్టుతో మైలేజీ భ్రమలో కేటీఆర్: చామల

» అమిత్ షా క్షమాపణలు చెప్పాలి: మల్లు రవి

న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరెస్టుతో మైలేజ్ వస్తుందన్న భ్రమలో కేటీఆర్ ఉన్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇప్పటికే జైలుకెళ్లి వచ్చారని, జైలుకెళ్లే విషయంలో కేసీఆర్ కుటుంబంలో పోటీ నడుస్తోందని ఎద్దేవా చేశారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో మకర ద్వారం వద్ద ఆందోళన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆ అర్హత కాంగ్రెస్‌కు లేదు: కేంద్ర మంత్రి బండి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరులోని 'అ' పలికే అర్హత కూడా కాంగ్రెస్‌కు లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు." అంబేడ్కర్‌కు మాటిచ్చి మోసం చేసింది కాంగ్రెస్. పార్టీలో ఆయనను మోసం చేయడమే కాకుండా ఆయన పార్టీని వీడేలా అగౌరవపరిచింది కాంగ్రెస్" అని ఎక్స్ వేదికగా ఆయన దుయ్యబట్టారు.

క్రైస్తవులతో కాంగ్రెస్‌ది విడదీయరాని బంధం

» టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులతో కాంగ్రెస్ పార్టీది విడదీయరాని సంబంధమని, అసెంబ్లీ ఎన్నికల్లో వారు కాంగ్రెస్‌కు బాసటగా నిలిచారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. రానున్న మూడేళ్లలో క్రైస్తవ భవన్ కట్టి తీరుతామని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ, మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.1.31 కోట్ల లూటీ

» రూ. 50 లక్షలు వెనక్కిరప్పించే యత్నంలో పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్ పేరుతో నగరానికి చెందిన ఓ వ్యాపారి నుంచి సైబర్ కేటుగాళ్లు రూ.1.31 కోట్లను లూటీ చేశారు. బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో.. రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ బృందాలు రూ.50 లక్షలను వెనక్కి తెప్పించనున్నాయి. నగరానికి చెందిన 53 ఏళ్ల వ్యాపారికి "పీఎంఎల్ ప్రో యాప్‌లో ట్రేడింగ్ చేయండి.. ఎక్కువ లాభాలు పొందండి" అని సందేశం వచ్చింది. దాంతో బాధితుడు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. మొదట్లో తక్కువ మొత్తం పెట్టుబడులు పెట్టించి, ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించారు. దీంతో బాధితుడు రూ.1.31 కోట్లను ఇన్వెస్ట్ చేయడంతో.. యాప్ స్తంభించిపోయింది. దాంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ బృందాలు.. నిందితుడి ఖాతాలోని రూ.50 లక్షలను ఫ్రీజ్ చేయించాయి. అప్పటికే కేటుగాళ్లు రూ.80 లక్షలను వాడేసుకున్నట్లు గుర్తించాయి. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే.. పోగొట్టుకున్న డబ్బులో కొంతైనా వెనక్కి తెప్పించవచ్చని డీసీపీ కవిత వివరించారు.

డిజిటల్ అరెస్టు.. రూ.9.30 లక్షల దోపిడీ

» కిడ్నాపర్ల సొమ్ము ఖాతాలోకి వచ్చిందని బెదిరింపులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): "హలో.. ఓ బాలుడు కిడ్నాప్‌నకు గురయ్యాడు. కిడ్నాపర్లు అతని తండ్రి వద్ద వసూలు చేసిన డబ్బులు మీ బ్యాంకు ఖాతాకు బదిలీ అయ్యాయి" అంటూ డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి రూ.9.30 లక్షలు దోచుకున్న ఉదంతమిది. ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేసి.. కిడ్నాపర్లు, అసాంఘిక శక్తులు మీ బ్యాంకు ఖాతాను ఉపయోగించుకున్నాయంటూ బెదిరించారు. పోలీసు యూనిఫాంలో వీడియో కాల్ చేసిన కేటుగాడు.. తనను ముంబై డీసీపీగా పరిచయం చేసుకుని, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించాడు. "మీ ఇంటి చుట్టూ ముంబై పోలీసులు మఫ్టీలో ఉన్నారు. ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారు" అని బెదిరిస్తూ.. బాధితుడి ఫొటోను మార్ఫింగ్ చేసి, కిడ్నాపర్లతో ఉన్నట్లు చూపించాడు. ఆ తర్వాత రూ.9.30 లక్షలను తన ఖాతాలోకి బదిలీ చేయించుకున్నాడు. గంట గంటకూ వీడియో కాల్ చేసి, హాజరీ ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షూటింగ్‌లో నటితో అసభ్య ప్రవర్తన

» యూట్యూబర్ ప్రసాద్ బెహ్రా అరెస్టు



ప్రసాద్ బెహ్రా

బంజారాహిల్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహచర నటిని వేధించిన కేసులో యూట్యూబర్, నటుడు ప్రసాద్ బెహ్రాను జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మణికొండ పంచవటి కాలనీలో నివాసముండే ఓ యూట్యూబ్ నటి.. ప్రసాద్ బెహ్రా నిర్మిస్తున్న వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. సైలెంట్ వ్యాలీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 14న షూటింగ్ జరుగుతుండగా అసభ్యంగా ప్రవర్తించాడని, ముఖం బాగా కనిపించేందుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకో అంటూ ఇబ్బందికర వ్యాఖ్యలు చేశాడని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రసాద్ బెహ్రాపై కేసులు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎమ్మెల్యే లేకుండా చెక్కుల పంపిణీ వద్దు

» మేడ్చల్ జిల్లా యంత్రాంగానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందజేసే ఎలాంటి చెక్కులైనా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లేకుండా పంపిణీ చేయొద్దని, ఎమ్మెల్యే లేకుండా నిర్వహించే అన్ని చెక్కుల పంపిణీ కార్యక్రమాలను ఈనెల 23 వరకు నిలిపేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు మేడ్చల్ కలెక్టర్, కూకట్‌పల్లి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్‌కు జస్టిస్ మాధవీ దేవి ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బండి రమేశ్‌తో అధికారులు చెక్కులు పంపిణీ చేయిస్తున్నారని, ప్రజలు ఎన్నుకున్న తనను పక్కనపెట్టడం అక్రమమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 23 వరకు చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను 23కు వాయిదా వేసింది.

వణికిస్తున్న చలి పులి!

» సిర్పూర్‌లో 5.9, బేలలో 6 డిగ్రీల ఉష్ణోగ్రత

» భూపాలపల్లిలో చలికి తట్టుకోలేక మహిళ మృతి

» ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాలల పనివేళల్లో మార్పులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు జిల్లాల్లో ఐదారు డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా బేలలో 6, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.6, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 7, నిర్మల్ జిల్లా మంమ్డలో 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇటు చలికి తట్టుకోలేక కాటారం మండలం పాతరుద్రారానికి చెందిన మతి స్థిమితం లేని తూర్పాటి బుచ్చమ్మ (58) భూపాలపల్లి పట్టణంలో మృతి చెందింది.



ఆదిలాబాద్ జిల్లాలో చలిమంట కాగుతున్న దృశ్యం

చలి తీవ్రత నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో స్కూళ్ల పనివేళలు మారుస్తూ కలెక్టర్ రాజార్షి షా ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.40 గంటల (25 నిమిషాలు ఆలస్యంగా) నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నడపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 4 రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయని, ఆ తర్వాత 3 రోజుల్లో తగ్గే అవకాశముందని వెల్లడించింది.

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల బాధలు

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చలి బాధతో సతమతమవుతున్నారు. అద్దాలు పగిలిన కిటికీల గదుల్లో, చన్నీటి స్నానాలు చేస్తూ నిత్యం విలవిల్లాడుతున్నారు. మూడేళ్ల నుంచి విద్యార్థులు అధికారులకు విన్నవిస్తున్నా.. సోలార్ హీటర్లు, కిటికీలకు మరమ్మతులు చేయిస్తామని మాటలు చెబుతున్నారే తప్ప పట్టించుకోవట్లేదు. క్యాంపస్‌లో 9 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి హాస్టల్‌లో వెయ్యి గదులున్నాయి. ఇందులో సగం వరకు గదుల కిటికీలు పగిలిపోయాయి. మరికొన్నిటికి కిటికీల రెక్కలు ఊడిపోయాయి. దీంతో చలికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆస్తమా, అలర్జీలతో అనారోగ్యానికి గురవుతున్నారు. మరికొందరైతే చలి బాధకు స్నానం జోలికే పోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించాలని కోరుతున్నారు.

న్యాయ నిపుణుల సలహాతోనే.. బన్నీ రాలేదు

శ్రీతేజ్ కోలుకునేందుకు ఏం చేయడానికైనా సిద్ధం.. అల్లు అరవింద్ వెల్లడి

» శ్రీతేజ్‌కు శ్వాస నాళంలో పైపును అమర్చాం

» హెల్త్ బులెటిన్ విడుదల చేసిన కిమ్స్ ఆస్పత్రి వైద్యులు

» అల్లు అర్జున్ అరెస్టుపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్రోల్స్

» సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిన టీపీసీసీ ప్రతినిధులు

» నాలుగు కేసుల నమోదు



మీడియాతో మాట్లాడుతున్న అల్లు అరవింద్

రాంగోపాల్‌పేట్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యాయ నిపుణుల సూచనల మేరకే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ చూడడానికి అర్జున్(బన్నీ) రాలేదని అల్లు అరవింద్ అన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడ్డ శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి తెలుకోవడానికి బుధవారం ఆయన కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. శ్రీతేజ్ ఆరోగ్య స్థితి గురించి వైద్యులను అడిగి, తెలుసుకున్నాడు. అనంతరం ఆయన కిమ్స్ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. "శ్రీతేజ్ పరిస్థితి పది రోజులుగా మెరుగవుతోంది. పూర్తిస్థాయిలో కోలుకోవడానికి సమయం పట్టవచ్చని వైద్యులు చెప్పారు. శ్రీతేజ్ కోలుకోవడానికి ఏం చేయడానికైనా సిద్ధమే. ప్రభుత్వం కూడా శ్రీతేజ్ కోలుకోవడానికి సహకరించడం అభినందనీయం" అని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ అభిమానులతోపాటు.. చాలా మంది బన్నీ ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఘటన జరిగిన మర్నాడే ఆస్పత్రికి వద్దామని బన్నీ అనుకున్నాడని, ఇక్కడ కూడా తొక్కిసలాట జరిగే ప్రమాదముందని ఆస్పత్రి నిర్వాహకులు చెప్పడం.. కేసు నమోదు కావడంతో న్యాయనిపుణుడు నిరంజన్.. బన్నీని వెళ్లొద్దని చెప్పాడన్నారు. "శ్రీతేజ్‌ని చూడలేకపోతున్నందుకు బన్నీ ఎంతగానో బాధపడ్డారు. కనీసం నువ్వైనా వెళ్లిరా అనడంతో నేను వచ్చాను. ఈ విషయంపై ముందుగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నాను. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి, పోలీసు శాఖకు, కిమ్స్ సీఈవో అభిమన్యుకు కృతజ్ఞతలు" అని వ్యాఖ్యానించారు. కాగా.. శ్రీతేజ్ పరిస్థితిని తెలుసుకున్న అల్లు అరవింద్.. ఆయన కుటుంబ సభ్యులను కలవకుండానే వెళ్లిపోయారు. శ్రీతేజ్ బంధువులను ఈ విషయమై ప్రశ్నించగా.. అల్లు అరవింద్‌ను కలవకూడదని తమతో కొందరు చెప్పారని పేర్కొన్నారు.

కోలుకుంటున్న శ్రీతేజ్

శ్రీతేజ్‌కు బుధవారం వెంటిలేటర్ తొలగించి, ట్రాకియోస్టోమీ ట్యూబ్ ప్లేస్‌మెంట్ చేశారు. తక్కువ డోస్ ఇనోట్రోప్‌లతో చికిత్స చేస్తున్నారు. దీంతో శ్రీతేజ్ ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ఆస్పత్రి వర్గాలు బుధవారం విడుదల చేసిన మెడికల్ బులెటిన్‌లో వివరించాయి. అతని శ్వాసక్రియను పునరుద్ధరించేందుకు శస్త్రచికిత్సల ద్వారా శ్వాసనాళంలో పైపును అమర్చినట్లు కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యులు చేతన్ ఆర్.ముందాడ, విష్ణు తేజ్‌పుడి పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, జ్వరం తగ్గిందని, అవయవాల పనితీరు కూడా మెరుగుపడిందని వెల్లడించారు. నాడీ మండలానికి సంబంధించి మెరుగుదల లేదని చెప్పారు.

ట్రోల్ చేసినవారిపై కేసులు

అల్లు అర్జున్ అరెస్టుకు ప్రభుత్వమే కారణమంటూ.. సర్కారును, సీఎం రేవంత్‌రెడ్డిని దూషిస్తూ.. అభ్యంతరకర పోస్టులతో ట్రోల్ చేసిన వారిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. అల్లు అర్జున్ అరెస్టు సందర్భంగా ఢిల్లీలో సీఎం రేవంత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన విషయం తెలిసిందే.! దీనిపై అల్లు అర్జున్ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వంపై అభ్యంతరకర పోస్టులతో ట్రోల్ చేశారు. "సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ తప్పులేదు. అయితే.. ఇటీవల ఓ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి పేరును అల్లు అర్జున్ మరచిపోవడం వల్లే కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. అక్రమంగా అరెస్టు చేశారు" అనేది ఆ ట్రోల్స్‌లోని సారాంశం. దీనిపై టీపీసీసీ ప్రతినిధులు సైబర్ క్రైమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఐటీ చట్టంతోపాటు.. బీఎన్ఎస్‌లోని సెక్షన్లు 352, 353, 1బీ కింద నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.


కాంట్రాక్ట్ టీచర్లకు కనీస వేతనం అమలుచేయాలి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గురుకుల స్కూళ్లలో కాంట్రాక్ట్ టీచర్లకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యవేక్షణ కొరవడడంతో స్కూళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సేవలు అందిస్తున్న 43 వేల మంది ఐకేపీ వీవోఏల వేతనాలు పెంచాలని ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

సీనియర్ రచయిత కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ కన్నుమూత

» 600దాటి కథానికలు, 400కుపైగా ఆధ్యాత్మిక వ్యాసాలు

» 1965, 71 నాటి భారత్ పాక్ యుద్ధంలో పాల్గొన్న కాటూరు



రవీంద్ర త్రివిక్రమ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథా, నవలా రచయిత, సాహిత్య వాచస్పతిగా పాఠకలోకం అభిమానాన్ని పొందిన కాటూరు రవీంద్ర త్రివిక్రమ్(78) ఇకలేరు. కొద్దిరోజులుగా నరాల సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన బుధవారం తెల్లవారుజామున విజయవాడలోని స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. రవీంద్ర త్రివిక్రమ్ పుట్టిన రోజునాడే మరణించడం యాదృచ్ఛికం. ఆయన స్వస్థలం విజయవాడలోని కాటూరువారి వీధి. రవీంద్ర త్రివిక్రమ్‌కు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 1955లో ఆయన రచనా వ్యాసంగం ప్రారంభించారు. కథ, కథానిక, నవల, నవలిక, హరికథ, గేయ రచన, నాటకం, వ్యాసాలు తదితర ప్రక్రియల్లో సాహిత్య సృజన చేశారు. 600కుపైగా కథలు, కథానికలు, 400కుపైగా ఆధ్యాత్మిక వ్యాసాలు రాశారు. 'యుగ పురుషుడు గురుగోబింద్ సింగ్ జీవిత చరిత్ర, 'శివగీతామృతం' తదితర ఆధ్యాత్మిక గ్రంథాలతో పాటు 'వడ్డీకాసులు', 'కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ కథానికలు' పేరుతో పుస్తకాలుగా వెలువడ్డాయి. కార్గిల్ పోరాటాన్ని కళ్లకు కడుతూ రవీంద్ర త్రివిక్రమ్ రాసిన 'కార్గిల్ కథలు' ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వందకుపైగా నాటకాలు ఆకాశవాణిలో, మరికొన్ని నాటికలు దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. 'జురాహమ'(మహారాజు) హాస్యనాటికకు రవీంద్ర త్రివిక్రమ్ జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. కాటూరు భారత వైమానిక దళంలో ఇంజనీరుగా 16ఏళ్లు సేవలందించారు. 1965, 71 నాటి భారత్ పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. కాటూరు అంత్యక్రియలు బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య బుధవారం సాయంత్రం విజయవాడలో ముగిశాయి.

లగచర్ల రైతులకు ఊరట

» నరేందర్‌రెడ్డి సహా 24 మందికి నాంపల్లి కోర్టు బెయిల్

» మిగతా నిందితుల పిటిషన్లపై నేడు విచారణ

» హైకోర్టులో ఆరుగురికి ముందస్తు బెయిల్

వికారాబాద్, కొడంగల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ స్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన లగచర్ల ఘటనలో రిమాండ్‌లో ఉన్న నిందితులకు పెద్ద ఊరట లభించింది. నెల రోజుల పాటు జైళ్లలో ఉన్న రైతులకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రధాన నిందితుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు.. మొత్తం 24 మందికి నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నరేందర్‌రెడ్డికి రూ.50వేల చొప్పున రెండు ష్యూరిటీలను సమర్పించాలని, 3 నెలల పాటు ప్రతీ వారం బొంరాస్‌పేట ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరై, విచారణకు సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. మిగతా నిందితులు రూ.20 వేలష్యూరిటీలు సమర్పించాలని, ప్రతివారం పోలీసుల ఎదుట హాజరు కావాలని షరతు విధించింది. నరేందర్‌రెడ్డి చర్లపల్లి జైలులో.. ఏ2 సురేశ్‌రాజ్ సహా.. మిగతా నిందితులు సంగారెడ్డి జైలులో ఉన్నారు. వీరి బెయిల్ పిటిషన్లపై బీఆర్ఎస్ లీగల్‌సెల్ సభ్యులు లక్ష్మణ్, శుభప్రద్ పటేల్, రాంచందర్‌రావు వాదనలను వినిపించారు. నిజానికి వికారాబాద్, కొడంగల్ కోర్టుల్లో బెయిల్ పిటిషన్లు దాఖలవ్వగా.. వాటిని నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. మంగళవారంతో వాదనలు పూర్తవ్వగా.. న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. సురేశ్‌రాజ్, ఇతర నిందితుల బెయిల్ పిటిషన్లపై గురువారం విచారణ జరగనున్నట్లు సమాచారం. మరోవైపు.. లగచర్ల ఘటన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఆరుగురికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మైత్రి పదిలం

భారత ప్రయోజనాలకు భంగం కలిగించే రీతిలో తమ భూభాగాన్ని ఇతరులను వినియోగించుకోనివ్వబోమని శ్రీలంక అధ్యక్షుడు హామీ ఇవ్వడం భారతదేశానికి పెద్ద ఉపశమనం. అనుర కుమార దిసనాయకే మూడురోజుల పర్యటన తరువాత, ఇప్పటి వరకూ ఉన్న అనుమానాలు సందేహాలు చాలామట్టుకు ఉపశమించిన మాట వాస్తవం. ఆయన నాయకత్వంలోని జనతావిముక్తి పెరుమన (జేవీపీ)కు చైనా అనుకూల వామపక్షపార్టీ అన్న ముద్ర ఉండటంతో, దిసనాయకే విధానాలు, వైఖరులమీద చాలా అనుమానాలున్నాయి. మాల్దీవుల అధ్యక్షుడిలాగా, నేపాల్ ప్రధానిలాగా ఈయన కూడా తన తొలి విదేశీపర్యటనకు చైనాను ఎంచుకుంటాడేమోనని భావిస్తున్న తరుణంలో, తొలిగా భారత్‌లోనే కాలూని పాత సంప్రదాయాన్నే దిసనాయకే కొనసాగించడం విశేషం.

భారతదేశం ఒత్తిడికి లొంగి విదేశీ పరిశోధనా నౌకల ప్రవేశం మీద రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం ఓ ఏడాదిపాటు విధించిన నిషేధానికి మరో నెలలో గడువుతీరబోతున్నది. ఈ నేపథ్యంలో, దిసనాయకే ఇచ్చిన హామీని భారతదేశం సానుకూల వైఖరిగా చూస్తోంది. చేసిన అప్పుతీర్చలేక తిరిగి చైనాకే 99సంవత్సరాల లీజుకు రాసిచ్చిన హంబన్‌టోట పోర్టులో చైనా తన నిఘా ఓడలను లంగరేస్తున్న విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా, శాటిలైట్లను, మిసైళ్ళను ట్రాక్ చేసే యువాన్‌వాంగ్ ఓడ విషయంలో భారత్–శ్రీలంక మధ్య ఘర్షణ ఏర్పడింది. భారత్ అభ్యంతరాల మధ్య దీని ప్రవేశాన్ని కాస్తంత ఆలస్యం చేసిన శ్రీలంక ఆ తరువాత మరమ్మతుల ముసుగులో దానిని అనుమతించింది. చీటికీ మాటికీ ఈ నిఘా సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇప్పుడు సంయుక్త ప్రకటనలో భారతదేశానికి శ్రీలంకనుంచి ఒక నిర్దిష్టమైన హామీ లభించడం పెద్ద ఉపశమనం. రెండేళ్ళక్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు భారతదేశం ఎంతగా సాయపడిందో శ్రీలంక అధ్యక్షుడికి తెలియనిదేమీ కాదు. రాజపక్సేల ఏలుబడిలో చైనా అప్పుల ఊబిలోకి మరింత జారిపోయి, ఆర్థిక సామాజిక సమస్యను ఎదుర్కొన్న లంకకు భారతదేశం తాను చేయగలిగినంత చేసింది. బాధల్లో ఉన్నప్పుడు భారీగా సాయపడ్డ విషయాన్ని ప్రస్తావించి కృతజ్ఞతలు తెలియచేసిన దిసనాయకే, రాబోయేరోజుల్లో భారతదేశ భద్రతకు నష్టం చేకూర్చే చర్యలేమీ చేపట్టబోరని ఆశించాలి.

తన పర్యటనలో దిసనాయకే భారతదేశంతో రక్షణసహకార ఒప్పందాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. విద్యుత్తు, ఎల్ఎన్‌జీ ఇచ్చిపుచ్చుకోవడం, ఇంధన, రక్షణ, వాణిజ్యరంగాల్లో రెండుదేశాల సహకారం మరింత విస్తరించుకోవడం మంచి పరిణామం. తలైమన్నార్–రామేశ్వరం మధ్య ఫెర్రీ సర్వీసు ప్రతిపాదన భౌతిక దూరాన్ని తగ్గించడమే కాక, మానసికంగానూ దగ్గరచేస్తుంది. దిసనాయకేతో చర్చల్లో మత్స్యకారుల అంశం కూడా వచ్చిందని, వారిపట్ల మానవత్వంతో వ్యవహరించాలని నిర్ణయించుకున్నామని మోదీ ప్రత్యేకంగా చెప్పారు. అయితే, లంక తమిళుల ఆకాంక్షలను నెరవేర్చే విషయంలో మనం ఆశాభావం వెలిబుచ్చడం వినా, దిసనాయకేనుంచి నిర్దిష్టమైన హామీ ఏమీ లభించినట్టుగా లేదు. 13వ రాజ్యాంగ సవరణకు లోబడి తమిళ ప్రావిన్సుల్లో ఎన్నికలు, అధికార వికేంద్రీకరణ తదితర అంశాలకు సంబంధించి ఉభయదేశాల సంయుక్త ప్రకటన ఏమీ మాట్లాడలేదని వార్తలు వచ్చాయి. తమిళుల ప్రయోజనాలకు పూర్తిభిన్నంగా, ఇంకా చెప్పాలంటే వారిపట్ల శత్రుపూరిత వైఖరితో వ్యవహరించిన చరిత్ర జనతావిముక్తి పెరుమనకు ఉంది. భారత్–శ్రీలంక ఒప్పందాన్ని, అందులో భాగంగా చేరిన ఈ రాజ్యాంగ సవరణను ఆ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కానీ, మొన్న నవంబరు 14న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల సందర్భంలో కానీ, తమిళులకు దిసనాయకే ప్రత్యేక హామీలేవీ ఇవ్వలేదు. అయినప్పటికీ వారు తమిళపార్టీల కంటే ఆయన కూటమినే అధికంగా ఆదరించారు. తన పర్యటనలో దిసనాయకే ఈ అంశాన్ని కూడా ప్రస్తావించడాన్ని బట్టి ఆయన తమిళుల ప్రయోజనాలకు కట్టుబడతారని భారతదేశం ఆశిస్తోంది. వచ్చే నెలలో ఆయన చైనాలో పర్యటించబోతున్నారు. అక్కడ జరిగే ఒప్పందాలు, ఇచ్చిపుచ్చుకోవడాలమీద భారత్ ఎలాగూ ఓ కన్నేసి ఉంచుతుంది. అయితే, భారత్ వ్యతిరేకి అన్నభావనకు పూర్తి భిన్నంగా దిసనాయకే మూడురోజుల పర్యటన చక్కని సుహృద్భావంతో ముగిసినందుకు సంతోషించాల్సిందే.


కలికాలం! ఇది కృత్రిమ మేధ యుగం!!

బీబీసీ కథనం ప్రకారం భారత సంతతికి చెందిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ అనే యువ శాస్త్రవేత్త, కృత్రిమ మేధస్సుకు చెందిన 'ఓపెన్ ఏఐ' సంస్థ పరిశోధకుడిగా పనిచేస్తూ, 'విజిల్ బ్లోయర్'గా మారిన నేపథ్యంలో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో హత్యాన్మరణం చెందాడని తెలుస్తోంది. 'ఓపెన్ ఏఐ కృత్రిమ మేధస్సు సంస్థ' అనుసరిస్తున్న ఆక్షేపణీయ విధానాలను ఆయన బహిరంగంగా విమర్శించడమే బహుశా ఆయన 'బలవన్మరణానికి' దారితీసి ఉండవచ్చని మీడియా వర్గాల అభిప్రాయం. కొన్నాళ్ల క్రితం సుచిర్‌తో 'న్యూయార్క్ టైమ్స్' జరిపిన ఇంటర్వ్యూలో, కృత్రిమ మేధస్సుకు సంబంధించి ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు. ఈ సాంకేతికత వల్ల సమాజానికి వాటిల్లే ప్రమాదాలపై తన ఆందోళనను బహిరంగంగా వ్యక్తం చేశారు.

కాపీరైట్ చట్టం కింద పరిగణించాల్సిన సమాచారాన్ని, 'ఓపెన్ ఏఐ సంస్థ' చట్టవిరుద్ధంగా, విచ్చలవిడిగా అనైతికంగా, అక్రమంగా, అసురక్షితంగా, మోసపూరితంగా, ఉపయోగించడాన్ని సుచిర్ తప్పుబడుతూ, తీవ్రంగా విమర్శించారు. 'చాట్‌జీపీటీ' లాంటి కృత్రిమ మేధస్సు ఏజెంట్లు, అంతర్జాలాన్ని హానికరంగా మార్చివేస్తున్నాయని ఆయన సుస్పష్టం చేశారు. లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, సుచిర్ బాలాజీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదివాడు. నవంబర్ 2020 నుంచి ఆగస్టు 2024 వరకు, నాలుగేళ్లపాటు 'ఓపెన్‌ఏఐ సంస్థ'లో పనిచేశారు. సుచిర్ బాలాజీ దుర్మార్గహం వర్తమానంలో, సమీప భవిష్యత్తులో 'కృత్రిమ మేధస్సు' కలిగించే 'హానికర ఫలితాల' సంకేతమని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'అధికారం, ఆధిపత్యం, అభివృద్ధి' అనే అసంబద్ధమైన నెపంతో, నేడు అధునాతన సాంకేతికతల నిపుణులు తమ శక్తియుక్తులు ఉపయోగించి, సృష్టించిన ఒక వికారమైన విజ్ఞానానికి 'కృత్రిమ మేధస్సు (ఏఐ)' అనే నాగరిక నామకరణం చేశారు. అయితే, దీని సంతానం, తరచుగా, వారికి తెలియకుండా, హద్దులు మీరి, పగ్గాలు విదిలించుకుని, వారి నియంత్రణకు అతీతంగా మారాయి, మారుతున్నాయి, భవిష్యత్తులో మారనున్నాయి.

అశోకుడు కళింగ యుద్ధం బీభత్సాన్ని చూసి శాంతి మార్గం అనుసరించాడు, బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. రాబర్ట్ ఓపెన్‌హైమర్ అణుబాంబు అనివార్య దుష్ఫలితాలను సహించలేకపోయాడు. కృత్రిమ మేధ సృష్టికర్తలలో ఒకరైన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆ వినూత్న సాంకేతికత అనియంత్రిత ఆవిష్కరణల ప్రమాదాలపై ప్రపంచాన్ని గట్టిగా హెచ్చరిస్తున్నారు. బహుశా సుచిర్ బాలాజీ కూడా అదే ప్రయత్నం చేసి మృత్యుబారిన పడ్డాడేమో? కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామి శాస్త్రవేత్తలు జెఫ్రీ హింటన్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్, జాన్ హాప్‌ఫీల్డ్ 2024 సంవత్సరానికి గాను, నోబెల్ బహుమతులు పొందినవారిలో ఉన్నారు.

హింటన్, హాప్‌ఫీల్డ్‌లు తమ కృషి ద్వారా 'గణిత, భౌతిక శాస్త్రాల' మధ్య ఒక వంతెనగా కృత్రిమ మేధస్సును సృష్టించారు. దీనివల్ల తాత్విక అన్వేషణకు, వ్యావహారిక ప్రయోగాలకు, కావాల్సిన ఉపకరణాల రూపకల్పన జరిగింది. అలాగే డెమిస్ హసాబిస్, జాన్ జంపర్ 'ఆల్ఫాఫోల్డ్' అనే ఏఐ వ్యవస్థ రూపకల్పన చేసి అభివృద్ధి పరిచారు. ఇది ప్రోటీన్ నిర్మాణాలను విశ్లేషించడంలో గణనీయమైన రీతిలో, విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చింది. అమినో ఆమ్లక్రమాల ఆధారంగా ప్రోటీన్‌లో పరమాణు నిర్మాణాన్ని కనుగొనే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది జీవ, వైద్య శాస్త్రరంగాల్లో విప్లవాత్మక ఫలితాలను చూపింది. ముఖ్యంగా ఔషధాల అభివృద్ధి వేగవంతం చేయడం, రోగాలను అణు స్థాయిలో అర్థం చేసుకోవడం, యాంటీబయోటిక్ నిరోధకత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో సహాయపడింది.



మానవ మేధో సృష్టి ఫలితాలను అవగాహన చేసుకోవడంలోనే నిజమైన విజ్ఞానం ఇమిడి ఉంటుంది. శాస్త్రవేత్తలు తమ నవ కల్పనల పర్యవసానంగా సంభవించే అనర్థాలకు పరితాపం చెందడం మార్పు దిశగా ఒక సంకేతమని, ప్రపంచాన్ని బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లగలదని భావించాలి. అశోకుడు, ఓపెన్‌హైమర్, హింటన్ లాంటివారి అనుభవాలు, ఆవేదనల నుంచి, ఇటీవలే మరణించిన యువ శాస్త్రవేత్త సుచిర్ బాలాజీ హెచ్చరిక నుంచి నేర్చుకోవడం మానవాళికి శ్రేయస్కరం.

'ఏఐ డీప్‌లెర్నింగ్ గాడ్‌ఫాదర్'గా పిలవబడే జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, జాన్ హాప్‌ఫీల్డ్‌తో కలసి 'న్యూరల్ నెట్‌వర్క్స్'ను రూపొందించారు, ఇది 'బ్యాక్‌ప్రాపగేషన్ అల్గారిథమ్' అనే విశిష్ట ప్రక్రియ ద్వారా తప్పుల నుండి నేర్చుకోవడం సాధ్యమైంది. దీని ద్వారా ఆధునిక డీప్ లెర్నింగ్‌కి బలమైన పునాది ఏర్పడింది. ఈ ఆవిష్కరణ కంప్యూటర్ విజన్ నుండి భాషా ప్రక్రియల వరకు వివిధ ఏఐ అనువర్తనాల్లో ప్రధాన పాత్ర పోషించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన హింటన్, ఎడింబరో విశ్వవిద్యాలయానికి సమర్పించిన పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసంలో 'న్యూరల్ నెట్‌వర్క్స్‌లో ఎర్రర్ కరెక్టింగ్ కోడ్స్, డిస్ట్రిబ్యూటెడ్ రిప్రజెంటేషన్స్‌'పై దృష్టిపెట్టారు. ఆయన ఆధారభూత పనితనం కృత్రిమ మేధస్సు దిశను పూర్తిగా మార్చివేసింది. నోబెల్ బహుమతి అందుకున్నప్పటికీ, హింటన్ నిరంతరం ఏఐతో సంభావ్య భావి ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ వస్తున్నారు.

2023లో గూగుల్‌ను వదిలి, హింటన్ 'అనియంత్రిత కృత్రిమ మేధస్సు అభివృద్ధి' కలిగించే ప్రమాదాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి, మానవాళికి కలిగే ముప్పు గురించి తన ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేశారు. హింటన్, హాప్‌ఫీల్డ్‌లకు లభించిన గుర్తింపు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పలురంగాల్లో మార్గదర్శక ప్రభావాన్ని చూపిస్తుంది. డీప్‌లెర్నింగ్ ప్రధాన భూమికలైన సిద్ధాంతపరమైన అల్గారిథమిక్ మౌలికాలను హింటన్, హాప్‌ఫీల్డ్‌లు అందించగా, హస్సాబిస్, జంపర్‌లు శాస్త్రీయ సవాళ్లను పరిష్కరించగల కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని శాస్త్రీయంగా రుజువుపరుస్తూ నిరూపించారు. ఈ విజయాలు కృత్రిమ మేధస్సు ద్వంద్వ స్వభావాన్ని కూడా పునరుద్ఘాటించాయి. సమాజానికి కలిగించే ప్రయోజనాలు చాలా ఉన్నప్పటికీ, దాని నైతిక, తదితర అస్తిత్వసంబంధ సమస్యలు గణనీయమైనవిగా మిగిలిపోతున్నాయి.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) ఆవిర్భావం, అవసరం, సిద్ధాంతం, పరిణామం, ఆరోహణ, (బహుశా) అవరోహణ, మంచిచెడు ప్రభావాలు నిజంగా ఆసక్తికరమైనవేనని అనాలి. 1956లో, న్యూ హ్యాంప్‌షైర్‌లో జరిగిన డార్ట్‌మౌత్ వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పదం సృష్టించబడింది. క్లాడ్ షానన్, జాన్ మెక్కార్తీ, నాథనియల్ రోచెస్టర్, మార్విన్ మిన్స్కీలను (ఏఐ) 'కృత్రిమ మేధస్సు స్థాపక పితామహులుగా' పరిగణిస్తారు.

అనేక రకాల పనులను ఆటోమేట్ చేయాలని, సామర్థ్యాన్ని పెంచాలని, మానవ మేధో సామర్థ్యాలను మించిపోయే సంక్లిష్టతలను ఎదుర్కోవాలనే మానవ జాతి ఆకాంక్ష నుండి ఆవిర్భవించినదే కృత్రిమ మేధస్సు. కృత్రిమ మేధస్సు పరిణామ క్రమంలో ముఖ్యమైన మైలురాళ్లున్నాయి. వాటిలో 'చాట్‌జీపీటీ' వంటి సంభాషణల ఏజెంట్ల రంగప్రవేశం, కృత్రిమ మేధస్సును ఒక 'అత్యవసర దుష్టశక్తి'గా మార్చివేసి, మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తూ, మానవ మెదడు ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తూ, పర్యవేక్షణ వ్యవస్థల లాంటి ఉపయోగంతో పౌర స్వేచ్ఛలను హరించివేస్తోంది. ఫలితంగా, కృత్రిమ మేధస్సు, ఆధునిక ఆవిష్కరణల ప్రమాదాలను సూచిస్తుంది, కాబట్టి, దాని రూపాంతర సామర్థ్యాన్ని చెడుగా వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేది ఒక సవాలుగా మారింది. 'మొట్టమొదటి అణ్వాయుధ ఆవిర్భావం, ప్రయోగం, దాని అనుకూల, ప్రతికూల ప్రభావాలు, వాటి మధ్య చోటుచేసుకున్న తేడాలను కూలంకషంగా పరిశీలించడం అవశ్యం.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, అప్పటి అమెరికా ప్రభుత్వం గోప్యంగా చేపట్టిన 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్'లో భాగంగా ప్రపంచంలో మొదటిసారిగా 'అణ్వాయుధ పరీక్ష' జులై 16, 1945న 'ది గ్యాడ్జెట్' పేరిట జరిగింది. ఈ పరికరాన్ని న్యూమెక్సికోలోని లాస్ అలమోస్‌లో విజయవంతంగా పరీక్షించారు.

అమెరికా బాంబర్ 'ఎనోలా గే' వాయునౌక ద్వారా పేల్చబడిన అణ్వాయుధాలు కనీవినీ ఎరుగని అపార విధ్వంసాన్ని కలిగించాయి. ఈ విధ్వంసాన్ని చూసిన 'అణ్వాయుధ, ఆటామిక్ బాంబ్ పిత'గా పిలువబడే రాబర్ట్ ఓపెన్‌హైమర్, తన ప్రగాఢ పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశారు. భగవద్గీతలోని మాటలను ఆయన పదేపదే ఉటంకిస్తూ, 'ఇప్పుడు నేనే మరణాన్ని; ప్రపంచాలను నాశనం చేసేవాడిని అయ్యాను' అని ఆవేదనాభరితంగా తన మనస్తాపాన్ని వ్యక్తపరిచాడు.

మౌర్య అశోకుడిలో కలిగిన పరివర్తన, రాబర్ట్ ఓపెన్‌హైమర్ పశ్చాత్తాపం, జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆవేదనలకు బహువిధ సామీప్యాలు ఉన్నాయి. కళింగ యుద్ధంలో విధ్వంసాన్ని చూసి చలించిన అశోకుడు హింసను త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరించారు. ప్రజల శ్రేయస్సుకు కట్టుబడి శాంతి పరిపాలనకు అంకితమయ్యారు. ఓపెన్‌హైమర్, 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్' శాస్త్రీయ డైరెక్టర్‌గా అణుబాంబు సృష్టిలో కీలకపాత్ర పోషించి, ఆ బాంబు ప్రభావానికి బాధపడ్డారు. ఆయుధ నియంత్రణను సమర్థిస్తూ, తన పనికి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అలాగే, కృత్రిమ మేధస్సు అభివృద్ధికి 'గాడ్‌ఫాదర్'గా ప్రఖ్యాతిగాంచిన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, న్యూరల్ నెట్వర్క్‌ల అభివృద్ధికి కారణమై, ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి కారకుడైనప్పటికీ, కృత్రిమ మేధస్సు అనూహ్య దుష్ఫలితాల గురించి, అది ఆర్థిక వ్యవస్థలపై, సమాజాలపై, మానవ స్వయంశక్తిపై కలిగించే ప్రభావాల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మానవ మేధో సృష్టి ఫలితాలను అవగాహన చేసుకోవడంలోనే నిజమైన విజ్ఞానం ఇమిడి ఉంటుంది. శాస్త్రవేత్తల సృష్టి పర్యవసానంగా జరిగే అనర్థానికి దాని కారకులు పశ్చాత్తాపం వెల్లడి చేయడం, మార్పు దిశగా ఒక సంకేతమని, ప్రపంచాన్ని బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లగలదని భావించాలి. అశోకుడు, ఓపెన్‌హైమర్, హింటన్, లాంటివారి అనుభవాలు, ఆవేదనల నుండి, ఇటీవలే మరణించిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ హెచ్చరిక నుండి నేర్చుకోవడం ప్రపంచానికి, మానవాళికి ప్రయోజనకరం.

■ వనం జ్వాలానరసింహారావు

సంగీత విశ్వంలో తబలా శబ్దబ్రహ్మ

సంగీత జగత్తులో అనుపమేయ గాంధర్వులు కొందరు ఉంటారు. అటువంటి అరుదైన ప్రజ్ఞావంతులలో జాకిర్ హుస్సేన్ ప్రథమగణ్యుడు. సంగీత విశ్వానికి భౌగోళిక సరిహద్దులు ఉండవు కదా. కనుకనే సప్తస్వరాల వినూత్న మేళవింపుతో అద్భుతమైన సంగీతాన్ని సృష్టించిన జాకిర్ భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సమస్త సమాజాలలోను ప్రభావశీలుడుగా వెలుగొందారు. భౌతికంగా ఒక నిర్దిష్ట తరానికి చెందినవాడైనా ఆయన సార్వకాలికుడు. తండ్రి తబలా మేస్త్రో అల్లా రఖా నుంచి తొలి శిక్షణ పొందిన జాకిర్ వ్యక్తిత్వం, ప్రతిభ, సృజనశీలత ఆయన ఒక అద్వితీయ సంగీత ప్రదేశ కాలాలలోకి ప్రవేశించేందుకు అన్ని విధాల ప్రేరేపించాయి. భారతీయ సంగీత వాహిని ప్రపంచవ్యాప్తమవుతున్న తరుణంలో జాకిర్ రంగప్రవేశం చేశారు. ఆయన నేతృత్వంలో భారతీయ గాయనీ గాయకులు, సంగీత స్రష్టలు పాశ్చాత్య దేశాలు 'ప్రపంచ సంగీతం'గా పిలిచే సమ్మిళిత సంగీతాన్ని సృష్టించారు. ప్రపంచ వేదికలపై కీర్తి కిరీటాలు ధరించారు.

భారత్ ఆ సంగీతాన్ని సంలీన లేదా మిశ్రమ సంగీతంగా పరిగణించింది. ఏ పేరుతో పిలిచినా గులాబీ గులాబీయే కదా. ఆ సంగీత ప్రపంచం వికాసానికి, విస్తరణకు జాకిర్ భాయి మార్గదర్శకత్వం వహించారు. ప్రపంచవ్యాప్తంగా విభిన్న సంగీత శైలులలో సుప్రతిష్ఠులు అయిన సంగీతవేత్తలతో కలసి సంయుక్తంగా కొత్త 'ప్రపంచ సంగీతం'ను అభివృద్ధిపరిచారు. ఈ వినూత్న సృజనాత్మక ప్రస్థానంలో ఆయన తన పెద్దలు కొంత మంది అడుగుజాడల్లో నడిచారు. తండ్రి అల్లా రఖా, విఖ్యాతుడు అలీ అక్బర్ ఖాన్ మొదలైన వారితో కలసి సంగీత సృష్టిలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా అలీ అక్బర్ ఖాన్‌తో కలిసి అభివర్ణించడానికి విశేషణాలు లేనటువంటి లోకోత్తర హిందుస్థానీ శాస్త్రీయ సంగీతాన్ని సృజించారు. ఇరవయో శతాబ్ది హిందుస్థానీ సంగీత ప్రేమికులు ఎంతగానో ఆస్వాదించిన సంగీతమది.



జాకిర్ హుస్సేన్ (1951–2024) శాశ్వతంగా నిష్క్రమించారు. ఆయనతో యాభై సంవత్సరాల స్నేహ బంధం ఉన్నవారైనా లేదా కేవలం ఐదు నిమిషాల పరిచయమున్నవారైనా ఆ మానవీయుడిని ఎన్నటికీ మరచిపోలేరు. ఆ తబలా మాంత్రికుడు తన సంగీతంతో మన జీవితాలలో ఎప్పటికీ ఉంటారు.

1970లలో శక్తి రికార్డింగ్స్‌లో ఆయన నిత్య నూతన సజీవ సంగీతాన్ని విన్న తరువాత నేను తబలా సంగీతం పట్ల ఆకర్షితుడినయ్యాను. అంతిమంగా జాకిర్ హుస్సేన్ ప్రపంచంలోకి ప్రవేశించాను. హిందుస్థానీ శాస్త్రీయ సంగీత సాంస్కృతిక లోకంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో జాకిర్ భాయి నాకు పరిచయమయ్యారు. జాకిర్‌తో నా తొలి అనుభవాలతో ఆయన ఆలోచనాశీలత, నమ్రత, భావ ప్రసార నైపుణ్యం నాకు తెలిసివచ్చాయి భారతీయ సంగీత సంస్కృతి పురిగొలిపే ఆశలు, అనివార్యం చేసే నిరీక్షణలు తదితర విషయాలపై అవగాహన లేనివారితో ఆయన ఎంత ఓర్పుగా, నేర్పుగా మాట్లాడతారో నేను స్వయంగా చూశాను.

భిన్న నాగరికత, సంస్కృతికి చెందిన మాతో విపులంగా మాట్లాడేందుకు, తన సంస్కృతిని మాతో పంచుకునేందుకు ఆయన సదా సుముఖంగా ఉండేవారు. జాకిర్‌లోని ఈ సుగుణాలకు మూలాలు తండ్రి విశాల వైఖరులలో ఉన్నాయి. తండ్రి నుంచి పొందిన శిక్షణకు, సంగీత, బౌద్ధిక వారసత్వాలకు జాకిర్ భాయి వన్నె తెచ్చారు. విశాల ప్రపంచంలోకి ప్రవేశించేందుకు, భారతీయ జయపతాకలు ఎగురవేసేందుకు ఆయన వాటిని బాగా సద్వినియోగపరచుకున్నారు. మాపై ఆయన ప్రభావం, మా పట్ల ఆయన చూపిన ప్రేమానురాగాలు మా జీవితాలలో శాశ్వతంగా ఉండిపోయాయి.

అల్లారఖా సమక్షంలో ఉన్నప్పుడు సదా కుతూహల స్వభావంతో ఉండి తీరాలి. ఇది ఆయన కుమారుడి విషయంలోనూ నిండు సత్యమే. జాకిర్ భాయి స్ఫూర్తిదాయకంగా, హాస్య ప్రవృత్తితో మాట్లాడుతారు. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతమైనది. ఆయన ఆసక్తులలో వైవిధ్యం మనలను ఆశ్చర్యపరుస్తుంది. క్రికెట్ నుంచి అత్యాధునిక సాంకేతికత వరకు ఆయనకు తెలియని విషయం లేదు. సరే, ప్రతి సంగీత శైలిపట్ల ఆయనకు ఆసక్తి మాత్రమే కాదు, అభిమానం, ఆదరణ కూడా చాలా మెండుగా ఉన్నాయి.

జాకిర్ భాయిలోని ఈ విశిష్ట గుణాల గురించి తెలిసినవారు ఎందరో ఉన్నారు. ఉత్కృష్ట ప్రతిభావంతుడైన సంగీతజ్ఞుడుగానే కాదు, తన జీవిత పరిధిలోకి వచ్చిన ప్రతి ఒక్కరి శ్రేయస్సు, సంక్షేమం గురించి చిత్తశుద్ధితో ఆలోచించే మానవత కూడా ఆయనలో మెండుగా ఉన్నది.

భారతీయేతర సంగీత సంప్రదాయాలు, ఆయా సంగీత శైలుల ప్రతిభావంతుల పట్ల ఆయన గౌరవాదరాలు అద్వితీయమైనవి. మనకు భిన్నమైనవారిని ఎలా ప్రేమించాలో, ఆదరించాలో ఆయన మాకు నేర్పారు. సంగీత ప్రపంచంలో తనకు ముందున్న, తన తరానికి మార్గదర్శకులుగా ఉన్న వారిని జాకిర్ అపరిమితంగా గౌరవించేవారు. తన తండ్రి తరానికి చెందిన తబలా కళాకారుడు కిషన్ మహరాజ్, నేపథ్య గాయని ఆశా భోస్లేల పట్ల ఆయన చూపే గౌరవాభిమానాలే అందుకు నిదర్శనం. పెద్దలనేకాదు, తన కంటే చిన్నవారినీ ఆయన అమితంగా అభిమానించేవారు, ఆదరించేవారు, ప్రోత్సహించేవారు, భారతదేశంలోను, వివిధ దేశాలకు చెందిన యువ సంగీతజ్ఞులకు ఆయన అందించిన సహాయ సహకారాలు ఎనలేనివి. జాకిర్‌లోని ఆ పెద్దరికమే ఆయన్ని ఎందరికో గౌరవపాత్రుడిని చేసింది. న్యూజీలాండ్‌లోని ఆక్‌లాండ్ నగరంలో జరిగిన ఒక సంగీత కచేరి సందర్భంగా స్థానిక పసిఫిక్ ఐలెండ్‌కు చెందిన డ్రమ్మర్లను ఆహ్వానించి వారితో కలసి ఆనాటి శ్రోతలకు మరపురాని సంగీతాన్ని అందించారు. ఆ డ్రమ్మర్లతో కలసి సంగీతాన్ని సృష్టించడం ద్వారా ఆయన తన సహచరులకు, శ్రోతలకు బాహాటత్వం, సమ్మిళితతత్వం గురించి విలువైన పాఠాలు నేర్పారు.

యువ సంగీతజ్ఞుడి స్థాయి నుంచి భారతీయ శాస్త్రీయ సంగీతం అగ్రగామి ప్రతినిధిగా ఎదిగేందుకు జాకిర్ నిర్విరామంగా కృషి చేశారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన తరువాత యువ సంగీతజ్ఞులకు కచేరీ నిర్వహణకు, రికార్డింగ్ అవకాశాలను కల్పించడంలో కూడా ఆయన నిరంతరం ఎంతగానో తోడ్పడేవారు. అందుకు తన పలుకుబడిని, ఉదారశీలతను వినియోగించేవారు.

జాకిర్ శాశ్వతంగా నిష్క్రమించారు. ఆయనతో యాభై సంవత్సరాల స్నేహ బంధం ఉన్నవారైనా లేదా కేవలం ఐదు నిమిషాల పరిచయమున్నవారైనా ఆ మానవీయుడిని ఎన్నటికీ మరచిపోలేరు. ఆ తబలా మాంత్రికుడు తన సంగీతంతో మన జీవితాలలో ఎప్పటికీ ఉంటారు.

• గ్రెగొరీ డి బూత్

ప్రొఫెసర్, యూనివర్శిటీ ఆఫ్ ఆక్‌లాండ్, న్యూజీలాండ్

(వ్యాసకర్త 'బిహైండ్ ది కర్టెన్ : మేకింగ్ మ్యూజిక్ ఇన్ ముంబైస్ ఫిల్మ్ స్టూడియోస్; బ్రాస్ బాజా : స్టోరీస్ ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ ఇండియాస్ వెడ్డింగ్ బాండ్స్ రచయిత)

(స్క్రోల్ సౌజన్యం)

ప్రైవేట్ రంగంలోనూ ఆదివాసీలకు రిజర్వేషన్లు

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాలు నేడు మానవాళిని కబళిస్తున్న నేపథ్యంలో ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా తయారైంది. దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నది. ఒకపక్క ప్రైవేటు రంగం పుంజుకుంటున్న కొద్దీ ప్రభుత్వరంగ సంస్థలు మూతపడుతున్నాయి. నేడు దేశంలో ఉపాధి అవకాశాలు అత్యధికంగా ప్రైవేటు రంగం నుంచే లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అనివార్యంగా మారాయి. సమాజంలో అన్ని రంగాల్లోనూ వెనుకబడి నాగరిక ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదిమ తెగలకూ నేడు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత నేటి పాలకవర్గాలపై ఉన్నది.

ఆదివాసులకి భారత రాజ్యాంగం ఇచ్చిన ప్రత్యేక గుర్తింపూ, రాజ్యాంగ రక్షణలూ నేడు వెలవెలబోతున్నాయి. పాలకవర్గాలు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదు. ఆదిమ తెగల విద్యార్థులు నేటి నాగరిక ప్రపంచంలో ఉన్న విద్యాపరమైన, ఉద్యోగపరమైన పోటీని తట్టుకోలేకపోతున్నారు. ప్రైవేట్ రంగంలో ఉన్న అవకాశాలను అగ్రవర్ణాలు దోచుకుంటున్నాయి. ఆదివాసులు అధికసంఖ్యలో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కాబట్టి నేటి ఆదివాసులకు తప్పనిసరిగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని చాలామంది మేధావులు, రాజకీయ, విద్యారంగ ప్రముఖులు వాదిస్తున్నారు. కానీ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయకూడదనీ, అందరికీ సమాన ప్రాతినిధ్యం ఉండాలనీ బోధించేవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు. ప్రతిభ దెబ్బతింటుందన్నది వాళ్ళ అభిప్రాయం. కానీ ఇది బూర్జువా వర్గ ధోరణి. ఇదే తరహా వాదనతో ఐదేళ్ళ క్రితం పార్లమెంట్‌లో దుమారం చెలరేగింది. కాని దానికి దీటుగా ప్రజాస్వామిక, ప్రగతిశీల, విప్లవ మేధావులు అందరూ కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు రెండింటిలోనూ రిజర్వేషన్లు ఉండాలి అని పెద్ద చర్చ జరిపారు.

ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు అంతకంతకూ పడిపోతున్న నేపథ్యంలో 'రిజర్వేషన్ల' భావనకు ఒక అర్థమంటూ మిగలాలంటే నేడు ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే. ప్రతి ప్రైవేట్ కంపెనీ ప్రతి ఏటా ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి. అక్కడ ఉన్న ఉద్యోగావకాశాలను ఎస్సీ, ఎస్టీ, బీసీల వారీగా వర్గీకరించి రిజర్వేషన్లు కల్పించాలి. ఆదివాసులకూ తప్పనిసరిగా రిజర్వేషన్లు ఉండాలి. ప్రతి ప్రైవేట్ కంపెనీలోనూ రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగస్థులు ఉండే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల బిల్లునూ పార్లమెంట్‌లోను, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలోనూ ఆమోదించాలి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను కేంద్రంలో, రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ రంగంలో విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు ఉండాలి. ఈ దిశగా ఆదివాసీ విద్యావంతులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పోరాటం చేయాలి. ఈ పోరాటానికి ప్రగతిశీల, విప్లవ మేధావులు అండగా నిలవాలి.

– పూకె రామకృష్ణ, ఆదివాసీ జర్నలిస్ట్ అసోసియేషన్

సంస్కృతికి గొప్ప మాధ్యమం పుస్తకమే

మనిషి ఆయుః ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుః ప్రమాణం అనంతం. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మనగలుగుతుందో నిర్ణయమవుతుంది. తాళపత్ర, బూర్జపత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలాలైతే, తిరిగి ప్రతిలేఖనాలవుతాయి. మనిషి అజ్ఞానంతోనో, తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు.



భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. చైనా, టిబెట్, అఫ్ఘానిస్తాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్యాన్ని మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొనబడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రౌతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామక్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్థానత్రయం, భారత, భాగవత, రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపంచంలో ఏ జాతీ, ఏ దేశం, భారతదేశానికి సాటిరావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి వందలాది ప్రతులు సిద్ధమయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారుచేసే ఉద్యోగులు ఉండేవారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహుకష్టంతో కూడుకునేది.

గ్రంథాలయం అందుబాటులోకి వచ్చాక దూరవిద్యా విధానం కూడా అమలులోకి వచ్చింది. ముద్రణా యంత్రాల ఆధునీకరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల నాణ్యమైన, అందమైన ముద్రణలతో పాటుగా నేడు 'ఇ–గ్రంథాలు' ఉపయోగపడుతున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గుముఖం పట్టలేదు.

గ్రంథస్థ విషయాలు ప్రపంచమంతా విస్తృతం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు కోట్లాది పాఠకులకు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారం. ముద్రణ వల్ల గ్రంథానికి విలువ ఏర్పడింది కనుక, డిమాండును బట్టి, వ్యాపారాత్మకత కారణంగా అధిక ధరల ప్రపంచం ఏర్పడుతున్నది.

తొలి హైదరాబాద్ బుక్ ఫెయిర్ 1985లో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. అనంతరం నిజాం కాలేజీ గ్రౌండ్స్ పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవ్ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో బుక్ ఫెయిర్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ గ్రౌండ్స్)లో పుస్తక ప్రదర్శన నిరంతరం కొనసాగుతోంది. ప్రతి ఏటా హైదరాబాద్ వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నది. ఇందిరాపార్క్ సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నేటి నుంచి 29 వరకు 37వ జాతీయ పుస్తక ప్రదర్శన జరుగుతుంది.

బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే కదా. అందుకే చాలా మందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతర. దేవుణ్ణి జాతరలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనేవారు, చదివేవారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించేవారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీకారుల బృందాలు ఒక్కచోట కలిసి పండుగ చేసుకునే భాగ్యనగర పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూతులను మిగులుస్తుందనేది నూటికి నూరుపాళ్ళు నిజం.

○ రామకిష్టయ్య సంగనభట్ల

పద పోదాం పుస్తకాల పర్వానికి!

అక్షరాల ఆకురాయితో
మదిని పదును పెడుతుంది
పుస్తకం
దోపిడేదో ధర్మమేదో ఎరుక చేస్తుంది

రైతు చేతిలో నాగళ్లున్నట్లు
గొర్లకాపరి చేతిలో చిప్పగొడ్డలున్నట్లు
కూలితల్లి చేతిలో కొడవలున్నట్లు
కార్మికుడి చేతిలో
సుత్తె పలుగు పారున్నట్లు
నదినిండా అలలున్నట్లు
మనిషి చేతిలో పుస్తకం
మనసు నిండా పొంగి పొరలిన అక్షరాలు

పద్యం పాట, కవిత కథ
నవల నాటకాలు
నాయన చిందించిన శరీరపు స్వేదాలు
అమ్మగీసిన బతుకు చిత్రాలు

ప్రేమను సాధించాలన్నా
సమతా మమతలు ప్రభవించాలన్నా
రాజ్యాన్ని నిలబెట్టుకోవాలన్నా
కట్టుబాట్ల కంచెలను
త్రుంచేసేదే పుస్తకం

కాలానికీ కార్తికీ పండగున్నట్లు
నదికీ నాగలికీ పండగున్నట్లు
బతుకుకు బతుకమ్మకూ పండగున్నట్లు
బోనానికి బొడ్రాయికీ పండగున్నట్లు
ఆయుధానికి అమ్మోరుకు పండగున్నట్లు
పుస్తకానికీ పండగుంటది
సాలుకోసారి పుస్తకాల జాతరుంటది
పుస్తకాన్ని చదివితేనే విజ్ఞానం
వడివడిగా పోదాం పదా
పుస్తకాల పర్వానికి!

– వనపట్ల సుబ్బయ్య

(నేటి నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్)

దాటవేత ధోరణి సరికాదు

ఉద్యోగ ఉపాధ్యాయ లోకానికి యమపాశం లాగా మారిన 317 జీవోపై ప్రతిపక్ష నాయకులు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, ప్రభుత్వం ఖచ్చితమైన సమాధానం చెప్పకుండా దాటవేసే ధోరణి అవలంబించడం బాధాకరం. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. 317 జీవో సమస్యను ప్రభుత్వాలు తమ మేనిఫెస్టోలో పెట్టే వరకు వచ్చిందంటే అది ఉద్యోగులను ఎంత మానసికంగా వేధిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధితుల వైపున మాట్లాడే నాయకులు, అధికారంలోకి వచ్చాక బాధితులను విస్మరించడం ఎంతవరకు సమంజసం. నిజానికి ఇది బాధితులను ఓట్ల కోసం వాడుకోవడమే. గత మూడేళ్లుగా ఉద్యోగులు ప్రతీరోజు ఏదో ఒక రూపంలో నిరసన తెలియజేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరం. ఉద్యోగులను మానసిక వేదనకు గురిచేసి అభివృద్ధి సాధించడం అంటే ఉద్యోగుల మెడ మీద కత్తిపెట్టి పని చేయించడమే. ఇలా చేయడం ఉద్యోగి ప్రాథమిక హక్కు అయిన పనిలో స్వేచ్ఛను హరించడమే. నేడు ప్రభుత్వం బాధితులకు కల్పిస్తున్న పరస్పర బదిలీ అనేది ఒక బిజినెస్ లాగా మారింది. బాధితుల బలహీనతను ఆసరా చేసుకొని కొందరు ఉద్యోగులు దాదాపు 10–20 లక్షల వరకు డబ్బులు ఆశిస్తున్నారు. ఇది సాధారణ ఉద్యోగికి ఎంత కష్టమో ప్రభుత్వం ఆలోచించాలి.

ప్రభుత్వ కార్యకలాపాల నిమిత్తం ఉద్యోగుల సేవలు ప్రభుత్వం వినియోగించుకోవచ్చు. కానీ ఉద్యోగి న్యాయమైన హక్కులను కాలరాసి పని చేయించుకోవడం అన్యాయం. ఈ పరస్పర బదిలీల్లో ఇంకో నష్టం కూడా ఉంది. అది మరో 3 నెలలు, సంవత్సరంలో పదవీ విరమణ చెంది ఖాళీలు కావాల్సిన స్థానాలు పరస్పర బదిలీ అవకాశాన్ని ఆర్థిక వనరుగా వాడుకొని వెళ్తే వారి స్థానంలో వచ్చిన వారు వెంటనే రిటైర్ అవ్వరు కదా. మరి 317 జీవో వల్ల జిల్లాలు మారి తిరిగి వచ్చే వారికి ఆస్కారమేది? ఈ జీవోతో డిస్ట్రిక్ట్ క్యాడర్/జోన్‌లో పని చేసే ఉద్యోగులను వేరే జోన్, మల్టీ జోన్‌కి బదిలీ చేశారు. ఇది అన్యాయం కదా? ఈ విషయం ప్రభుత్వానికి తెలియదా? ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి. సబ్ కమిటీ సూచించిన విధంగా గైడ్‌లైన్స్ విడుదల చేయాలి.

– వై. రత్నమాల

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
317 జీవో డిస్‌లోకేటెడ్ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

చెరబడుతున్నారు!

'భద్రకాళి'పై గుప్తనిధుల ముఠా కన్ను?



భద్రకాళి చెరువులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి ఆలయం చుట్టూ గుప్తనిధుల ముఠాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో పూజలు చేసి అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కనబడుతున్నాయి. ఈ మేరకు అంతర్‌రాష్ట్ర ముఠాలు నగరంలో తిష్టవేశాయి. భద్రకాళి చెరువులో పూడికతీత పనులు చేస్తున్నారనే సమాచారంతో తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు రాత్రివేళల్లో సంచరిస్తున్న అనుమానితులను స్థానికులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అయినా భద్రకాళి చెరువు రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ కార్యాచరణ ప్రకటించడం లేదు. దీంతో నగరప్రజలు చెరువులో విలువైన నిధులు, నిక్షేపాలు ఉంటే వాటిని రక్షించాలని కోరుతున్నారు.

పూడికతీత పనులు

కాకతీయుల కాలం నుంచి ఇప్పటి వరకు భద్రకాళి చెరువు మట్టి పూడికతీత పనులు పూర్తిస్థాయిలో ఎన్నడూ జరగలేదు. దీంతో గోళాకారంలో ఉండాల్సిన చెరువు.. ప్రస్తుతం పూడిక మట్టి పేరుకుపోయి బల్లపరుపుగా మారింది. ఇది గుర్తించిన ప్రభుత్వం.. ప్రజల సౌకర్యార్థం పూడికతీత పనులు చేపట్టాలని నవంబర్ 5న జీవో జారీ చేసింది. అదే నెల 7 నుంచి చెరువు నుంచి నీటిని దిగువ ప్రాంతానికి తరలించారు. 15 రోజుల్లో పూడికతీత పనులు ప్రారంభిస్తామని చెప్పిన అధికారులు.. 40 రోజులు గడుస్తున్నా పత్తాకు లేకుండా పోయారనే విమర్శలు ఉన్నాయి. అయితే చెరువు పూడికతీత పనుల్లో తప్పకుండా బంగారం, విలువైన పురాతన దేవతామూర్తుల బంగారు, వెండి, రాతి విగ్రహాలు బయటపడే అవకాశాలు లేకపోలేదని పురావస్తుశాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



చెరువు కట్ట ప్రాంతంలో పూజలు చేసినట్లు ఉన్న ఆనవాళ్లు

నగరంలో తిష్ట

చారిత్రాత్మక భద్రకాళి చెరువుకు పూడికతీస్తారనే వార్త వ్యాపించడంతో అంతర్‌రాష్ట్ర గుప్త నిధుల ముఠాలు నగరానికి చేరుకున్నాయి. ముంబై, కోల్‌కత్తా నుంచి కొందరు తాంత్రిక, క్షుద్ర పూజారులు బంగారం వెలికితీసేందుకు ఇక్కడకు వచ్చినట్టు పోలీసులు విచారణలో తేలింది. ముఠాలను నడిపించే కొందరు బడా వ్యాపారులు సైతం వరంగల్ నగరంలో తిష్ట వేసినట్టు తెలిసింది. హనుమకొండ కొత్తబస్‌స్టేషన్ సమీపంలోని కొన్ని లాడ్జీలు, వరంగల్ చౌరస్తా, పాతబీటు బజార్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలలో నెల రోజులు నుంచి తిష్ట వేసి ఉన్నట్టు తెలిసింది. కొందరు మాంత్రికులు దేవాలయాలలో బస, మరికొందరు సంపన్న కుటుంబాల ఇళ్ల మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. దీక్షలో ఉన్నట్టు రుద్రాక్షమాలలు ధరించి గడ్డాలు, మీసాలు పెంచుకుని ప్రజలతో మమేకమై ఉంటున్నట్టు తెలుస్తోంది. వీరికి స్థానిక ముఠాల నాయకులు ఆశ్రయం కల్పించి అన్నీ తామై చూసుకుంటున్నారు.

- రాత్రి సమయంలో అక్రమంగా తవ్వకాలు
- చెరువులో మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు
- అనుమానితులను పట్టుకుని చితకబాదిన స్థానికులు
- నిధి, నిక్షేపాలపై పురావస్తుశాఖ ఇప్పటికే హెచ్చరికలు
- నిఘా, రక్షణ లేకుండా వదిలేసిన అధికారులు
- పక్షం రోజుల తర్వాతే పూడికతీత పనులని ప్రకటన
- పత్తాకు కనిపించని పది ప్రభుత్వ శాఖల కమిటీ
- చెరువు పరిరక్షణకు ప్రత్యేక కమిటీ ఎక్కడ?

చాలా రోజులుగా..

చాలా రోజులుగా వరంగల్ నగరంలో గుప్తనిధు ల ముఠాలు సంచరిస్తున్నాయి. వరంగల్ నగరంతో పాటు అవిభక్త జిల్లాలో పురాతన దేవాలయాలు, పాతరాతి కట్టడాలు, పాత నివాసాలు, వందల ఏళ్ల కిందట వదిలి వెళ్లిన గ్రామాల ఖాళీ ప్రదేశాలను జల్లెడ పడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని మధ్య తరగతి హోటళ్లు, లాడ్జీలను అడ్డాలుగా చేసుకుని గుప్తనిధుల వేటలో పడ్డారు. అమాయకులకు మాయమాటలు చెప్పి ఒక్కసారిగా కోటీశ్వర్లు కావొచ్చనే ఆశలు చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు చెందిన పూజారులు ఇక్కడ స్థిరపడి పలువురిని మోసగిస్తున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.

అక్రమంగా తవ్వకాలు

భద్రకాళి చెరువులో గుప్త నిధుల ముఠా రాత్రి వేళల్లో తవ్వకాలు చేపడుతున్నారు. వారు వెంట తెచ్చుకున్న మెటల్ డిటెక్టర్లు, చెట్ల మందులతో రాత్రి సమయంలో భద్రకాళి చెరువు చుట్టూ సంచరిస్తూ గుప్త నిధుల కోసం తనిఖీలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా కొన్ని చోట్ల కుంకుమ, కొబ్బరికాయలు కొట్టి పూజలు కూడా చేసినట్టు ఆనవాళ్లు కనిపించాయి. పోతననగర్ మత్తడి ప్రాంతంలో కొన్ని చోట్ల గుంతలు తవ్వడంతో పాటు మనుషులు నడిచిన అడుగుల ఆనవాళ్లు కనిపించాయి. ఇంకా కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చెరువు సమీపానికి కార్లలో వచ్చి అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు స్థానికులు గమనించారు. వారు తెచ్చుకున్న పరికరాలతో చెరువు మధ్యలో ఎండి పోయిన ప్రాంతానికి చేరి తనిఖీలు చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోతననగర్ ప్రాంతంలో ఇటీవల కొందరు అనుమానితులను స్థానికులు గుర్తించి చితకబాది పంపించినట్టు తెలిసింది. అలాగే ఇటీవల

మిగతా 6వ పేజీలో...



రహస్యాల 'భద్రకాళి'

- చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు
- డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి

8




ఇటీవల భద్రకాళి పరిసరాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ వినాయకుడి విగ్రహం

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..

- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత చికిత్స వద్దు.. వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



'చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. ఫలితంగా రోగాలు చుట్టుముడతాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలో సొంత వైద్యం పాటించకుండా వైద్యుల సలహాలతో చికిత్స పొందాలి. సమతుల్య, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడంతో పాటు చలి నుంచి రక్షణగా పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు, సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి' అని వరంగల్ ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచించారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు.

– వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

8

బడికిరాని విద్యార్థుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే చేపట్టాలి

- హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి): బడికిరాని విద్యార్థుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే చేపట్టాలని హనుమకొండ ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యా కార్మిక, ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్, పోలీసు శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెలలో చేపట్టనున్న బడి బయటి విద్యార్థుల సర్వేపై ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతీ పాఠశాలలో ఒక నెల కంటే ఎక్కువగా గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి వారిని బయట విద్యార్థులుగా గుర్తించాలని ఆమె తెలిపారు. 15 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులు చదువు ఆపేస్తే వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యాభ్యాసం కొనసాగించడానికి ప్రేరేపించాలని తెలిపారు. కాగా, సర్వే జరిగేందుకు అవసరమైన ప్రొఫార్మాలను, సూచనలను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లు?

ఇదీ హనుమకొండ జిల్లా విద్యాశాఖలో అవినీతి బాగోతం ● దృష్టి పెట్టిన నిఘా వర్గాలు



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా విద్యాశాఖలోనూ పదోతరగతి నామినల్ రోల్స్ స్వీకరణలో భారీగానే వసూళ్లు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. టార్గెట్ పెట్టి మరీ నామినల్ రోల్స్ స్వీకరణలో ప్రైవేటు స్కూళ్ల నుంచి భారీగానే వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి వసూళ్లు లేకుండా నామినల్ రోల్స్ స్వీకరిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చినట్టే ఇచ్చి తెర వెనుక కార్యాలయ సిబ్బందిని ఏర్పాటు చేసి మరీ వసూళ్లు చేసినట్లు ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చర్చించుకుంటున్న విషయం బయటకు పొక్కడంతో వసూళ్ల వ్యవహారం ఇప్పుడు విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ స్కూళ్ల నామినల్ రోల్స్‌ను సరిచూసి స్వీకరించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రైవేటు స్కూళ్ల నామినల్ రోల్స్‌ను స్వీకరించే బాధ్యతను మాత్రమే అప్పగించడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేటు పాఠశాలల నామినల్ రోల్స్‌ను సరిచూసేందుకు కార్యాలయ సిబ్బందిని ప్రత్యేకంగా వసూళ్ల కోసమే ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

హనుమకొండ జిల్లాలో మొత్తం మొత్తం 318 పాఠశాలల నుంచి 10వ తరగతి నామినల్ రోల్స్ స్వీకరించగా, అందులో 168 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ ఉపాధ్యాయులు సరిచూసి స్వీకరించగా 150 ప్రైవేటు స్కూల్స్‌కు సంబంధించిన నామినల్ రోల్స్ మాత్రం కార్యాలయ సిబ్బంది వసూళ్లు చేసిన తర్వాతనే ప్రభుత్వ ఉపాధ్యాయులు నామినల్ రోల్స్‌ను స్వీకరించారు. మొత్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను, కార్యాలయ సిబ్బందిని పావుగా వాడి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, అక్రమార్కులు ఎంచుకున్న టార్గెట్‌లో సగానికిపైగానే వసూలైనట్లు విశ్వసనీయ సమాచారం. వసూళ్ల చర్చ బయటకు పొక్కడంతో విద్యాశాఖ కార్యాలయంపై నిఘా వర్గాలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖలో జరుగుతున్న వసూళ్లు, అక్కడకు వస్తున్న వారి వివరాలను నిఘా వర్గాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

జిల్లా ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి



వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా ఆమె సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.1,802.08 కోట్లు రైతులకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.1,231 కోట్లు అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,785.18 కోట్లు లక్ష్యం కాగా, సెప్టెంబరు వరకు రూ.2,136 కోట్లు అందించినట్లు తెలిపారు. భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.997.63 కోట్లకు గాను రూ.765 కోట్లు, ప్రాధాన్యరంగాలకు రూ.4,891.15 కోట్లకు రూ.3,008కోట్లు అందించినట్లు వివరించారు. స్వయం సహాయక సంఘాలకు రూ.628 కోట్లకు రూ.492 కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 2024 వరకు 9,536 మంది లబ్ధిదారులకు రూ.100కోట్ల ముద్ర రుణాలు అందించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మీ, డీసీసీ కన్వీనర్, ఎల్‌డీఎం హవేలి రాజు, యూనియన్ బ్యాంక్ డీఆర్‌హెచ్ మహేశ్, ఆర్‌బీఐ ఏజీఎం పల్లవి, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

6

సీకేఎం ఆస్పత్రి ఏవో సరెండర్‌కు కలెక్టర్ ఆదేశాలు

నగరానికి జస్టిస్ షమీమ్ అక్తర్

ఎస్సీ వర్గీకరణపై విచారణ చేసేందుకు రాక

స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు

6

అనుమానంతో అఘాయిత్యం

- బిహార్ యువకుడి దారుణ హత్య
- కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలో ఘటన
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హత్య జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరిస్తున్న ఏసీపీ నందిరామ్ నాయక్

కరీమాబాద్, డిసెంబరు18, (ఆంధ్రజ్యోతి): తన కుటుంబసభ్యులను తప్పుడు దృష్టితో చూస్తున్నారని కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి.. తన బంధువులతో కలిసి బిహార్‌కు చెందిన కూలీని హత్య చేశారు. వరంగల్ నగరంలో మంగళవారం జరిగిన ఈ హత్య సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి కూపీ లాగుతున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..

బిహార్ రాష్ట్రం బాయముందేపూర్ మండలం, పస్రాతానా జింజర్ గ్రామానికి చెందిన మునిదులర్ చంద్రకుమార్, అతడి సోదరుడు దిల్ కుష్ కుమార్(16)తో పాటు వీరి బంధువు అయిన పవన్‌లు కొంత కాలంగా వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతంలో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఇదే ప్రాంతానికి చెందిన బానోత్ నగేష్‌తో పరిచయం ఏర్పడింది. నగేష్ అత్తగారిల్లు ఈ ముగ్గురు ఉండే గదికి ఎదురుగానే ఉండడంతో కుటుంబసభ్యులతో చనువుగా ఉండేవారు. దీంతో వారు తన భార్యను తప్పుడు దృష్టితో చూస్తున్నారని అనుమానించిన నగేష్.. ఇటీవల బిహార్ సోదరులు చంద్రకుమార్, దిల్‌కుష్ కుమార్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో నగేష్.. తన బంధువులైన అశోక్, బన్నీతో కలిసి వెళ్లి చంద్రకుమార్‌తో గొడవపడ్డాడు. వైన్స్‌షాపు వద్ద ఉన్న అతడిని పక్కకు తీసుకెళ్లి దాడికి దిగారు. పద్ధతి మార్చుకోకపోతే నిన్ను.. నీ తమ్ముడిని చంపుతామంటూ బెదిరించారు. దీంతో ఎలాగోలా చంద్రకుమార్ తప్పించుకొని పారిపోయాడు. తర్వాత నగేశ్.. తనవాళ్లను తీసుకొని చంద్రకుమార్ ఉండే గదికి వెళ్లాడు. అక్కడ చంద్రకుమార్ లేకపోవడంతో ఆయన తమ్ముడు దిల్‌కుష్‌కుమార్‌ను దారుణంగా కొట్టి చంపేసి వెళ్లిపోయారు. అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో చంద్రకుమార్ తన గదికి వెళ్లేసరికి తమ్ముడు దిల్‌కుష్‌కుమార్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ముఖం, తలపై తీవ్ర గాయాలు ఉన్నాయి. దీంతో తన తమ్ముడిని నగేష్, అశోక్, బన్నీ ముగ్గురు కలిసి హత్య చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ భూకబ్జాలపై ఆరా..

'ఆంధ్రజ్యోతి' కథనంతో రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టి

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అక్రమిత భూముల వ్యవహారంపై లీగల్ సెల్‌తో కబ్జాలకు చెక్ శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో వచ్చిన కథనంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ల దృష్టికి వర్సిటీ భూముల కబ్జాల దందా వెళ్లినట్లు తెలిసింది. వర్సిటీ పాలక మండలి సభ్యుల వాట్సాప్ గ్రూపులతో పాటు ఇతర వర్సిటీ గ్రూపుల్లోనూ కబ్జాల కథనం వైరల్‌గా మారింది. ఇటీవల పాలక మండలి సభ్యులు వర్సిటీ భూములపై నజర్ పెట్టాలని పట్టుపట్టడంతో పాటు వర్సిటీ భూములను కాపాడుకునేందుకు అదనంగా మరో ఒక్కరిద్దరిని అడ్వకేట్లను నియమించుకోవాలని సూచించారు. అయితే భూముల వ్యవహారాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన వారినే ప్రత్యేకంగా అడ్వకేట్స్‌గా నియమించుకోవాలని ప్రతిపాదించారు. బుధవారం విద్యార్థులు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఇతర ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించే క్రమంలో వర్సిటీ భూ కబ్జాలపై మాట్లాడారు. వర్సిటీ భూములను కాపాడుతామని స్పష్టంగా ప్రకటించినట్లు తెలిసింది. అలాగే టీహబ్‌ను తెరిపిస్తామని విద్యార్థులకు వీసీ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ

మిగతా 6వ పేజీలో...

పాలిటెక్నిక్ లాటరల్ ఎంట్రీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐలలో రెండేళ్ల కోర్సు పూర్తిచేసి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై పాలిటెక్నిక్‌లో లాటరల్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30లోగా ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి


విద్యార్థిని వర్షిణి ప్రియను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వర్షిణిప్రియ పాల్గొంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థి వర్షిణిప్రియను బుధవారం ఆమె చాంబర్‌లో అభినందించారు. స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటున్న వర్షిణి ప్రియ కళాశాలలో బీఎస్సీ చదువుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

ఎస్సీఈఆర్టీ రాష్ట్రస్థాయి సెమినార్‌కు అశోక్ ఎంపిక



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సెమినార్‌కు కరీమాబాద్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పోగు అశోక్ ఎంపికయ్యారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఏడాది ఎస్సీఈఆర్టీ ఉపాధ్యాయుల నుంచి పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరుతోంది. అందులో భాగంగా ఉపాధ్యాయుడు అశోక్ సమర్పించిన పరిశోధన పత్రం రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైంది. ఆరేళ్లుగా ఆయన ఈ సెమినార్‌కు ఎంపికవుతుండటం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ పుట్ట రమేష్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అశోక్‌ను అభినందించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు


పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ పరేడ్‌లో ఆర్ట్స్ కళాశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి వెల్లడించారు. ఆర్మీ విభాగం నుంచి సీనియర్ అండర్ ఆఫీసర్ బి.ప్రశాంత్, జూనియర్ అండర్ ఆఫీసర్ ఎం.భావన, కేడెట్ కె.నివేదిక, ఫ్లైట్ కేడెట్ దినేష్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి, ఫ్లైయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్, ఆర్మీ వింగ్ కేర్ టేకర్ డాక్టర్ నహేదా పర్వీన్, డాక్టర్ గిరి ప్రసాద్ తదితరులు అభినందించారు.

దివ్యాంగ క్రీడాకారుడు ప్రశాంత్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం


డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ప్రశాంత్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దివ్యాంగులకు అనేక క్రీడా పోటీలు నిర్వహించి వారిని క్రీడల్లో ప్రోత్సహించిన జాతీయ స్థాయి దివ్యాంగ క్రీడాకారుడు గాడిపల్లి ప్రశాంత్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం వరించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశాంత్ పాల్గొని వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నాడు.

కొనసాగుతున్న శిథిలాల తొలగింపు


జేసీబీతో శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

వరంగల్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయాన్ని జేసీబీలతో కూల్చివేసి దానికి సంబంధించిన శిథిలాలను రాత్రి పగలు లేకుండా బయటకు తరలిస్తున్నారు. ఆ స్థలం మేం బాజాప్తా కొన్నామని, ఎట్టిపరిస్థితిలో అందులో కాంప్లెక్స్ నిర్మిస్తామని, ఇందులో న్యాయపరంగా పోతున్నామని వస్త్ర వ్యాపారి చెబుతున్నారు.

నివేదిక కోరిన సీఎంవో

అజంజాహి మిల్లు కార్మికులకు చెందిన యూనియన్ కార్యాలయాన్ని కూల్చిన ఘటనలో కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ మంగళవారం ఆందోళన చేసిన విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు రావడంతో దాని ప్రభావం పార్టీపై, ప్రభుత్వంపై పడే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సదరు భూమికి సంబంధించిన వివరాలను రాబట్టేందుకు మిల్లు కార్మికులను కలిసి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. పూర్తివివరాలతో నివేదిక పంపాలని సీఎంవో కార్యాలయం కోరినట్లు తెలిసింది.

నిందితులపై కేసు నమోదు చేయాలి

» ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్


అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అజంజాహి మిల్లు కార్మికులు నిర్మించుకున్న భవనాన్ని కూల్చిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో మిల్లు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా కార్మికుల పక్షాన అండగా నిలిచిన కాంగ్రెస్ ఇపుడు అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించడం అన్యాయమన్నారు. యంత్రాంగం తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి జగదీశ్వర్, ఐత నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ భూమి కార్మికులదే.. దాన్ని ఎవరికీ అమ్మలేదు..

» చందాలు వేసుకొని భూమి కొని, భవనం నిర్మించాం

» విశ్రాంత కార్మికుడు మార్త శేఖర్



వరంగల్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): "ఆ భూమి, కార్యాలయం కార్మికులదే.. దాన్ని ఎవరూ ఎవరికీ విక్రయించలేదు. అక్కడ యూనియన్ కార్యాలయం కట్టించింది మా ప్రెసిడెంట్ రాధాకిషనే.. ఇందులో ఎవరికీ అనుమానాలు అక్కరలేదు" అని విశ్రాంత కార్మికుడు మార్త శేఖర్ ఘంగాపథంగా చెబుతున్నారు. అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవనాన్ని కూల్చిన ఓ వస్త్ర వ్యాపారి.. అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ కట్టేందుకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో కలిసి భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఆ భూమిని తాను చట్ట ప్రకారమే కొన్నానని వ్యాపారి చెబుతుండగా.. మిల్లు కార్మికులు, రాజకీయ నాయకులు మాత్రం అది కార్మికులదేనని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అజంజాహి మిల్లు విశ్రాంత కార్మికుడు, యూనియన్ క్యాషియర్ మార్త శేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. వివరాలు ఆయన మాటల్లోనే...

అజంజాహి మిల్లు కార్మికుడిగా 1950 నుంచి 1990 వరకు పనిచేశాను. యూనియన్ ఆఫీస్ మొదట్లో స్టేషన్‌రోడ్‌లో ఉండేది. 1957లో మేము చందాలు వేసుకొని ఆ స్థలం కొని యూనియన్ కార్యాలయం నిర్మించాం. అప్పటి మా యూనియన్ అధ్యక్షుడు రాధాకిషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగింది. ఆ స్థలాన్ని 1965 నుంచి 2010 వరకు లీజుకు తీసుకున్నామనడం అబద్ధం. 1972 నుంచి క్యాషియర్‌ను నేనే. నేడు ఏనాడూ లీజు డబ్బులు కట్టలేదు. నన్ను ఎవరూ అడగలేదు. ఇదంతా కల్పితం. భూమికి సంబంధించిన పత్రాలు మా ప్రెసిడెంట్ రాధాకిషన్ దగ్గర ఉండే. బాజాప్తా పర్మిషన్ తీసుకునే కట్టుకున్నం. యూనియన్ కార్యకలాపాలన్ని అందులోనే జరిగేవి. అలాంటిది ఆరేడు ఏళ్ల నుంచే ఈ భూమిని అమ్మినట్లు.. ఎవరో కొన్నట్లు వార్తలు వినబడుతున్నాయి. ఆ స్థలాన్ని మేం ఎవరికీ అమ్మలేదు. ఎవరూ కొనలేదు. వృద్ధాప్యంలో ఉన్న మేము బయట కు రాలేకపోతున్నాం. అందువల్ల కొందరు దానిపై కన్నేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు రంగంలోకి దిగాయి. న్యాయం చేస్తారన్న నమ్మకం ఉంది.

మిల్లు భూములను పరిరక్షించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య

ఖిలావరంగల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అజంజాహి మిల్లు భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల భవనాన్ని కూల్చివేయడం నేరమని, నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ సత్య శారద, రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య స్పందించాలని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు. లేదంటే వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో వామపక్ష నాయకులు రత్నమాల, పనాస ప్రసాద్, నర్రా ప్రతాప్, బండి కోటేశ్వర్‌రావు, ఇనుముల శ్రీనివాస్, అక్కనపల్లి యాదగిరి, రమక్క, కుమారస్వామి, సింగారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

'చెర'బడుతున్నారు!

(5వ పేజీ తరువాయి)

న్యూశాయంపేట ప్రాంతంలో ఓ ముఠాను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని విచారించడంతో భద్రకాళి చెరువు విషయం బయటకు పొక్కింది.

పత్తాకు లేని పది ప్రభుత్వ శాఖలు

భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో వేగం పెంచాలని ఇటీవల హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెండు జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, కమిషనర్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆదేశించారు. 10 శాఖల సమన్వయంలో ఒక కమిటీని వేయాలని ఇరిగేషన్ శాఖకు పగ్గాలు అప్పగించడంతో యుద్ధ ప్రాతిపదికన ఐదు రోజుల కిందట కమిటీ వేశారు. ఈ కమిటీలో కుడా, బల్దియా, ఇంజనీరింగ్, భుగర్భశాఖ, పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌లను కమిటీలో చేర్చారు. అయినా భద్రకాళి చెరువును ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరువు చుట్టూ ఎలాంటి రక్షణ వలయం ఏర్పాటు చేయడం లేదు. కోట్ల విలువైన సంపద భద్రకాళి చెరువు గర్భంలో ఉన్నట్టు పురావస్తుశాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. చెరువులో పూడికతీసే వరకు సిబ్బందిని విధుల్లో ఉంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా భద్రకాళి చెరువు చుట్టూ సీసీ కెమెరాల నిఘా ఉంచాల్సిన అవసం ఎంతైన ఉంది.

15 రోజుల తర్వాత పూడికతీత పనులు

హర్షవర్ధన్‌రెడ్డి, ఈఈ ఇరిగేషన్, కార్పొరేషన్

భద్రకాళి చెరువులో నీరు ఇంకా పూర్తిగా ఇంకిపోలేదు. ఇదివరకే ట్రయల్ చూశాం. కానీ కొంత లోతుకు వెళ్లగానే జేసీబీలు బురదలో దిగబడిపోయాయి. చెరువుపై భాగం ఎండిపోయినట్టు కనిపిస్తున్నా రెండు ఫీట్ల వరకు తవ్వగానే బురదతో కూడిన నీరు వచ్చి పూడికతీతకు ఇబ్బందిగా మారింది. అందే కాకుండా చెరువు నుంచి తీసే మట్టి తరలింపు, విక్రయంలో ఎక్కువ ధర ప్రకటించడంతో చాలా మంది కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. త్వరలో పది శాఖలో ఏర్పడిన కమిటీ ద్వారా పనులు నిర్వహిస్తాం.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య


చంద్రశేఖర్ మృతదేహం

మడికొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న దేవర విజయ్ బాబు కూలీ పని చేస్తుండగా భార్య జ్యోతి పరకాలలోని కోర్టులో అటెండర్‌గా పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడికి వివాహం కాగా, కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. చిన్న కుమారుడు దేవర చంద్రశేఖర్(23) డిగ్రీలో కొన్ని సబ్జెక్టులు ఫెయిలై ఖాళీగా ఉంటుండటంతో కొద్ది రోజులు నుంచి ఇబ్బందిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తల్లి కోర్టుకు వెళ్లి పది గంటలకు ఒకసారి, తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు ఒకసారి కుమారుడికి ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. దీంతో తల్లి చంద్రశేఖర్ మిత్రుడైన మధుకు ఫోన్ చేసి ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. మధు ఇంటికి వెళ్లి చూడగా చంద్రశేఖర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. బుధవారం మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వర్సిటీ భూకబ్జాలపై ఆరా..

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలు డిసెంబరు 23న మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని గతంలోనే ప్రకటించారు. ఈ సమావేశంలో వర్సిటీ భూకబ్జాలు, వర్సిటీ లీగల్ సెల్ పాత్రపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంది. వర్సిటీ అభివృద్ధిపై డీపీఆర్‌ను రూపొందించాలని గతంలోనే వర్సిటీ ఉన్నతాధికారులను ప్రజాప్రతినిధులు ఆదేశించారు. వర్సిటీలో ఉన్నతాధికారులు ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం బోర్డు ఆఫ్‌స్టడీస్ ఛైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి సవితాజ్యోత్స్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కెమిస్ట్రీ విభాగం బీవోఎస్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ ఎస్.జ్యోతి నుంచి కెమిస్ట్రీ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లపాటు సవితాజ్యోత్స్న బీవోఎస్‌గా కొనసాగుతారు. గతంలో సవితాజ్యోత్స్న వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, కెమిస్ట్రీ విభాగాధిపతిగా పనిచేశారు. ఈసందర్భంగా సవితాజ్యోత్స్నను పలువురు అభినందించారు.

రాష్ట్ర ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీఎస్‌ఎడ్‌సెట్ నూతన కన్వీనర్‌గా కేయూ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డిని కేయూ బీసీ సంఘం ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు నేతృత్వంలో విద్యార్థులు కేయూ ఫిజిక్స్ విభాగంలో శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శృంగారపు విష్ణు, రామకృష్ణ, శ్రీసాయి, వేణు తదితరులు పాల్గొన్నారు. కాగా, వెంకట్రామిరెడ్డి టీఎస్ఎడ్‌సెట్ కన్వీనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఆహార కల్తీపై అవగాహన కార్యక్రమం


హనుమకొండ చౌరస్తాలో ఆహార తయారీ, అమ్మకాల్లో జాగ్రత్తల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల మండలి సభ్యులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో పురస్కరించుకొని వినియోదారుల మండలి ఆధ్వర్యంలో హనుమమకొండ టైలర్‌స్ట్రీట్, చౌరస్తాలోని హోటల్స్, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద అహార కల్తీపై ప్రజలకు అవగాహన చైతన్య కార్యక్రమం నిర్వహించారు. బుధ వారం హనుమకొండ చౌరస్తాలో అహార కల్తీపై నిర్వహించిన చైతన్య కార్యక్రమానికి ఫుడ్ సేఫ్టీ అధికారి బ్రహ్మజీ, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణిలు హాజరై ప్రజలకు అవగాహన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేకరీలు, ఐస్‌క్రీం పార్లర్‌లో తీపిదనం కోసం పంచదారకు బదులు రసాయనాలతో కూడిన కృత్రిమ పారిశ్రామిక కెమికల్స్ వాడుతున్నారని వచ్చిన సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. వివిధ ఐస్ క్రీంపార్లర్‌లో అనేక రకాల హానికరమైన కృత్రిమ రసాయనాలు వాడుతున్న నేపథ్యంలో వినియోగదారులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని వారు తెలిపారు. అనంతరం ఫుట్‌పాత్‌ల హోటల్స్‌లో ఒకసారి వాడిన వంట నూనె మరోసారి వాడుతున్నారని తెలిసి హోటల్ నిర్వాహకులను హెచ్చరించామన్నారు. వేడి చేసిన నూనెను చల్లార్చిన తరువాత మళ్లీ వాడటం వలన కాన్సర్ వంటి హానికరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అనంతరం వీధి వ్యాపారుల హోటల్స్ ముందు అహారం తయారీ, నిలువ, సరఫరా, అమ్మకంలో జాగ్రత్తల వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, హైకోర్టు అడ్వకేట్ మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, రావుల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

జస్టిస్ షమీమ్ అక్తర్‌కు ఘన స్వాగతం


షమీమ్ అక్తర్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అంశంపై విచారణ చేపట్టేందుకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌కు బుధ వారం జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ప్రజలు, వివిధ వర్గాల నుంచి వినతులు, అభిప్రాయాలు సేకరిస్తారు.

సీకేఎం ఆస్పత్రి ఏవో సరెండర్‌కు కలెక్టర్ ఆదేశాలు

గిర్మాజీపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించిన వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పరిపాలానాధికారి ఎం.డి.సాజిద్ అలీని వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్ కు సరెండర్ చేస్తూ కలెక్టర్ సత్యశారద ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు గురువారం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ సోమవారం ఆస్పత్రిని తనిఖీ చేసినపుడు ఎలుకలు, కుక్కల సంచారం, అస్తవ్యస్త పరిపాలన, శానిటేషన్, భద్రత, పేషంట్ కేర్, రోగులకు మందుల పంపిణీలో ఏవో నిర్లక్ష్యాన్ని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవో సాజిద్‌అలీని వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేయాలని ఆదేశిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్, వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి బుధవారం నోట్ పంపించారు. సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల గురువారం సెలవులో ఉన్నందున శుక్రవారం ఏవోకు ఆదేశాలు ఇస్తారని తెలిసింది. గతంలో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏవోగా పనిచేసిన సాజిద్ అలీ విధుల నిర్లక్ష్యంపై సరెండర్ అయి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కూడా సరెండర్ కావడం విశేషం.

ఆలయాలకు జియో ట్యాగింగ్ చేస్తాం..

ముఖాముఖి


దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత

ఆంధ్రజ్యోతి: దేవాలయాలకు జియో ట్యాగింగ్ అంటే?

కమిషనర్: జియో ట్యాగింగ్ అంటే కాకతీయ రాజులు నిర్మించిన దేవాలయాలు.. వాటి చరిత్ర, విశిష్టతను గూగుల్ మ్యాప్‌లో అప్‌లోడ్ చేయడం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నారా?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో దేవాలయాల భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పరకాల డివిజన్‌పైలెట్ ప్రాజెక్టుగా 250ఎకరాలకు హద్దులు పెట్టాం.

ఆంధ్రజ్యోతి: కోర్టు కేసుల్లో ఎన్ని ఎకరాలున్నాయి?

కమిషనర్: వంద ఎకరాలు కోర్టు పరిధిలో ఉన్నాయి. ఎప్పటికైనా ఆ భూములు దేవాలయాలకే చెందుతాయి.

ఆంధ్రజ్యోతి: రాయపర్తి మండలం సన్నూర్ దేవాలయానికి చెందిన 899ఎకరాల కౌలు వస్తోందా?

కమిషనర్: రావడం లేదు. దీంతో దేవాలయంలో ధూప, దీప, నైవేద్యానికి సైతం కష్టతరంగా మారింది. దీనిపై కలెక్టర్ సమక్షంలో రైతులతో సమావేశం నిర్వహించాం. మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మేడారం మినీ జాతరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయా ?

కమిషనర్: ఫిబ్రవరిలో జాతర ఉన్నందున అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఎప్పుడు ?

కమిషనర్: 2025 మేలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలుంటాయి. ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రసాదానికి ఏ నెయ్యి వాడుతున్నారు ?

కమిషనర్: అన్ని దేవాలయాల్లో ప్రసాదాలకు విజయ డెయిరీ నెయ్యిని వాడుతున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా ?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో ఈవో స్థాయి అధికారులు 25 మంది అవసరం కాగా, ప్రస్తుతం 16 మందే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

సీపీని కలిసిన పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లు


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు

వరంగల్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందిన 16 మంది బుధవారం సీపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్స్‌కు సీపీ అభినందనలు తెలిపి, అప్పగించిన పనులను నిజాయితీగా చేస్తూ సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. సీపీని కలిసిన వారిలో హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, బాబు, స్వామి, దామోదర్ ఉన్నారు.

రెండో రోజుకు చేరిన ఆమరణ నిరాహార దీక్ష

హనుమకొండటౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ముందు ధర్మసమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు మంద రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు మద్దతుగా దళిత బహుజన ఫ్రంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ పాల్గొని మాట్లాడారు. ధర్మసమాజ్ పార్టీ చేస్తున్న ఐదు డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులతోనే సమాజ వికాసం

▸▸ కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు యాదవ్

హసన్‌పర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సఫాయి కార్మికులతోనే సమాజ వికాసమని 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. గ్రేటర్ 55వ డివిజన్‌లో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని కార్పొరేషన్ కార్మికులకు బుధవారం దస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో కార్మికులు కష్టపడి పనిచేస్తేనే కాలనీలలో పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందన్నారు. కార్మికులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను రక్షించి, వాటిని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేటలో బుధవారం సీపీఎం మండల సమావేశం జరిగింది ఈ సమావేశానికి చుక్కయ్య హాజరై మాట్లాడారు. కాజీపేట మండలంలో ప్రభుత్వ భూములు ఖబ్జాకు గురవుతున్నాయన్నారు. ఆ భూములను గుర్తించి వాటికి కంచె ఏర్పాటు చేసి పేదలకు ఇవ్వాలన్నారు. మండలంలో నిలువ నీడలేని పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి 58, 59 జీవో ప్రకారం ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. న్యూశాయంపేటలో ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంచాలన్నారు. మండల కమిటీ సభ్యులు జంపాల రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, సభ్యులు తొట్టి మల్లేశం, కట్టోజు మదన్ చారి, కలకోటి విమల తదితరులు పాల్గొన్నారు.

పాడిగేదెలు అందించాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడిగేదెల కోసం లబ్ధిదారుల ఎంపిక జరిగి ఐదేళ్లు దాటుతున్నా గ్రౌండింగ్ చేయలేదని, లోకల్ గేదెలను మాత్రమే పంపిణీ చేయాలని డీబీఎస్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటయ్యకు వినతి పత్రాన్ని సమర్పించారు. 2024-25 సంవత్సరానికి వార్షిక ప్రణాళిక ప్రకటించి బ్యాంకులతో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారానే కొత్త లబ్ధిదారులకు రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు గిన్నారపు షైబు, మాదాసి స్వామి, గిన్నారపు రాజు, మాదాసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

వడ్డెపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం మడికొండలోని క్వాడ్రంట్ కార్యాలయ ప్రాంగణంలో వంశీ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కంచరకుంట్ల వంశీరెడ్డి కూతురు ఆశ్రితారెడ్డి బర్త్‌డేను పురస్కరించుకొని ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి, సామాజిక వేత్త గంగాపురం వేణుమాధవ్ తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితోపాటు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సభ్యుడు పుల్లూరు వేణు మాట్లాడారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసు ఉన్న ఆరోగ్యవంతులు ప్రతీ ఒక్కరు రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతీ ఆరోగ్యవంతమైన వ్యక్తి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని సూచించారు. తాము సేకరించిన రక్తం ఆపదలో ఉన్నవారికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా అందిస్తామని తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు వెలుగటి మధూకర్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు నగదు రహిత హెల్త్‌కార్డులు అందజేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారాం

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్‌లకు నగదు రహిత హెల్త్‌కార్డులను అందజేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నయీంనగర్ యూనిట్ సమావేశం బుధవారం నయీంనగర్‌లోని ఆదర్శకాలనీలో జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్స్ పితామహుడు నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ అనారోగ్య సమస్యలతో ఎక్కువ బాధపడుతున్నందున మొదటి ప్రాధాన్యతగా నగదు రహిత హెల్త్‌కార్డులను అందజేయాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్స్ 10మందిని శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, నయీంనగర్ యూనిట్ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, కోశాధికారి యాదగిరి, మహిళా పెన్షనర్లు నిర్మల, సుమతి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ హనుమకొండ జిల్లా ఎంఈవోల విజ్ఞప్తి


దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవోలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ వ్యవస్థ పటిష్ఠతకు కృషిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని హనుమకొండ ఎంఈవోలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏకశిల పార్కు వద్ద ఎస్‌ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలు 13వ రోజుకు చేరాయి. బుధవారం ఎంఈవోలు మూకుమ్మడిగా దీక్షల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా కనీస వేతనాలు లేక కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యాశాఖ పనులే కాకుండా ఇతరశాఖ పనులకు ఉపయోగించుకోవటం వల్ల వారికి పనిభారం కూడా పెరిగిందన్నారు. అయినప్పటికీ విద్యాశాఖ డాటా అప్‌డేట్ వివరాలను సకాలంలో అందిస్తున్న ఎస్‌ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులది న్యాయపోరాటమే అన్నారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ దీక్షల్లో జేఏసీ నాయకులు శ్రీధర్, షఫీ, మనోజ, స్వాతి, 9 వింగ్‌లు కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

వడ్డెపల్లి : సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం (టీఎస్ఎస్‌యూఎస్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికెల శ్రీధర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ షఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు సీహెచ్. కరుణశ్రీ, సీహెచ్. అర్చనలు మాట్లాడారు. ఏళ్లుగా విద్యాశాఖలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని, ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేరాల అదుపులో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలి

వరంగల్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నేరాల అదుపులో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని షీటీం ఇన్‌స్పెక్టర్ కంచి విద్యాసాగర్ అన్నారు. బుధవారం అడ్వకేట్స్ కాలనీలోని ఎస్‌ఆర్ నేషనల్ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు గుడ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, టీ- సేఫ్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తే షీటీం సీఐ 8712685142 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫణిమోహన్, వైస్ ప్రిన్సిపాల్ షేరిన్, షీటీం కానిస్టేబుల్స్ సూర్యనారాయణ, సువార్త పాల్గొన్నారు.

భారీ మొత్తంలో గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న లక్షల విలువ చేసే గుట్కాలను కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీలో రాజ్‌పురోహిత్ మహేంద్ర అనే వ్యాపారి ఇంట్లో విక్రయించడానికి సిద్ధం ఉన్న రూ.7,23,400 విలువ చేసే గుట్కాలను పట్టుకొని సీజ్ చేశామని, తదుపరి చర్యల కోసం హనుమకొండ పోలీసులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ మేకల రంజిత్, ఎస్సై దిలీప్, హనుమకొండ ఎస్సై పరుశురాములు పాల్గొన్నారు.

మునిసిపల్ సిబ్బందికి స్వెటర్లు పంపిణీ

మడికొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మునిసిపల్ కార్యాలయం వద్ద 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి బుధవారం కార్మికులకు స్వెటర్లు, రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతీ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజారోగ్యం కోసం పనిచేసే కార్మికులు చలి, వాన నుంచి రక్షణకు, ఆరోగ్యం కోసం మునిసిపల్ నిధుల నుంచి స్వెటర్లు, రెయిన్ కోట్లు అందజేయడం శుభ పరిణామం అని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్లు కోటేశ్వర్, మల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

వరంగల్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని షేర్ ఎన్జీవో కో-ఆర్డినేటర్ టి.శిరీష అన్నారు. బుధవారం హనుమాన్ నగర్‌లోని ఏకశిల హైస్కూల్‌లో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. మైనర్లకు వివాహం చేస్తే 2 ఏళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) సీఐ వెంకన్న మాట్లాడుతూ.. పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు బానిస కావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ 1098 కో-ఆర్డినేటర్ భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వరంగల్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు. బుధవారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ అందరూ తప్పక పాటించాలని సూచించారు. కారులో ప్రయాణిస్తున్నప్పుడు తప్పకుండా సీటు బెల్టు ధరించాలన్నారు ఈ సమావేశంలో ఆర్ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సై వేణుగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టుబుల్ రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలమూరు యూనివర్సిటీకి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలి


లింగమూర్తి (ఫైల్)

వడ్డెపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని పాలమూరు విశ్వవిద్యాలయానికి ప్రముఖ రచయిత, సాహితీ వేత్త కపిలవాయి లింగమూర్తి పేరును పెట్టాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య పునరుజ్జీవానికి జీవితకాలం కృషి చేసిన గొప్ప వ్యక్తి కపిలవాయి లింగమూర్తి అని పేర్కొన్నారు. లింగమూర్తి వందలాది పుస్తకాలను రచించి సాహిత్యపుటల్లో నిలిచారని పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి, వీణవంక సదానందచారి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

▸▸ ఎన్పీడీసీఎల్ వరంగల్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి


పరిష్కార వేదికలో మాట్లాడుతున్న వేణుగోపాలచారి

వడ్డెపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ సంస్థ లక్ష్యమని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ (సీజీఆర్ఎఫ్-1) చైర్ పర్సన్ వేణుగోపాలచారి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆపరేషన్ సబ్ డివిజన్ - నయీంనగర్ ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ మీటర్లలో, బిల్లులో లోపాలు, విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులు, కేటగిరి మార్పిడి, కొత్త సర్వీస్‌ల విడుదల తదితర అంశాలపై స్వయంగా లిఖిత పూర్వకంగా ఈ మెయిల్, వాట్సాప్ ఆన్‌లైన్ ద్వారా ఫోరంలో ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని అన్నారు. ఈ పరిష్కార వేదికలో టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టెక్నికల్ మెంబర్ కె.రమేష్, ఫైనాన్స్ మెంబర్ ఆర్. చరణ్‌దాస్, డీఈఈ జి.సాంబరెడ్డి, ఏడీఈ రాజు, ఏఈలు తారాచంద్, లక్ష్మణ్‌నాయక్, నవీన్‌తోపాటు రైతులు సంజీవరావు, జంగారెడ్డి, ఐలయ్య, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఇంజనీరింగ్ విద్యార్థుల ఆందోళన

▸▸ కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయింపు

▸▸ తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్


పరిపాలన భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి నిరసన ఆందోళన చేపట్టారు. బుధవారం వర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నుంచి బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్, అధ్యక్షుడు శివకుమార్‌ల నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. తమకు హాస్టల్స్ వసతి కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్, శివకుమార్‌లు మాట్లాడుతూ.. మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వెంటనే హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు సముదాయించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో విద్యార్థులతో మాట్లాడించారు. మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు ఇతర సమస్యలను పరిష్కారించాలని వినతి పత్రాన్ని వీసీ ప్రతాప్‌రెడ్డికి అందచేశారు. ఈసందర్భంగా వచ్చే 6 నెలల్లో విద్యార్థులకు నూతన హాస్టల్స్‌ను నిర్మించి అందుబాటులో తెస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు హామీ ఇచ్చారు. గురువారం ఉదయం వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలను స్వయంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కేయూ కమిటీ నాయకులు రాజేశ్, ధర్మేందర్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి): యువత సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్ నారాయణ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో సామాజిక స్పృహ శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడిచినా ఇంకా దేశంలో కులతత్వం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న వేళ అధికారులు, పాలకులు అవినీతి కూపంలో పీకల లోతుదాక ఇరుక్కుపోయారని అన్నారు. మూఢనమ్మకాలతో, అశాస్త్రీయ భావాలతో దేశం ఆగమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల భిక్షపతి, అశోక్, వెంకటరాజం, సారంగపాణి, సంపూర్ణ, రాములు, లక్ష్మీ పాల్గొన్నారు.

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సెమినార్ హాల్‌కు నిధులివ్వాలి


వీసీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్కాలర్లు సుమన్ తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగం సెమినార్ హాల్ మరమత్తుల కోసం నిధులను కేటాయించాలని శిథిలవ్యస్థకు చేరిన తమ సెమినార్ హాల్‌ను పునర్‌నిర్మించాలని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగం స్కాలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి సెమినార్ దుస్థితిపై వినతి పత్రాన్ని అందచేశారు. తమ విభాగంలో వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు నిర్వహించుకునేందుకు సెమినార్ హాల్‌ను అందుబాటులోకి తేవాలని కోరారు. 20 ఏళ్లుగా తమ సెమినార్ హాల్ జాతీయ సెమినార్లతోపాటు పీజీ కౌన్సెలింగ్‌తో పాటు ఇతర విద్యాపరమైన కార్యకలాపాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్‌ఎం స్కాలర్లు కలకోట సుమన్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెద్ది ఆంజనేయులు

హసన్‌పర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంపీడీవోల జిల్లా అధ్యక్షుడిగా పెద్ది ఆంజనేయులు ఎన్నికైనట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎం.విద్యాలత ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కేంద్ర సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా హసన్‌పర్తి ఎంపీడీవో జూలూరి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నందం విజయ్‌కుమార్, కోశాధికారిగా రామడుగు లక్ష్మీప్రసన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గుండె బాబు, కార్యవర్గ సభ్యుడిగా కమటం అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఈవో విద్యాలత ప్రకటించారు.

కేయూ రాజనీతిశాస్త్ర విభాగం అభివృద్ధికి పాటుపడుతా..


విభాగాధిపతి సంకినేని వెంకట్‌కు నగదు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సారంగపాణి

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం అభివృద్ధికి పాటుపడుతానని, భవిష్యత్‌లో విభాగంలో కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తానని నల్లబెల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి హామీ ఇచ్చారు. బుధవారం కేయూ క్యాంపస్‌లోని రాజనీతిశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్యూమీని హాల్‌తో పాటు విభాగంలో విద్యార్థుల కోసం అందిస్తున్న ఆదునూతన సౌకర్యాలను పరిశీలించారు. తనవంతుగా విభాగంలో సౌకర్యాలకల్పనకు రూ.51వేల విరాళాన్ని విభాగాధిపతి సంకినేని వెంకట్‌కు అందచేశారు. తాను అదే విభాగంలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేదపల్లి నాగరాజు, రిసెర్చ్ స్కాలర్లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి


కేయూలో 1992లో నియమితులైన ఉద్యోగులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఉద్యోగులందరూ అంకితభావం, చిత్తశుద్ధితో ఒత్తిడిని అధిగమిస్తూ సమర్థవంతంగా పనిచేసినప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య ఉద్బోధించారు. బుధవారం 1992లో వర్సిటీలో నియమితులైన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ మనస్సులో మాటను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఓ తోట రాజయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, డిప్యూటీ రిజిస్ట్రార్ ఓ.సారయ్య, ఏఆర్‌లు డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, లైబ్రరీ అధికారి డాక్టర్ సుజాత, డాక్టర్ ఇస్సాక్ ప్రభాకర్, డాక్టర్ కోల శంకర్, ఆర్.వెంకటేశ్వర్లు, పెండ్లి అశోక్‌బాబు, సీహెచ్. ప్రణయ్‌కుమార్, శ్రీలత, నేతాజీ, సునీల్ కుమార్, రాము, అనిశెట్టి రజిత,నర్సయ్య, తోట ప్రభాకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

కోలాహలంగా జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు రెండవ రోజు కోలాహలంగా కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లాఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారన్నారు.

జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రెజ్లింగ్, బాక్సింగ్, లాన్ టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, షూటింగ్, హాకీ, కరాటే, రోయింగ్, స్క్వాష్, కనోయింగ్ కాయాకింగ్ ఆట్యాపాట్యా, పవర్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, సెపక్‌తాక్ర, తైక్వాండో క్రీడల్లో పోటీలు నిర్వహించగా సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు

రెండు రోజులుగా హనుమకొండ జేఎన్ఎస్‌లో హోరాహోరీగా జరుగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు.



అనంతారంలో గుడుంబా నివారణ ర్యాలీలో కిషన్‌నాయక్ (ఫైల్)

అలసట తెలియని సేవకుడు

- నాలుగు దశాబ్దాలుగా నిరుపేదలకు చేయూత
- గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న రిటైర్డ్ టీచర్
- వేతనం, పెన్షన్‌లో సగం సేవలకే ఖర్చు చేస్తున్న గుగులోతు కిషన్


ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో నుంచి ఉత్తమ సామాజిక సేవ అవార్డు అందుకుంటున్న కిషన్‌నాయక్ (ఫైల్)

స్ఫూర్తి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ రిటైర్డ్ టీచర్. మారుమూల తండాలో జన్మించి.. ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. చిన్ననాటి నుంచే తండ్రి నుంచి సేవా వారసత్వాన్ని అందుకున్న ఆయన చదువుకోవడం, విద్యాబోధనే కాకుండా సామాజిక సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా అలసటనేది లేకుండా సామాజిక సేవను కొనసాగిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు గుగులోతు కిషన్‌నాయక్. ఉపాధ్యాయుడి పని చేసినప్పుడు వేతనం.. పదవీవిరమణ పొందాక వస్తున్న పెన్షన్‌లో సగభాగం సేవా కార్యక్రమాలకే ఖర్చు చేస్తున్నారు. తనకు తోచిన మేరకు నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పరీక్ష సామగ్రి, దుస్తులను అందిస్తున్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు బాబునాయక్ తండాకు చెందిన హతీరాంనాయక్, కైకబాయి పెద్ద కుమారుడైన గుగులోతు కిషన్‌నాయక్ చిన్నతనం నుంచే తన తండ్రి హతీరాం నుంచి సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. విద్యార్థి దశనుంచే వామపక్ష భావజాల సంఘాల్లో పనిచేసిన ఆయన సమాజంలో జరిగే అనేక అన్యాయాలపై జరిగిన పోరాటాల్లో పాలుపంచుకున్నారు. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం పని చేసిన ఆయన 1989 సెప్టెంబరు 6న ఉపాధ్యాయ వృత్తిలో చేరారు.


విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ గైడ్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేస్తున్న కిషన్‌నాయక్ (ఫైల్)

గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు

నాలుగు దశాబ్దాలుగా కిషన్‌నాయక్ అనేక సేవా కార్యక్రమాల ను నిర్వహిస్తూ వస్తున్నారు. 1982 లో గిరిజన విద్యావంతుల సిండికేట్, 1990 సంవత్సరంలో గిరిజన సామాజిక చైతన్య వేదికను స్థాపించి మహబూబాబాద్ జిల్లాలోని తండాల్లో గుడుంబా నివారణ, బాల్యవివాహాల నిర్మూలనకు సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ నిర్మూలన, విద్యాప్రాముఖ్యతపై దాదాపు 500వరకు సదస్సులు నిర్వహించారు. తండాలు, పల్లెల్లో బడి బయట ఉండే బడీడు పిల్లలు వారిని బడిలో చేర్పించారు. నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పలకలు, దుస్తులను పంపిణీ చేశారు. ఇప్పటికి వరకు సుమారుగా 6 వేల మంది విద్యార్థులకు తనవంతు సా యం అందించారు.

1990, 1999లో గిరిజనుల జీవన స్థితిగతులపై 450 గిరిజన తండాల్లో అధ్యయనం చేసి, నాటి ప్రభుత్వాలకు నివేదికలను అందించారు. ఎక్కడ ఉపాధ్యాయుడిగా పని చేస్తే ఆ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసే వారు. 2022లో జిల్లాలోని పలు మండలాల్లో విద్యా అవగాహన సదస్సులు చేపట్టి, విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. దళిత కాలనీలు, గిరిజన తండాలు, ఆదివాసీ గూడాల్లో అంబేద్కర్, పూలే ఆలోచన విధానంపై చైతన్య సదస్సులను నిర్వహించి మహనీయుల గొప్పతనాన్ని చాటి చెప్పారు. తనకు వచ్చే వేతనంలో సగం సామాజిక సేవకే ఖర్చు చేసే వారు. దివ్యాంగులు, అనాథలకు దుస్తులు, దుప్పట్లు అందించి తనవంతు సాయమందించారు.

భావితరాలకు మహనీయుల జీవిత చరిత్రలు

దేశంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడ్డ మహనీయులు జీవిత చరిత్రలను భావి తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో వారి జీవితచరిత్ర పుస్తకాలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు కిషన్‌నాయక్ పంపిణీ చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే, పెరియర్, సాహుమహారాజ్, సేవాలాల్ మహారాజ్ లాంటి వారి చరిత్ర కనుమరుగు కావొద్దనే లక్ష్యంతో సొంతంగా పుస్తకాలు కొనుగోలు అందజేస్తుంటారు. ఆ మహనీయుల జయంతి, వర్ధంతుల రోజు సదస్సులను ఏర్పాటు చేస్తూ, వారు చేసిన సేవలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 30న ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అందుకోసం ప్రస్తుతం తనకు వస్తున్న పెన్షన్ నుంచి సగం కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..



- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వైద్యం గౌతం

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ మెడికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సహజంగానే వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని ఫలితంగా రోగాల బారిన పడాల్సి వస్తుందని వరంగల్ ఎంజీ ఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచిం చారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు.

● ప్రయాణంలో ముక్కు కారడం, తుమ్ములు వస్తుంటాయి?
భూక్య శ్రీనివాస్, నరసింహారావుపేట, మహబూబాబాద్ జిల్లా

డాక్టర్ : సాధారణంగా ప్రయాణం చేసే సమయంలో దుమ్ము ధూళి వల్ల ముక్కు కారడం జరుగుతుంది. ముక్కులో నుంచి రక్తం కారినట్లు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే ప్రయాణం చేసే సమయంలో మాస్క్ ధరించాలి. తరుచూ ముక్కును శుభ్రం చేసుకోవడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు.

● చర్మంపై దురతోపాటు జలుబు తగ్గడం లేదు?
సింగు లక్ష్మీనారాయణ, దామెరమెంట్ల, కాటారం మండలం, భూపాలపల్లి జిల్లా

డాక్టర్: జలుబు పూర్తిగా తగ్గకపోతే సైనసైటిస్‌గా అనుమానించవచ్చు. ఎక్స్‌రే, సిటీ స్కాన్ చేసి వ్యాధిని నిర్ధారించొచ్చు. చర్మంపై దురదను నివారణకు మాశ్చరైజర్ లేపనాలను వాడాలి.

● దగ్గు, గొంతు నొప్పితో పాటు కండరాల నొప్పి ఉంటుంది?
గోదాసి అశోక్ కుమార్, ధర్మారం, గీసుగొండ మండలం, వరంగల్ జిల్లా

డాక్టర్: చలికాలంలో సర్వసాధారణం. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల సంభవిస్తుంది. గొంతు నొప్పికి వైద్యుడి సలహా మేరకు యాంటీబయాటిక్ వాడటం వల్ల అధిగమించవచ్చు. కండరాల నొప్పులు అన్ని కాలాల్లో ఉంటే వైద్యులను తప్పకుండా సంప్రదించాలి.

● నా భార్యకు శ్వాస ఇబ్బంది.. గొంతు, ముక్కు మూసుకపోయినట్లు అనిపిస్తుంది.
సప్పిడి రాము, ఏటూరునాగారం

డాక్టర్: చలి తీవ్రత పెరగడంతో సాధారణంగా ఇలాంటి లక్షణాలు పెరుగుతాయి. ఇలాంటి వాటిని అధిగమించడానికి హ్యూమిడిపయర్ కూడా అందుబాటులో ఉంది. లేదంటే సాధారణ కుక్కర్లు విజిల్స్ వచ్చే వరకు ఉంచి నిద్రించే గదిలో ఉంచడం వల్ల గాలిలో తేమ శాతం పెరుగుతుంది. వీటికితోడు చేతులకు, కాళ్లకు గ్లౌజులు, మంకీ క్యాప్ వాడాలి.

● గురుకులాలు, వివిధ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు చర్మ వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్ వస్తున్నాయి?
నరేశ్, ఏబీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

డాక్టర్: చలికాలంలో సహజంగా ఇమ్యూనిటీ తగ్గడం వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి. కొబ్బరినూనె లాంటివి వాడటం వల్ల చర్మ వ్యాధులను అధిగమించవచ్చు. జ్వరాల తీవ్రత పెరిగితే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● కడుపు ఉబ్బరంగా ఉంటుంది. తేలికపాటి ఆహారం తీసుకున్నా జీర్ణమైనట్టు అనిపిస్తలేదు?
అడువాల రత్నాకర్, గోపాల్‌పూర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో చాలా తక్కువ తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం. నాలుగు గోడల మధ్య శారీరక వ్యాయామం చేస్తే ఈ పరిస్థితిని అధిగమించవచ్చు. ఎప్పటికి ఇలాగే ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● ఆకలి కావడం లేదు
తడూరి శ్రీదేవి, విజయగణపతి నగర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో సహజంగా ఆకలి మందగిస్తుంది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఆకలి అయినట్లు అనిపించదు. తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవడం ఉత్తమం. వేడి పదార్థాలు మాత్రమే భుజించాలి. రాత్రి 7 గంటల్లోపు మాత్రమే తినాలి. మధ్యాహ్న భోజనం కూడా సాధ్యమైనంత త్వరగా చేయాలి. సమయపాలన పాటించడం వల్ల వీటన్నింటినీ అధిగమించవచ్చు.

● చలికాలంలో శ్వాస ఇబ్బంది తలెత్తుతుంది?
వీరమల్ల శ్యామ్, కరీమాబాద్, వరంగల్

డాక్టర్: చలికాలంలో శ్వాస ఇబ్బందులు తలెత్తడం సహజం. కానీ సైనోసైటీస్ సమస్య అయితే మాత్రం వైద్యులకు చూపించాలి. ముక్కుకు మాస్క్ పెట్టుకోవడం తప్పనిసరి.

పల్లెల్లో పట్నాల సందడి

మల్లన్నకు ఘనమైన మొక్కులు


వెంకటాపూర్‌లో మల్లన్న పెళ్లికి వేసిన పట్నం

ఆచారం


మల్లన్నకు నైవేద్యం సమర్పించే ప్రతిమలు

గ్రామగ్రామాన మల్లన్న పట్నాల సందడి కనిపిస్తోంది. ప్రతీ ఏడాది డిసెంబరు, జనవరి మాసాల్లో కొమురవెల్లి మల్లన్న పండుగ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో బుధవారం పలు గ్రామాల్లో మల్లన్న పట్నాలు(చిన్నపట్నం, పెద్ద పట్నం) వేస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నపట్నం ఒక్కరోజే ముగుస్తుందని, పెద్ద పట్నమైతే ఐదురోజులు నిర్వహిస్తామని యాదవ రాజులు చెబుతున్నారు. పెద్దపట్నం వేసుకునేవారి ఇళ్లలో మల్లన్న దేవుడి పెళ్లిసందడి కనిస్తుంది. పుట్ట బంగారం తీసుకురావడంతో మల్లన్న పట్నాల సందడి మొదలవుతుంది. ఒడువాల బియ్యంతో పోలుపోసిన తర్వాత మైలలు తీసే కార్యక్రమం జరుగుతుంది. ఆతర్వాత మల్లన్నకు అభిషేకం, స్నానం చేయించి పోలుమీదికి తీసుకురావడంతో కార్యక్రమం ముగుస్తుంది. మరుసటిరోజు ఉదయం పసుపు,కుంకుమ, ఒడిబియ్యంతో మల్లన్న పట్నాల చుట్టూ తిరుగుతూ నాగవెల్లి కార్యక్రమం నిర్వహించి మల్లన్న పట్నాలను ముగిస్తారు. గజ్జెల్లాగులతో పోలుతొక్కించి శివసత్తుల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి ఉంటుంది.

- వెంకటాపూర్, ఆంధ్రజ్యోతి

పచ్చని చిలుకలు తోడుంటే..



క్లిక్ క్లిక్



పంటలు.. పశుపక్షాదుల ప్రకృతి అనుబంధం అంతాఇంతా కాదు. సూర్యోదయమైనా.. సూర్యాస్తమయ సమయమైనా పక్షుల కిలకిలారావాలతో పల్లెలు పరవశిస్తాయి. పొలాల్లో సంచరించే పిచ్చులు, కొంగలు తదితర పక్షులు కనులవిందు చేస్తుంటాయి. వాటిలో రామచిలుకలదైతే ప్రత్యేక స్థానం. వాటి పెంపుడు పక్షిగానే కాకుండా సాక్షాత్తూ ఆ సీతారామచంద్రస్వామి స్వరూపంగా భావిస్తారు. అలాంటి రామచిలుకల సమూహం ఇదిగో ఇలా రైతుకు తాము తోడున్నామన్నట్టుగా.. ఓ కల్లం వద్ద రాసిగా పోసిన ధాన్యంపై వాలి సందడిచేశాయి. అంతేకాదు ఆ వడ్లను బుక్కుతూ కనిపించాయి. ఈ సందర్భంలో ఆరుగాలం శ్రమించిన ఆ రైతు కూడా వాటిని చూసి మురిసిపోతూ తాను పడిన కష్టాన్ని మరిచిపోయాడు. వరంగల్ జిల్లా ఎలుకుర్తిలో బుధవారం కనిపించిందీ దృశ్యం.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

వడ్డెపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి శివారులోని చెరువుకట్ట శివాలయం వద్ద గల ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురుస్వాములు శ్రీకాంత్, హరిమహేందర్, ఆకుల మధు ఆధ్వర్యంలో పురోహితుడు ప్రవీణ్‌శర్మ పర్యవేక్షణలో అయ్యప్పస్వామి పడిపూజను బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ విజయ్ భాస్కర్, కార్పొ రేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తదితరులతో పాటు అయ్యప్ప భక్తులు అనుమాల శ్రీకాంత్, బోయినపల్లి సాయి తదితరులు స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు.


పడిపూజలో పాల్గొన్న స్వాములు

ఖండాంతరాలు దాటిన ప్రేమ

ఇటలీ అమ్మాయితో వరంగల్ అబ్బాయికి పెళ్లి


దేశాయిపేటలో వివాహం చేసుకున్న జంట

పోచమ్మమైదాన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారు ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. ఖండాంతరాలు దాటిన ప్రేమకు మూడుముళ్లు వేసి ఒక్కటయ్యారు. వరంగల్ దేశాయిపేట ఒయాసిస్ కాలనీకి చెందిన కొడిపాక సదానందం - ప్రసన్నరాణి దంపతుల కుమారుడు సూర్యప్రీతం కొన్నేళ్ల కిందట ఉన్నత విద్యకోసం లండన్ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో అక్కడ ఇటలీ దేశానికి చెందిన జెన్నిపేటలోని - మోనికపేటలోని దంపతుల కుమార్తె మార్తపేటలోనితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరు కలిసి ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించారు. బుధవారం దేశాయిపేటలోని సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

రైల్వే బోర్డుపై ఉండే.. 'ఎంఎస్ఎల్+' అంటే..!

ప్రతీ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంకు రెండు చివరలా ఊరును తెలిపే బోర్డులు ఉంటాయి. వాటిపై 'ఎంఎస్ఎల్+' అనే అక్షరాలతో పాటు ఒక నెంబరు రాసి ఉంటుంది. అసలు ఈ ఎంఎస్ఎల్+ అంటే ఏంటనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు. అయితే 'మీన్ సీ లెవల్'(సగటు సముద్ర మట్టం) పదాలకు సంక్షిప్త రూపమే ఎంఎస్ఎల్. ఇక '+' అనేది సముద్ర మట్టానికి ఎత్తులో ఉన్నదని సూచిస్తుంది. సదరు రైల్వే స్టేషన్ సముద్ర మట్టానికి ఎంతఎత్తులో ఉందనేది మీటర్లలో చూపుతుంది. ఉదాహరణకు కేసముద్రం రైల్వేస్టేషన్ బోర్డుపై 'ఎంఎస్ఎల్+218.34ఎం' అని ఉంటుంది. అంటే ఈ రైల్వేస్టేషన్ సముద్రమట్టానికి 218.34 మీటర్ల ఎత్తులో ఉందన్న మాట. రైల్వే సిబ్బందికి సాంకేతికంగా రైలు నడపడంలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ప్రయాణికులకు ఈ సంఖ్య భౌగోళిక అవగాహనను కల్పిస్తుంది. సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న రైల్వేస్టేషన్ల వద్ద బోర్డులపై +5, +10మీటర్లే ఉంటుంది. తుఫానులు, వరదలు వచ్చిన సమయంలో ఆయా ప్రాంతాల్లో ఈ సమాచారం ఎంతో కీలకంగా మారుతుంది.


మీకు తెలుసా?



- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

రహస్యాల భద్రకాళి

- చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు
- డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


సిద్దులగుట్టపై నాటి అడుగుల ఆనవాళ్లను చూపిస్తున్న చరిత్రకారుడు రత్నాకర్‌రెడ్డి



ఆనవాళ్లు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు నీటిని ఖాళీ చేయడంతో పరిశోధకుల దృష్టి భద్రకాళి చెరువుతో పాటు చెరువు చుట్టు అల్లుకుని ఉన్న గుట్టలపై పడింది. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక భద్రకాళి చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయని, నగర ప్రజలు గతంలో ఎన్నడూ ఎరుగని అద్భుతాలు చూస్తారని డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రత్నాకర్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఆసక్తికర విషయాలను బుధవారం వెల్లడించారు.

● వేలాది ఏళ్లుగా ఆదిమానవులు, రాజవంశీయులు, ఆధ్యాత్మికపరులు మొదలుకుని నేటి ఆధునిక మానవులను భద్రకాళి చెరువు, చుట్టూ ఉన్న గుట్టలు ఆకర్షిస్తున్నాయి భద్రకాళి చెరువు అంచున ఆదిమానవులు జీవించిన గుహలు, చెరువు మధ్యలో ద్వీపంలా ఉండే గుట్టపై రాతి పనిముట్ల పరిశ్రమ, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, కాకతీయుల నాటి సైనికుల కోట వెనుక నుంచి రహస్య మార్గం, ఆ మార్గం నుంచి చెరువులోకి దిగడానికి వీలుగా ఉన్న మెట్ల మార్గాన్ని ప్రతాప్ హేమంతులతో కలిసి నూతన చారిత్రక ఆధారాలను గతంలోనే గుర్తించారు.

● హనుమద్గిరి తటాకాంజనేయస్వామి దేవాలయం వెనుక నుంచి చెరువులోకి దిగితే రెండు శిలలపై చెరువు ముఖంగా శిల్పకళ ఉట్టిపడే విధంగా రాష్ట్రకూటుల కాలం నాటి వినాయకులు, చాముండీదేవి శిల్పాలు, రైలింగ్ మధ్యలో ఉన్న శివలింగాలు, నందివిగ్రహాలు, సూర్యుడి శిల్పాలు కనిపిస్తాయి.

● ఈ శిల్పాలపై భాగంలో విశాలమైన ఒక గుహ ఉంది. ఈ గుహలో 12000 సంవత్సరం నుంచి 2000 సంవత్సరం మధ్యకాలంలో ఆదిమానవులు తలదాచుకున్నట్టు తెలుస్తోంది. గుహలోపల పెద్ద పెద్ద ఇటుకలు ఉండడంతో ఈ గుహలో సిద్ధులు లేదా రుషులు నివసించేవారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

● గుహ ముందు భాగంగా కోడిగుడ్డు ఆకృతిలో ఉన్న రెండు గ్రూస్ ఉన్నాయి.


● గుహ ముందు నుంచి గుట్ట చివరి అంచు నిర్మించబడిన కోట గోడలు కనిపిస్తాయి. ఇక్కడ కుడి వైపు నుంచి కాకతీయుల పాలకులు నిర్మించిన కోట లోపలి వైపు వెళ్లడానికి రహస్య మార్గం ఉంది. ఈ మార్గం గుండా సైనికులు చెరువులోకి దిగి స్నానాలు చేసి దాహార్తిని తీర్చుకోవడానికి వీలుగా శిలకు తొలిచిన మెట్లు ఉన్నాయి.

● చెరువు వైపు దిగువన ఏటవాలుగా ఉన్న శిలపై ఆలయం నిర్మించే ప్రయత్నాలు చేసినట్టు తొలిచిన పునాదులు సాక్ష్యంగా ఉన్నాయి.

● ఈ ఆలయ రాతి పునాదుల పక్కన శిలకు అసంపూర్ణంగా చెక్కిన భైరవ శిల్పం ఉంది.

● సిద్దుల గుట్ట వెనుక వైపు భద్రకాళి చెరువు మధ్యలో ద్వీపంలా ఉన్న గుట్టపై నవీన శిలాయుగం నాటి ఆదిమానవులు రాతి పనిముట్లను తయారు చేసుకున్న పరిశ్రమ ఉంది. యాభైకి పైగా గ్రూస్ (పొడవైన బద్దులు) ఉన్నాయి.

● గుట్ట పూర్తి ఉపరితంలో సమతల ప్రదేశంలో బృహద్ శిలాయుగం నాటి డాల్మెన్ సమాధి ఉంది. చెరువులో రాక్షస గూళ్లను పురావస్తు శాఖ గతంలో గుర్తించింది. పురావస్తు శాఖ సమగ్ర పరిశోధన చేస్తే భద్రకాళి చెరువు, చెరువు చుట్టూ ఉన్న గుట్టలు పర్యాటకులను మరింత విశేషంగా ఆకట్టుకుంటాయని రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు.


సిద్దుల గుట్టలో చిన్నపాటి బండరాళ్లపై ఉన్న పరుపుబండ


గుట్ట ఎక్కడానికి తొలిచిన మెట్లు

పరిటాల రవి హత్య కేసులో..
ఐదుగురు దోషులకు బెయిల్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి దివంగత పరిటాల రవి హత్య కేసులో ఐదుగురు దోషులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దోషులు పి.నారాయణ రెడ్డి(ఏ3), రేఖమయ్య(ఏ4), బజన రంగనాయకులు(ఏ5), వడ్డే కొండ(ఏ6), ఓబిరెడ్డి(ఏ8)లకు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. అనంతపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సంతృప్తి మేరకు రూ.25 వేలతో ఒక్కొక్కరూ రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. న్యాయాధికారి విధించిన షరతును ఉల్లంఘించినా.. ఏదైనా నేర ఘటనలో పాల్గొన్నా.. ఎవరినైనా బెదిరించినా.. కోర్టు దృష్టికి తీసుకొస్తే బెయిల్ రద్దు చేస్తామని తెలిపింది. 18 ఏళ్లుగా వీరు జైల్లో గడుపుతున్నారని గుర్తు చేసింది. క్షమాభిక్ష కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. వారు దరఖాస్తులను నాలుగు వారాల్లో పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి, జస్టిస్ టి.మల్లికార్జునరావుతో కూడిన ధర్మాసనం ఈ నెల 13న ఉత్తర్వులు ఇచ్చింది. తీర్పు ప్రతి బుధవారం అందుబాటులోకి వచ్చింది.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంలో ఊరట

- తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు నోటీసులు
- యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టేటస్ కో(యథాతథ స్థితి) విధించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జనవరి 22కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. 2002లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించారు. ట్రిబ్యునల్, రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, ఎస్ఎస్సీ గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిప్లొమా ఇన్ హెల్త్ అసిస్టెంట్ అర్హతగా పేర్కొంటూ మెరిట్ జాబితాను సిద్ధం చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును కొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో అర్హత లేని 1200 మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత బాధితులు తమకు న్యాయం చేయాలన్న విజ్ఞప్తి మేరకు తొలగించిన 1200 మందిని కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల్లోకి తీసుకుంటూ 2013లో మరో జీవో జారీ చేసింది. అయితే, 2013లో కాంట్రాక్ట్ పద్ధతిలోకి తీసుకుంటూ ఇచ్చిన జీవో చెల్లదని ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ జీవో చట్ట విరుద్ధమని, కోర్టు తీర్పుల స్ఫూర్తికి అది వ్యతిరేకమని తీర్పులో హైకోర్టు వ్యాఖ్యానించింది. దీనివల్ల భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అభిప్రాయ పడింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తే, ప్రభుత్వం చేసిన తప్పే తామూ చేసినట్టు అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. 90 రోజుల్లో అర్హతతో కూడిన మరో జాబితాను సిద్ధం చేయాలని తీర్పులో ఆదేశించింది. హైకోర్టు తీర్పును బాధితులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

'పాలమూరు- రంగారెడ్డి' వివరాలన్నీ సీల్డ్ కవర్‌లో సమర్పించండి: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారంలో అన్ని వివరాలను సీల్డ్ కవర్‌లో అందించాలని తెలంగాణ ప్రభుత్వం, బీహెచ్ఈఎల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ నాగం జనార్దన్ రెడ్డి 2019లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న సీజేఐ ధర్మాసనం.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన వివరాలన్నీ సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసు ఫిబ్రవరి 11న మళ్లీ విచారణకు వచ్చే అవకాశముంది.

సీఎల్పీకి టీపీసీసీ చీఫ్ విందు!
పాల్గొన్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ బుధవారంరాత్రి ఇక్కడి ఓ హోటల్‌లో సీఎల్పీకి విందు ఇచ్చారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, పార్టీ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ నిర్ణయం కేసీఆర్, హరీశ్‌రావులదే!

రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ .. దాంట్లో భాగంగానే ప్రాణహిత-చేవెళ్ల మార్పు

- సీఎం కన్నా మంత్రివర్గమే శక్తిమంతమైనది
- కానీ, సీఎం మాట కాదన్న మంత్రికి ఉద్వాసనే!
- కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు మాజీ సీఎస్ ఎస్‌కే జోషి జవాబులు
- పునాదిలో ఇసుక జారి మేడిగడ్డ కుంగిందన్న మాజీ స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలని నిర్ణయం తీసుకున్నది మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులేనని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శైలేంద్రకుమార్ జోషి తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం.. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌కు గత ప్రభుత్వం నిర్ణయించిందని.. దాంట్లో భాగంగానే మేడిగడ్డపైనా నిర్ణయం తీసుకుందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఎదుట బుధవారం జోషి హాజరయ్యారు. ఆయనపై కమిషన్ పలు ప్రశ్నలు సంధించింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టడానికి కారణం?

రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ చేశారు. అప్పటికి బ్యారేజీ తప్ప ఇతర కాంపోనెంట్ల పరంగా 7.7 % పనులు జరిగాయి. మహారాష్ట్ర అభ్యంతరాలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రంతో మేడిగడ్డ నిర్మాణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర జలవనరుల సంఘం కూడా తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిజర్వాయర్ల నీటి సామర్థ్యం పెరగాలని చెప్పింది.

బ్యారేజీలు అక్కడే కట్టాలనే నిర్ణయాలు ఎవరివి?

అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో వ్యాప్కోస్ కమిటీ, సీఈ, సీడీవో, ఇంజనీర్లతో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సబ్‌కమిటీ వేయలేదు. 2016 మే 2న మేడిగడ్డ బ్యారేజీ వద్ద కేసీఆర్ భూమి పూజ చేసి, మూడు బ్యారేజీల నిర్మాణం ప్రారంభించారు. అదే రోజు ప్రాణహిత చేవెళ్ల పేరు మార్చారు.

బ్యారేజీల నిర్మాణంపై విధానపరమైన నిర్ణయం తీసుకున్నారా? ప్రభుత్వం అంటే ఏమిటి?

అప్పటి మంత్రివర్గం, సీఎం కేసీఆర్ విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. సింగిల్ జడ్జి కన్నా బెంచ్ బలమైనదన్నట్లుగా.. సీఎం కన్నా మంత్రివర్గమే బలమైనది. అయితే సీఎంను ఎవరైనా మంత్రి వ్యతిరేకించినా, అసమ్మతి తెలిపినా ఆ మరుసటి రోజే మంత్రివర్గం నుంచి ఉద్వాసన ఉంటుంది.

స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) లక్ష్యాలు, విధులు, బాధ్యతలు ఏమిటి? కాళేశ్వరం ప్రాజెక్టుకు పరిపాలన పరమైన అనుమతులన్నీ ఉన్నాయా?

వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన ఐదుగురు చీఫ్ ఇంజనీర్లతో ఎస్ఎల్ఎస్‌సీ ఉంటుంది. ఒక ప్రాజెక్టుకు సంబంధించిన అంచనాల ప్రతిపాదన వచ్చినప్పుడు ఆ కమిటీ చర్చించి, లోపాలుంటే వాటిని సవరించాలని సూచిస్తుంది. అన్నీ సరిగా ఉంటే ఆ ప్రతిపాదనలకు పరిపాలనపరమైన అనుమతి ఇవ్వవచ్చని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు 28 ప్యాకేజీలు, 8 లింకులుగా ఉంది. గూగుల్ మ్యాప్ ఆధారంగా ప్రాజెక్టులో మార్పులు చేశాం. చీఫ్ ఇంజనీర్ ఎస్ఎల్ఎస్‌సీకి ప్రతిపాదనలు పంపిస్తే... ఆ తర్వాత ప్రభుత్వానికి చేరిన తర్వాత దాదాపు 200లకు పైగా పనులకు విడివిడిగా పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చాం.

మేడిగడ్డ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న సంస్థ కొన్ని బ్లాకులను వేరే సంస్థతో కట్టించిందా?

ఆ సమాచారం తెలియదు.

ఇసుక జారిపోయి మేడిగడ్డ కుంగింది

మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు పునాదుల కింద ఇసుక జారటం వల్లే బ్యారేజీ కుంగిందని నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ కాళేశ్వరం కమిషన్‌కు తెలియజేశారు. మేడిగడ్డ వైఫల్యానికి కారణాలేంటో చెప్పగలరా? అని కమిషన్ ప్రశ్నించగా.. కచ్చితమైన కారణాలు తెలియదని, రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా బ్యారేజీ కుంగిందని, దీంతో మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉండటంతో బ్యారేజీ వద్దకు వెళ్లలేదన్నారు. బ్యారేజీలు నీటి నిల్వ కోసమా అన్న ప్రశ్నకు జవాబిస్తూ.. నీటి నిల్వ కోసం కాదని, నీటి మళ్లింపు కోసమే కట్టాలన్నారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారన్న ప్రశ్నకు.. ప్రాజెక్టు అథారిటీ (సంబంధిత చీఫ్ ఇంజనీర్) ఆ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నిర్మాణ ఒప్పందానికి విరుద్ధంగా.. వేర్వేరు తేదీలతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఇచ్చారా అని అడగగా.. తనకు తెలియదని పేర్కొన్నారు.

నేడు సోమేశ్‌కుమార్, స్మితా సబర్వాల్ విచారణ

కాళేశ్వరంపై విచారణలో భాగంగా గురువారం సీఎంవో మాజీ కార్యదర్శి, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో పాటు మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ కమిషన్ ఎదుట హాజరు కానున్నారు.

విద్యుత్‌శాఖలో ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

వారి పోరాటానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే కూనంనేని



విద్యుత్ ఆర్టిజెన్స్ కన్వర్షన్ జేఏసీ ఛలో హైదరాబాద్ ధర్నాలో కూనంనేని

కవాడిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను వారి వారి విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్‌లుగా కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజెన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌లో భాగంగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అసెంబ్లీ సమావేశాల తరువాత సీఎం రేవంత్‌కు లేఖ రాసి, ఆయనను కలిసి విన్నవించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. జేఏసీ చైర్మన్ కె ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఎ వజీర్‌లు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇచ్చిన తరువాతనే జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో విద్యుత్ సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జేఏసీ కో చైర్మన్ చింత ఎల్లయ్య, బి శంకర్, కో కన్వీనర్లు జి నాగరా జు, అరవింద్‌కుమార్, ప్రసాద్, సదానందం, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి నిధులివ్వండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి
- మానేరుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.224 కోట్ల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని కేంద్రమంత్రి గడ్కరీ నివాసంలో ఆయనతో భేటీ అయిన బండి సంజయ్ ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్ నుంచి బావూపేట ఖాజీపూర్ వరకు మానేరు నదిపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం సహ మొత్తం 90 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ పనులకుగాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని బండి సంజయ్ తెలిపారు.

వేడి వేడి రాగి జావ పడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు

- గిన్నెను టేబుల్‌పై ఉంచే క్రమంలో విద్యార్థుల కాళ్లపై పడిన జావ
- అందులో కాలు జారి వంట మనిషికి గాయాలు
- యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారంగా వండిన వేడి వేడి రాగి జావ మీద పడి ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. కింద పడిన ఆ జావలో కాలు జారి ఓ వంట మనిషి కూడా గాయపడ్డారు. ఈ దుర్ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లోని గురుకుల పాఠశాలలో బుధవారం జరిగింది. సర్వేల్ గురుకుల పాఠశాలలో 6 నుంచి 10తరగతుల వరకు 400మంది విద్యార్థులు చదువుతున్నారు. అల్పాహారం, భోజన సమయంలో రోజూ 5 నుంచి 10 విద్యార్థులు ఆహారం వడ్డించేందుకు వంట సిబ్బందికి సహాయం చేస్తుంటారు. బుధవారం అల్పాహారంగా వండిన రాగి జావ గిన్నెను వంట సిబ్బంది డైనింగ్ హాల్‌కు తీసుకొచ్చారు. ఎనిమిదో తరగతి చదువుతున్న శివరాత్రి సామేల్, మదన్, ఇతర విద్యార్థులు వంట సిబ్బందికి సహాయం చేసేందుకు వచ్చారు. అప్పుడు రాగి జావ గిన్నెను టేబుల్‌పై ఉంచే క్రమంలో వేడి వేడి జావ విద్యార్థి సామేల్ కాళ్లపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే మరో విద్యార్థి మదన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వంట మనిషి బోయ ఇందిరమ్మ అప్రమత్తమై వారి వద్దకు వెళ్లే క్రమంలో రాగిజావలో అడుగు పడి జారి పడ్డారు. దాంతో సామేల్, ఇందిరమ్మను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం సామేల్‌ను హైదరాబాద్‌కు, ఇందిరమ్మను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎప్పుడూ ఉండే వంట మనుషులు కాకుండా బుధవారం తాత్కాలిక వంట మనుషులతో వంట చేయించడం వల్లే ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనపై వివరణ కోరేందుకు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేయగా, ఆయన సమాధానమివ్వలేదు. ఈ ఘటనపై విచారణ జరిపి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థికి పాముకాటు !

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఓంకారి అఖిల్ అనే ఎనిమిదో తరగతి విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం ఉదయం నిద్రలేచిన తర్వాత అఖిల్ తన చెయ్యి నొప్పిగా ఉందని చెప్పడంతో పాఠశాల నిర్వాహకులు అతడిని కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే, పాము కాటు లేదా హానికర కీటకాలు కుడితే ఉండే లక్షణాలను అఖిల్‌లో గుర్తించిన వైద్యులు యాంటీ వినమ్ ఇంజెక్షన్ ఇచ్చారు. అఖిల్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది.

దమ్ముంటే చర్చ పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ముఖ్యమంత్రికి బుధవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. తనపై, గత ప్రభుత్వంపై ప్రస్తుత పాలకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై మంత్రివర్గ సమావేశంలో గంటన్నరకు పైగా చర్చ జరిగిందని, తనపై కేసు నమోదు చేసేందుకు గవర్నర్ అనుమతిచ్చారంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి, హైదరాబాద్‌కు మంచి జరగాలనే సదుద్దేశంతో తాము అధికారంలో ఉన్నప్పుడు ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. 2023లో జరిగిన రేసు వల్ల రాష్ట్రానికి రూ.700 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. 2024లో మరోసారి రేసు జరగాల్సి ఉండగా ప్రస్తుత ప్రభుత్వం దానిని ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు. నాటి నుంచి ఈ ఒప్పందం అంశంలో ఏదో జరిగిందనే అపోహ సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగిందని తాను చెప్పినా ప్రభుత్వం దుష్ప్రచారం ఆపడం లేదని వాపోయారు. ఇప్పటికైనా రాజకీయ కక్ష సాధింపును ఆపి శాసనసభలో చర్చ నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక, ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చ జరపాలని కోరుతూ బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరఫున స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాగా, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ర్యాలీపై కేటీఆర్ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఇక, అదానీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ర్యాలీని విమర్శిస్తూ 'అదానీ, రేవంత్ భాయి.. భాయి' అంటూ వారిద్దరూ కలిసున్న ఫొటోలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హరీశ్ రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల హామీలను అమలుచేయాలని నిరసన తెలుపుతున్న కేటీఆర్

కేటీఆర్ ఆటో సవారీ

ఎమ్మెల్యే కేటీఆర్ కారులో కాకుండా బుధవారం ఆటోలో అసెంబ్లీకి వచ్చారు. ఖాకీ దుస్తులు ధరించి ఆటోను స్వయంగా నడుపుతూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి శాసనసభకు వచ్చారు. 93 మంది ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఆయన ఈ ఆటో సవారీ చేశారు. సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల జాబితాను గత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వానికి ఇచ్చామని, ఇప్పటిదాకా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ఆర్థిక ఇబ్బందులకు భయపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆటో కార్మికులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరఫున అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలి చైర్మన్ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

తొలుత చెల్లింపులు.. తర్వాత ఒప్పందాలు

- ఈ-ఫార్ములా కారు రేసు కేసులో విచారణ షురూ
- సాక్ష్యాధారాలు సేకరించిన ఏసీబీ

హైదరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) ఈ-ఫార్ములా కారు రేసు కేసులో ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. సీఎస్ శాంతి కుమారి నుంచి అందిన ఫైల్ ఆధారంగా కేసు దర్యాప్తులో ఏసీబీ అధికారులు ముందుకు వెళ్లనున్నారు. డాలర్లలో చేసిన చెల్లింపులు దారి మళ్లాయా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ముందే చెల్లింపులు జరిపిన తర్వాత ఒప్పందం చేసుకున్న అంశాన్ని ఏసీబీ అధికారులు పరిశీలించనున్నారు. ఈ కేసులో నాటి మంత్రి కేటీఆర్ పాత్రకు సంబంధించి పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే ఆయన అరెస్టుకు వెళ్లవచ్చునని సమాచారం. రూ.46కోట్లను విదేశీ సంస్థకు డాలర్లలో చెల్లింపులు జరిపిన విధానంలో అనేక లొసుగులున్నాయని తెలుస్తోంది. వాస్తవంగా విదేశీ సంస్థలకు డాలర్లు ఇస్తున్నట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుంటే రిజర్వ్ బ్యాంకు నుంచి అనుమతి తీసుకోవాలి.. ఇక్కడ రిజర్వ్ బ్యాంకు అనుమతి లేకుండానే రూ.46కోట్లను డాలర్ల రూపంలో ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు చెల్లించడం జరిగింది. నాటి మంత్రి కేటీఆర్ ఇచ్చిన మౌఖిక ఆదేశాలతోనే ఈ విషయంలో ఫైలు నడిచిందంటూ ఇప్పటికే ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ రాతపూర్వకంగా సీఎస్ శాంతికుమారికి వివరణ ఇచ్చారు. మొత్తం రూ.55 కోట్లు హెచ్ఎండీఏ ఖర్చు చేస్తే ఆ డబ్బు ఏ విధంగా చెల్లింపులు చేశారు., తర్వాత ఆ కంపెనీ ఖాతాల నుంచి దారిమళ్లిందా? అనే కోణంలోనూ దర్యాప్తు అధికారులు విచారించనున్నారని తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు సరైన నోట్ ఫైల్ లేకుండా డబ్బు చెల్లింపులు చేయడం, ముందు డబ్బులు చెల్లించి.. ఆ తర్వాత ఒప్పందాలు చేసుకున్న విషయాలపైనా ఏసీబీ అధికారులు ఆరా తీయనున్నారని తెలుస్తోంది.

బడుల్లో సదుపాయాలు మెరుగుపర్చాలి

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యావిధానం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఐఏఎస్‌లను నియమించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. అసెంబ్లీలో విద్యా వ్యవస్థపై లఘు చర్చ సమయంలో ఆయన మాట్లాడారు. గురుకులాల మెనులో మార్పు, డైట్ చార్జీల పెంపు అభినందనీయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యావిధానం సరిగా లేదన్న కారణంగా ఆటో డ్రైవర్లు కూడా తమ పిల్లల్ని ప్రైవేటులో చదివిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయడంతోపాటు సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఇదిగో సాక్ష్యం!
మూసీ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడిగారు
సభను తప్పుదోవ పట్టించారు: ఎమ్మెల్సీ కవిత

మూసీ సుందరీకరణకు సంబంధించి డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు కాలేదని, ప్రపంచ బ్యాంకు నుంచి ఎలాంటి సాయాన్ని అభ్యర్థించలేదని సీఎం రేవంత్‌రెడ్డి తరఫున మంత్రి శ్రీధర్‌బాబు తప్పుడు సమాచారం ఇచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కోసం 2024 సెప్టెంబరు 19న రూ.4100 కోట్లు సాయం అందించాలని రాష్ట్రప్రభుత్వం ప్రపంచ బ్యాంకును అభ్యర్థించిందని, ఇందుకు సంబంధించి సాక్ష్యాలున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్ ఉందని అందులో స్పష్టంగా పేర్కొన్నారని, సభలోఈ విషయం చెప్పకుండా మంత్రి సమాధానం దాటవేశారని విమర్శించారు. సభకు తప్పుడు సమాచారం ఇచ్చిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ప్రివిలైజ్ నోటీస్ ఇచ్చినట్లు కవిత వెల్లడించారు.


వివిధ ప్రాంతాల నుండి బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డుకు వచ్చిన టమాటాలు

ఎగిసి.. పడిపోయిన టమాట!
నెల క్రితం కిలో రూ.80-100 ఇప్పుడు రూ.12 నుంచి 20లోపే

బోయిన్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొన్నటిదాకా ఆకాశాన్నంటిన టమాటా ధరలు ఇప్పుడు నేలను తాకాయి. నెల క్రితం కిలో రూ.80 నుంచి రూ.100 ధర పలికితే ఇప్పుడు రూ.12 నుంచి రూ.20లోపే దొరుకుతున్నాయి. రైతులకు టమాట పంట కోతకు వస్తుండటంతో బాక్సులకొద్దీ సరుకు మార్కెట్లకు పోటెత్తుతోంది. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో 25 కిలోల టమాటా బాక్సు సైజు, నాణ్యతను బట్టి 200-300, 400-500 వరకు పలుకుతోంది. ధర పడిపోవడంతో వినియోగదారులు ఊరట చెందితే రైతులు లబోదిబోమంటున్నారు. టమాటాలు పండించిన రైతులకు మాత్రం కిలో రూ.4-రూ.5కే వస్తోంది. ఇదే 25 కిలోల బాక్సును రైతుల నుంచి రూ.50-100కే కమిషన్ ఏజెంట్లు కొంటున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాలి

- ఎమ్మెల్యే రామ్‌చంద్ నాయక్

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకంగా విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే రాంచంద్ నాయక్ కోరారు. విద్యా వ్యవస్థపై లఘు చర్చ సమయంలో మాట్లాడుతూ... ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందిస్తే... ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిన వారికే ఎక్కువగా అవకాశం దక్కుతుందన్నారు. అలా కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారిని ప్రోత్సహించేందుకు వారికి ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించాలన్నారు.

ఏడాదిలో 40 మంది విద్యార్థులు మృతి

- పాల్వాయి హరీశ్ బాబు

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఏడాదిలో 40 మంది విద్యార్థులు మృతి చెందారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆరోపించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ... ఏడాదిలో వెయ్యి మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. బడిఈడు పిల్లల్లో 40 శాతం మంది మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్నారు. మిగతా వారు ప్రైవేటులో చదువుకుంటున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరికలు 2.50 లక్షలు తక్కువగా ఉన్నాయని చెప్పారు.

సమీకృత పాఠశాలల ఏర్పాటు అందుకే..

- ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నా... గురుకులాల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతోందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అందుకే ప్రభుత్వం సమీకృత పాఠశాలలు(ఇంటిగ్రేటెడ్ స్కూల్స్) ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.... గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో గురుకులాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. అద్దె కోసం రేకుల షెడ్లలో గురుకులాలు ఏర్పాటు చేశారు... కమీషన్ల కోసం ప్రాజెక్టులు నిర్మించి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని అనిల్ కుమార్ అన్నారు.

ప్రతి వారం వైద్య పరీక్షలు చేయాలి: రాజేశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల మెరుగైన ఆరోగ్యం కోసం వారంలో ఒకరోజు స్థానిక ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థపై లఘు చర్చ సమయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గురుకులాల్లో సరైన సదుపాయాలు కల్పించలేదని గుర్తు చేశారు. గురుకుల విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందించాలని ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి కోరారు.









పుట్టిన రోజున ప్రమాణ స్వీకారం



తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా నియమితులైన ప్రముఖ నిర్మాత దిల్ రాజు(వెంకటరమణారెడ్డి) బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన పుట్టినరోజు కావడం గమనార్హం. కుటుంబ సభ్యులతో ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ సందర్భంగా దిల్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ 'చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందింది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఇంకా అభివృద్ధి సాధించాలి. టీఎఫ్‌డీసీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తా. ప్రభుత్వానికీ, చిత్ర పరిశ్రమకు మధ్య వారధిగా పని చేస్తా. పరిశ్రమలోని అన్ని విభాగాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తా. తెలంగాణ సంస్కృతిని ఆధారంగా చేసుకుని సినిమాలు వచ్చేలా చూడాలి' అన్నారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన దిల్ రాజుకు హీరో రామ్‌చరణ్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



కాశీలో శివశక్తి

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. ఈ నెల 22న కాశీలో 'తండేల్' చిత్రం నుంచి శివశక్తి పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. జాతర నేపథ్యంలో సాగే గీతమిది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో నాగచైతన్య, సాయిపల్లవి శివ పార్వతుల నాట్య భంగిమలో కనువిందు చేశారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

'లాపతా లేడీస్'కు నిరాశే!

● ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో దక్కని చోటు



భారతీయ చిత్రం 'లాపతా లేడీస్'కు ఆస్కార్ అవార్డుల రేసులో నిరాశ ఎదురైంది. ఆమిర్‌ఖాన్ సతీమణి, 'దోబీ ఘాట్' ఫేమ్ కిరణ్‌రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆస్కార్ అవార్డు కోసం ఉత్తమ విదేశీ చిత్రాల కేటగిరిలో మన దేశం నుంచి అధికారికంగా ఎంపికైన విషయం విదితమే. 'లాపతా లేడీస్' గొప్ప సందేశాత్మక చిత్రం కనుక తప్పకుండా ఆస్కార్ అవార్డ్ వస్తుందని అందరూ భావించారు. అయితే మంగళవారం ప్రకటించిన ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 'లాపతా లేడీస్' లేకపోవడం అందరినీ నిరాశపరిచింది. అయితే భారతీయ నటి షహనా గోస్వామి ప్రధాన పాత్రలో సంజయ్ సూరి తెరకెక్కించిన 'సంతోష్' అనే హిందీ చిత్రం మాత్రం యూకే నుంచి ఎన్నికై ఈ షార్ట్ లిస్ట్‌లో ఉండడం కొంతలో కొంత ఊరట. 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అలాగే, రెండు సార్లు అకాడమీ అవార్డు అందుకున్న భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన షార్ట్ ఫిల్మ్ 'అనుజ'. న్యూ ఢిల్లీ నేపథ్యంలో 9 ఏళ్ల బాలకార్మికురాలు జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా ఇది తెరకెక్కింది. లైవ్ యాక్షన్ షార్ట్ కేటగిరి జాబితాలో ఎంపికైన 15 లఘు చిత్రాల్లో 'అనుజ' ఒకటి కావడం విశేషం. వచ్చే ఏడాది జనవరి 17న ఫైనల్ నామినేషన్స్‌ను ప్రకటిస్తారు. మార్చి 3న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది.



విజయ్ సేతుపతి ప్రధాన పాత్రధారిగా వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'విడుదల 2' చిత్రం ఈనెల 20న విడుదలవుతోంది. వీరి కలయికలో గతంలో వచ్చిన 'విడుదల-1' చిత్రానికి ఇది కొనసాగింపు. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "అణచివేతకు గురైన పీడిత వర్గాల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథే ఈ 'విడుదల - 2'. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు వెట్రిమారన్ చెప్పారు. అందుకే తమిళ సినిమా అయినా మన నేటివిటీకి దగ్గరగా ఉంటుంది. పెట్టుబడిదారులను ఎదిరించి పీడిత వర్గాలకు ఎలా విముక్తి కలిగించారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రంలో విప్లవ నాయకుడు పెరుమాళ్ పాత్రకు విజయ్ సేతుపతి నూటికి నూరు శాతం న్యాయం చేశాడు. నక్సలైట్ పాత్రలో ఆయన నటన, భావోద్వేగాలను పండించిన తీరు అద్భుతం. ఈ చిత్రానికి ఇళయరాజా అందించిన నేపథ్య సంగీతం, పీటర్ హెయిన్స్ రూపొందించిన పోరాట ఘట్టాలు, మంజు వారియర్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ. మా బేనర్ శ్రీ వేదాక్షర మూవీస్‌పై నిర్మించిన శ్రీశ్రీ రాజావారు చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. 'డ్రీమ్‌గర్ల్' చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది" అని

యథార్థ సంఘటనల ఆధారంగా


హిట్టా.. బ్లాక్‌బస్టరా అనేది వారి చేతుల్లో ఉంది

- అల్లరి నరేశ్



"హనుమాన్' చిత్రం విజయంతో ఈ ఏడాది ఘనంగా ఆరంభమైంది. ఇప్పుడు 'బచ్చలమల్లి' సినిమా సక్సెస్‌తో ఈ ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమకు అదిరిపోయే ముగింపు ఇవ్వాలి' అని అల్లరి నరేశ్ ప్రేక్షకులను కోరారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'బచ్చలమల్లి' ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'నిర్మాత రాజేశ్ ఏ విషయంలోనూ రాజీ పడకుండా సినిమాను అన్ని హంగులతో నిర్మించారు. ఎంత కష్టమైనా అవసరమైనవన్నీ సమకూర్చారు. దర్శకుడు సుబ్బు ఈ సినిమా కథ చెప్పగానే నాకు బాగా నచ్చింది. ఈ సినిమాను హిట్ చేస్తారా, బ్లాక్ బస్టర్ చేస్తారా అనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంది. అయితే ఒక్కటి మాత్రం బలంగా నమ్ముతున్నాను. 'ఈ క్రిస్మస్ మనదే" అన్నారు. దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ 'ఈ రోజు నేను దర్శకుడిగా మీ ముందుకు రావడానికి కారణమైన సాయిదుర్గాతేజ్, మారుతికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. బచ్చలమల్లి పాత్రను కేవలం నరేశ్ మాత్రమే చేయగలరు' అని చెప్పారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "బచ్చలమల్లి' నా మనసుకు దగ్గరైన కథ. ఈ సినిమా కోసం నేను కూడా ప్రేక్షకుడిలా ఎదురుచూస్తున్నాను. నరేశ్ లేకపోతే 'బచ్చలమల్లి' లేదు. ఆయన మూడు గెటప్స్‌లో అలరిస్తారు' అని అన్నారు.

మ్యాక్స్ ఆగమనం అప్పుడే



కన్నడ హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రలు పోషించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో కలైపులి.ఎస్.థాను నిర్మించారు. ఈ నెల 27న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతున్నట్లు యూనిట్ ప్రకటించింది. సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగు హక్కులను పొందింది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో సుదీప్ నటన ప్రేక్షకులను అలరిస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: శేఖర్ చంద్ర

స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల్లో

రాధాకిషన్ దమానీ టాప్

స్విగ్గీ ఫౌండర్లు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డికి మూడో స్థానం

» హైదరాబాద్‌కు చెందిన 6 కంపెనీలు, 11 మందికి చోటు

» హురున్ ఇండియా-ఐడీఎఫ్‌సీ ఫస్ట్ లిస్ట్





ముంబై: స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల జాబితాలో డీమార్ట్ సూపర్ మార్కెట్ల అధిపతి రాధాకిషన్ దమానీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. 'టాప్-200 సెల్ఫ్‌మేడ్ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2024' పేరుతో హురున్ ఇండియా-ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్ బ్యాంకింగ్ సంయుక్తంగా ఈ లిస్ట్‌ను విడుదల చేశాయి. ఈ జాబితా విడుదల కావడం ఇది రెండోసారి. ఈ ఏడాది కూడా దమానీ తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. గడిచిన ఏడాది కాలంలో డీమార్ట్ సూపర్ మార్కెట్ల యాజమాన్య సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్ విలువ 44 శాతం పెరిగి రూ.3.42 లక్షల కోట్లకు చేరుకుందని ఆ నివేదికలో తెలిపారు. మరిన్ని విషయాలు..

● ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగంలోని జొమాటో ఫౌండర్ దీపిందర్ గోయల్, స్విగ్గీ వ్యవస్థాపకులు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి వరుసగా 2,3 స్థానాల్లో నిలిచారు. జొమాటో విలువ ఏడాది కాలంలో 190 శాతం వృద్ధి చెంది రూ.2.51 లక్షల కోట్లకు చేరుకుంది. కాగా, స్విగ్గీ మార్కెట్ విలువ 52 శాతం పెరిగి రూ.1.01 లక్షల కోట్లకు ఎగబాకింది.

● రూ.99,300 కోట్ల విలువైన మేక్ మైట్రిప్ వ్యవస్థాపకులు దీప్ కర్లా, రాజేశ్ మాగోవ్.. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ (రూ.96,100 కోట్లు) ఫౌండర్ అభయ్ సోయ్ 4, 5 స్థానాలను దక్కించుకున్నారు.

● పాలసీ బజార్.కామ్‌కు (రూ.78,600 కోట్లు) చెందిన యశిష్ దహియా, అలోక్ బన్సల్ 6వ స్థానంలో ఉన్నారు. ఆన్‌లైన్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్11కు (రూ.66,500 కోట్లు) చెందిన భవిత్ సేథ్, హర్ష్ జైన్ 7వ స్థానం దక్కించుకున్నారు.

● ఆన్‌లైన్ బ్రోకింగ్ సేవల కంపెనీ జీరోధా (రూ.64,800 కోట్లు) ఫౌండర్లు నితిన్ కామత్, నిఖిల్ కామత్‌కు 8వ స్థానం లభించగా.. ఫిన్‌టెక్ కంపెనీ రేజర్‌పేకు (రూ.62,400 కోట్లు) చెందిన హర్షిల్‌మాథుర్, శశాంక్‌కుమార్ 9వ స్థానంలో ఉన్నారు.

● ఆన్‌లైన్‌లో సౌందర్య ఉత్పత్తులను విక్రయించే పోర్టల్ నైకా (రూ.56,600 కోట్లు) వ్యవస్థాపకురాలు ఫాల్గుని నాయర్ పదో స్థానాన్ని దక్కించుకున్నారు. స్వయంకృషితో ఎదిగిన 19 మంది మహిళా పారిశ్రామికవేత్తల విభాగంలో నాయర్‌దే అగ్రస్థానం.

● క్విక్ కామర్స్ పోర్టల్ జెప్టో (రూ.41,800 కోట్లు) వ్యవస్థాపకులైన కైవల్య వోహ్రా (21 ఏళ్లు), ఆదిత్ పలిచా (22 ఏళ్లు) ఈ జాబితాలోని అత్యంత పిన్న వయస్కులు. కాగా, ఐటీ కంపెనీ హ్యాపీయెస్ట్ మైండ్స్ వ్యవస్థాపకులు అశోక్ సూతా (81) అత్యంత పెద్దవారు.

● స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తలు అధికంగా ఉన్న నగరాల్లో 98 మందితో బెంగళూరు అగ్రస్థానంలో, హైదరాబాద్ 11వ స్థానంలో ఉన్నాయి.

● జాబితాలోని 200 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.36 లక్షల కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం పెరిగింది. ఈ కంపెనీలు 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

తెలుగు ఆంత్రప్రెన్యూర్లు స్థాపించిన కంపెనీల వివరాలు

ర్యాంక్	కంపెనీ	విలువ(రూ.కోట్లు)	స్థాపన	వ్యవస్థాపకులు
3	స్విగ్గీ	1.01 లక్షలు	2013	శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి
25	దక్కన్ ఫైన్ కెమికల్స్	31,600	2006	వంశీ గోకరాజు, జీఎస్ రాజు
31	ఎంఎస్ఎన్ లేబొరేటరీస్	26,200	2003	ఎం సత్యనారాయణ రెడ్డి
34	లారస్ ల్యాబ్స్	24,900	2005	సత్యనారాయణ చావ
40	కిమ్స్ హాస్పిటల్స్	21,900	2000	భాస్కర్ రావు బొల్లినేని
98	ర్యాపిడో	9,200	2015	పవన్ గుంటుపల్లి
119	మెడ్‌ప్లస్	8,200	2006	మధుకర్ రెడ్డి గంగడి
142	బొండాడ ఇంజనీరింగ్	6,400	2012	రాఘవేంద్ర రావు బొండాడ
160	జగిల్ ప్రీపెయిడ్	5,300	2011	రాజ్ ఫణి
162	టీమ్‌లీజ్ సర్వీసెస్	5,200	2000	అశోక్ రెడ్డి

ధరణితో 25వేల ఎకరాలు అన్యాక్రాంతం

» ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం: భట్టి



హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ కారణంగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు పెద్ద ఎత్తున అక్రమార్కుల పాలయ్యాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ధరణిలో లొసుగులను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూములను ఇతరుల పేరిట రిజిస్టర్ చేశారన్నారు. ఇలా రిజిస్టర్ చేయించుకున్న వ్యక్తులు ఆ భూములను ప్లాట్లుగా చేసి విక్రయించారని తెలిపారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో బుధవారం భట్టి విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి భూములు దాదాపు 25 వేల ఎకరాలుంటాయని, ఇందులో ఎక్కువ శాతం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయని చెప్పారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే 10వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్లు వివరించారు. ఈ భూములకు సగటున ఎకరాకు రూ.10 కోట్లు ఉంటుందని.. 25 వేల ఎకరాలకు దాదాపు రూ.2.50లక్షల కోట్లు వచ్చేవని, ఇదంతా ఖజానాకు నష్టమేనని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న భూభారతి చట్టం ద్వారా ఇలాంటి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆడిట్ నిర్వహించి, అన్యాక్రాంతమైన భూములను గుర్తించి, స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. గత 12 నెలల్లో కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.38,400 కోట్ల నిధులను రాబట్టుకోగలిగినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మండలిలో మాట్లాడుతూ రాష్ట్రానికి 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరునాటికి టాక్స్ డివొల్యూషన్ కింద రూ.28,171 కోట్లు, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ రూ.2,819 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.6,442 కోట్లు, జీఎస్టీ కింద రూ.518 కోట్లు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయం కింద రూ.450 కోట్లు నిధులు విడుదల చేసిందని తెలిపారు.

2026 డిసెంబరు నాటికి పాలమూరు-రంగారెడ్డి పనులు పూర్తి: ఉత్తమ్



హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులను 2026 డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయనున్నట్టు సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రూ.32,305 కోట్లు ఖర్చయిందని, మరో రూ.33,201 కోట్ల నిధులు అవసరమన్నారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానమిచ్చారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు మొదటి దశ పంపింగ్ యూనిట్‌ను గత ఏడాది సెప్టెంబరు 16న ప్రారంభించినట్టు గుర్తు చేశారు. 18 ప్యాకేజీలుగా ప్రాజెక్టు పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టునకు ఎలాంటి అనుమతులు పొందకుండానే పనులు ప్రారంభించిందని, రూ.27,500 కోట్ల నిధులు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు సాగునీళ్లు ఇవ్వలేకపోయిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద 42,90,246 తెల్లరేషన్ కార్డులున్న కుటుంబాలకు రూ.500కే సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ తెలిపారు. సబ్సిడీ సిలిండర్ల కోసం 91.5 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసినట్టు చెప్పారు. సబ్సిడీ సిలిండర్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు.

డ్రగ్స్ కేసుల్లో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్



డ్రగ్స్ కేసుల్లో ఏ స్థాయి ప్రముఖులున్నా ఉపేక్షించేది లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. సినీ ప్రముఖులు, రాజకీయనాయకులున్నా డ్రగ్స్ ఇతర కేసుల్లో ఎంత పెద్దవారున్నా వదిలేదిలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం హుక్కా సెంటర్లను నిషేధించిందని, కోర్టు అనుమతిలో 12 హుక్కా కేంద్రాలు నడుస్తున్నట్టు తెలిపారు. 'రాజకీయ, సినీ ప్రముఖులెవరూ చట్టానికి అతీతులు కారు. నిబంధనలు ఉల్లంఘించిన పబ్‌లపై 14ఎఫ్ఐఆర్‌లు, 21 పెట్టి కేసులు నమోదు చేశారు. నార్సింగిలో ఓ సినీ నటుడికి సంబంధించి కేసు నమోదైంది. మత్తు మందు వినియోగిస్తున్నారనే ఫిర్యాదులతో కాలేజీలు, పాఠశాలలపై నిరంతర నిఘా పెట్టాం. పలు కాలేజీలకు నోటీసులు జారీ చేశాం. డ్రగ్స్ వినియోగించినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. పబ్‌లలో డ్రగ్స్ గంజాయి దొరికితే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. గ్రామాల్లో సైతం డ్రగ్స్ సమస్యలు పెరుగుతున్నాయి' అని మంత్రి అన్నారు.

దేవాలయ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు : మంత్రి కొండా సురేఖ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల భూములను రక్షించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్టు దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండాసురేఖ తెలిపారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా పలు ప్రశ్నలకు మంత్రి సురేఖ సమాధానమిచ్చారు. ధూపదీప నైవేద్యం పథకంలో ఒక్కో ఆలయానికి నెలకు రూ.10 వేల చొప్పున 6,271 ఆలయాలకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. అర్చకుల సంక్షేమానికి నిధులు కేటాయించినట్టు చెప్పారు.

మండలిలో మూడు బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో బుధవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు ఏకగ్రీంగా ఆమోదం లభించింది. 'తెలంగాణ యువభారత వ్యాయామ విద్య- క్రీడా వర్సిటీ 2024' బిల్లును దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టారు. మహిళా వర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మారుస్తూ 'తెలంగాణ విశ్వవిద్యాలయ చట్టం'ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రతిపాదించారు. అదే విధంగా జీఎస్టీ సవరణ బిల్లును ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. అధికార విపక్ష పార్టీల సభ్యులు ఈ బిల్లులపై చర్చించిన అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. కాగా, ఈ మూడు బిల్లులను శాసన సభ మంగళవారం ఆమోదించింది.

అదానీపై సభలో చర్చ ఎందుకు పెట్టట్లేదు?

» పోరాటం నిజమైతే అగ్రిమెంట్లు రద్దు చెయ్యండి: హరీశ్



హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి నిజంగా గౌతమ్ అదానీపైన పోరాటం చేయాలనుంటే.. దావోస్‌లో ఆయనతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ పోరాటం అదానీ మీదే అయితే ఈ అంశంపైన శాసనసభలో చర్చ పెట్టాలని కోరుతున్నా ఎందుకు పెట్టడం లేదంటూ నిలదీశారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి.. రోడ్లపైన చేస్తున్న సర్కస్ ఫీట్లు చూసి.. ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతోందన్నారు. రాజ్‌భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లుగా సర్కస్ చేసిన రేవంత్ రెడ్డి.. అక్కడ కూడా కేసీఆర్, బీఆర్ఎస్ గురించే విమర్శలు చేశారన్నారు. అదానీ, రేవంత్ అక్రమ సంబంధం పైన అసెంబ్లీలో గురువారం చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానమైతే.. రాజ్‌భవన్ వద్ద ధర్నాలో పాల్గొన్న అందరిపైనా కేసులు పెట్టాలని సీపీ సీవీ ఆనంద్‌కు సవాల్ విసిరారు. కాగా, మీడియాకు హరీశ్ రావు బంపర్ ఆఫర్ ప్రకటించారు. గురువారం, తాము ఏ రూపంలో నిరసన వ్యక్తం చేస్తూ సభకు హాజరవుతామో చెబితే ఎలక్ట్రిక్ కారు గిఫ్టుగా ఇస్తామని మీడియాతో అన్నారు.

భూమికి భరోసా



(మొదటిపేజీ తరువాయి)

భద్రత కల్పించేలా, సామాన్యుల హక్కులను పరిరక్షించడమే ధ్యేయంగా ఈ చట్టాన్ని రూపొందించామని.. భూభారతి చట్టం వందేళ్లు వర్థిల్లుతుందని పేర్కొన్నారు. 1971లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత ఏడేళ్ల పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా కొనసాగిందని అన్నారు.. అర్ధరాత్రి వేళ నాలుగు గోడల మధ్య రూపొందించిన ధరణి చట్టం వల్ల సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని ఆరోపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకే ఆర్వోఆర్ చట్టం-2020ను ప్రక్షాళన చేసి భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమే కాకుండా, 40 రోజుల పాటు వెబ్‌సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు, కవులు, మేధావులు, అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు 7 పేజీల సలహాలు, సూచనలు ఇచ్చారని, వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు.



'భూభారతి'లోని ప్రధానాంశాలు

భూభారతి చట్టంలోని ముఖ్యమైన అంశాలను మంత్రి సభకు వివరించారు. ఆ విశేషాలు..

* గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/గ్రామకంఠం స్థలాలు, భూములసమస్యలకు పరిష్కారం.
* భవిష్యత్తులో భూవివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం.
* పాస్‌బుక్ ఒకరి పేరుపై.. భూమి మరొకరి ఆధీనంలో ఉండడం వంటి పొరపాట్లు లేకుండా భద్రత కల్పించేలా నిబంధనలు.
* భూ క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే.. క్లియర్ టైటిల్ ఉంటే... మ్యుటేషన్ పూర్తవుతుంది. డాక్యుమెంట్‌లో ఏవైనా అనుమానాలు, పొరపాట్లు ఉంటే... 'అప్పిలేట్ అథారిటీ' పరిష్కరిస్తుంది.
* వారసత్వంగా, వంశపారంపర్య భూముల విషయంలో... ఆ భూమిపై ఎంత మందికి హక్కు ఉందో... వారికి ఒక కట్ ఆఫ్ డేట్ పెట్టి, పంపిణీ చేస్తారు. వెంటనే వారి పేర్లపై మ్యుటేషన్ చేస్తారు. ఏవైనా సమస్యలుంటే... కలెక్టర్, ఆర్డీవో పరిష్కరిస్తారు.
* సేల్ డీడ్, వారసత్వ రిజిస్ట్రేషన్లు కాకుండా.. కోర్టు ద్వారా వచ్చే ఓఆర్సీ, 38-ఈ తదితర 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ అధికారాలు ఆర్డీవోలకు.
* 2020 నవంబరు10 వరకూ ఆన్‌లైన్‌లో వచ్చిన 9.24 లక్షల సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరించాలని నిర్ణయించారు.
* పౌరులకు ఆధార్ నంబర్‌లాగానే..భూములకు భూధార్ నంబర్ కేటాయిస్తారు. భూసమస్యల పరిష్కారానికి అదే ఆధారం.
* 2020 చట్టానికి ముందు జమాబందీ సదస్సులు నిర్వహించి, భూసమస్యలను పరిష్కరించేవారు. సరైన వివరాలను రికార్డుల్లోకి ఎక్కించేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10,956 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలో గ్రామ రెవెన్యూసదస్సులు నిర్వహించాలని కొత్త చట్టంలో పొందుపర్చారు. త్వరలోనే ప్రతి రెవెన్యూగ్రామానికీ ఓ అధికారిని నియమిస్తారు.
* భూ వివాదాల విజ్ఞప్తులు, అప్పీళ్ల కోసం ల్యాండ్ ట్రైబ్యునల్స్ ఏర్పాటు. అవసరాన్ని, బట్టి వీటి సంఖ్యపై త్వరలో నిర్ణయం.
* ప్రభుత్వ ఆస్తులను, రికార్డులను ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే.. సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే అవకాశం.
* ప్రభుత్వ ఆస్తులను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని, శిక్షించే అధికారాన్ని ఈ చట్టంలో కల్పించారు.
* 2014కు ముందు పాస్‌బుక్‌లో ఉండే అనుభవదారుడి కాలమ్‌ను 2020 చట్టంలో తీసేశారు. అనుభవదారు కాలమ్‌ను కొత్త చట్టంలో పునరుద్ధరించారు. రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా, కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తారు.

ధరణి	భూభారతి-2024
అనుభవదారు కాలమ్ రద్దు.	అనుభవదారు కాలమ్‌కు చోటు.
పార్ట్-బీ(వివాదస్పద భూముల) జాబితాకు పరిష్కారంలేదు.	వివాదస్పద భూముల జాబితాలోని భూవివాదాలకు పరిష్కారం.
భూ వివాదాలు తలెత్తితే పరిష్కరించే అధికారాలు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌లకు లేవు.	తహసీల్దార్‌లు, ఆర్డీవో, కలెక్టర్‌లకు భూముల వివాదాలు పరిష్కరించే అధికారం.
ధరణిలో రిజిస్ట్రేషన్ జరిగితే అప్పీల్‌కు అవకాశం లేదు. సివిల్ కోర్టులకు వెళ్లాల్సిందే.	అప్పీల్ అవకాశం ఉంది. రెవెన్యూ యంత్రాంగం లేదా ట్రైబ్యునల్‌లో కేసును పరిష్కరించుకోవచ్చు.
ధరణి రికార్డు శాశ్వతం.	భూసర్వే అనంతరం సమగ్ర రికార్డును తయారు చేస్తారు. భూమికి, రికార్డుకు మధ్య లింకు కలుపుతారు.
భూముల రిజిస్ట్రేషన్, వెనువెంటనే మ్యుటేషన్.	భూముల రిజిస్ట్రేషన్, వెంటనే మ్యుటేషన్, ఆతర్వాత ఏమేరకు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారో సర్వేచేసి.. రైతు చేతికి మ్యాప్.
వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ జరిగితే అప్పీల్‌కు అవకాశం లేదు.	వారసత్వంగా దక్కిన భూములను విరాసత్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. వారసులందరికీ నోటీసులు జారీ చేసి, అభ్యంతరాల అనంతరమే రికార్డుల్లో వివరాల నమోదు(మ్యుటేషన్).
అసైన్డ్ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకం లేదు. 13బీ, 38ఈలకు పాస్‌పుస్తకాలు పొందే అవకాశాల్లేవు.	అసైన్డ్ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు. 13 బీ(ఆర్వోఆర్ పాత చట్టంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు జారీ చేసే ప్రొసీడింగ్స్), 38ఈ(కౌలు రక్షిత చట్టం ద్వారా దక్కిన భూమిని కౌలు దారుడికి పంచే వాటా భూమి)కి పట్టాదార్ పాస్‌పుస్తకం ఇస్తారు. ఆర్డీవోవిచారణ అనంతరం పాస్‌పుస్తకం లభించనుంది.
భూధార్ నెంబర్లు జారీ అవకాశం లేదు	ఆధార్ లాగే భూయజమానులకు భూధార్ ఇస్తారు.
ధరణి రికార్డుల్లో తప్పులుంటే సివిల్ కోర్టుకు వెళ్లడం ఒక్కటే పరిష్కారం.	భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, ప్రత్యేకంగా భూమి ట్రై బ్యునల్ ఏర్పాటు జరగనుంది. భూసమస్యలకు జిల్లాస్థాయిలోనే పరిష్కారం.
ఉచిత న్యాయ సహాయం లేదు	ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో అప్పీల్ చేసుకోలేని రైతులకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయసహాయం అందజేస్తుంది.
గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు	గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ. ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారిలాగా గ్రామ ప్రజాపాలన అధికారి నియామకం.
ధరణిలో ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేస్తే తహసీల్దార్‌కు రక్షణ.	ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేస్తే తహసీల్దార్‌పై కఠిన చర్యలు. అవసరమైతే ఉద్యోగం నుంచి తొలగింపు.
భూమితో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే రికార్డుల్లో మ్యుటేషన్.	భూమి సర్వే చేసి, సరిహద్దులు పక్కాగా కొలిచి.. మ్యాపుతో రిజిస్ట్రేషన్, ఆ వెనువెంటనే మ్యుటేషన్.
అప్పీల్ వ్యవస్థ లేదు.	అప్పీల్ వ్యవస్థ పునరుద్ధరణ. తహసీల్దార్ నిర్ణయాలపై ఆర్డీవోకు, ఆర్డీవో నిర్ణయాలపై కలెక్టర్‌కు, కలెక్టర్ నిర్ణయాలపై సీసీఎల్ఏకు, సీసీఎల్ఏ నిర్ణయంపై రెవెన్యూ మంత్రికి అప్పీల్ చేసే అవకాశం.
రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కోసమే ధరణి	భూరికార్డుల నిర్వహణ కోసం భూభారతి.
మ్యానువల్ రికార్డుల్లేవు	భూభారతి వెబ్‌సైట్‌తో పాటు మ్యానువల్ రికార్డులు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్, సీసీఎల్ఏ కార్యాలయంలో భద్రపరుస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..

ధరణిలో 33 మాడ్యూళ్లు(ఆప్షన్లు) ఉండేవి. ఇప్పుడు దాన్ని ఆరు మాడ్యూళ్లకు కుదిస్తున్నామని... మాన్యువల్ పహాణీలో ఉండే 32 కాలమ్‌లను గత ప్రభుత్వం ఒకే కాలమ్‌కు కుదించిందని.. ఇప్పుడు దాన్ని 11 కాలమ్‌లు చేస్తున్నామని పొంగులేటి వివరించారు.. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించిందని.. భూభారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతే ఎవరైనా భూభారతి ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. భూభారతి ద్వారా దరఖాస్తు చేసుకున్న భూయజమానుల మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ వెళ్లే సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. "2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను, ధరణిలోని డేటాతో పోల్చి చూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం. అలాగే.. గత ప్రభుత్వం ధరణి పేర తెచ్చిన చట్టానికి మూడేళ్ల దాటినా నియమాల(రూల్స్)ను రూపొందించలేదు. మేం 3నెలల్లోనే రూల్స్ ఫ్రేమ్ చేసి.. గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు పెట్టి అధికారులతో పాటు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని, భూసమస్యలను పరిష్కరిస్తాం" అని పొంగులేటి వివరించారు.

కాగా.. కొత్త బిల్లుపై అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదంటూ ప్రతిపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ దీనిపై 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తారు. సభ నియమాల ప్రకారం అధ్యయనానికి 12 గంటల సమయం ఇవ్వాలని, బిల్లును ప్రవేశపెట్టి, వెంటనే ఆమోదింపజేసుకునే పరిస్థితి మంచిది కాదని ఆయన అభ్యంతరం వెలిబుచ్చారు. కొత్త బిల్లులో సవరణలు సూచించడానికి, సలహాలు ఇవ్వడానికి వీలుగా... బిల్లు కాపీని రెండు రోజుల ముందే సభ్యులకు అందజేయాలని, అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అయితే.. గతంలో బీఆర్ఎస్ సర్కారు బిజినెస్ రూల్స్‌లోని 97, 98, 99 నిబంధనలను సస్పెండ్ చేసి, సభ్యులకు ఎలాంటి సమయం ఇవ్వకుండా బిల్లులను ఆమోదింపజేసుకున్నదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు. బిల్లు పరిశీలనకు స్పీకర్ సమయం ఇస్తే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. దాంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు సభ్యులకు సమయం ఇచ్చారు. ఏవైనా సూచనలుంటే ఆలోగా ఇవ్వాలన్నారు.

గురుకులాలపై మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ఘటనలపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తప్పుపట్టగా... వాటి వెనుక కుట్రకోణం ఉందన్న అనుమానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యక్తం చేశారు. గురుకులాలు, పాఠశాలలపై చర్చను ప్రారంభించిన మంత్రి సీతక్క.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ఒక గాడిన పెట్టడానికి ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోందంటూ చేపట్టిన వివిధ చర్యలను వివరించారు. పిల్లలకు పెట్టే ఆహారం విషయంలో తప్పు జరిగితే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు నాణ్యమైన ఆహార పదార్థాలు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. హాస్టళ్లలో వివిధ కారణాలతో విద్యార్థుల మరణాలు ఇప్పుడే సంభవించడం లేదని, అప్పట్లోనూ 62 మంది పిల్లలు చనిపోయారని, ఈ ఏడాది 26 మంది మరణించారని, ఈ మరణాలు బాధాకరమన్నారు. నాణ్యమైన ఆహారం అందించడానికి ఆహార భద్రతా కమిటీలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటు చేశామన్నారు. తమ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే ప్రతిపక్షం మద్దతు ఇవ్వకపోగా బట్టకాల్చి మీద వేస్తోందన్నారు. తెలంగాణలో 650 గురుకులాలకు సొంత భవనాలు లేవని, అద్దె భవనాల్లో ఉండడంతో సమస్యలు వస్తున్నాయని చెప్పారు. నవంబరు వరకు వరకు మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించామని, ఇకపై గ్రీన్ చానల్ ద్వారా చెల్లిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే డైట్, మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచామన్నారు. కోడిగుడ్డు ధరను రూ.5 నుంచి రూ.6కు పెంచాలని నిర్ణయించామన్నారు. సాధారణ పాఠశాలల్లో 10,006 పోస్టులు, గురుకులాల్లో 10,225 పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్ కుమారుడు ఒక పాఠశాల దగ్గరకు వెళ్లి ఆశ్చర్యపోయి 'ఇది పాఠశాలేనా' అని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. చర్చ సందర్భంగా గంగుల మాట్లాడుతూ గురుకులాల్లో కలుషితాహార ఘటనలపై ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. కలుషితాహారం తిని చనిపోయిన విద్యార్థిని శైలజ మరణంపై విచారణ జరపాలని కోరారు. ఈ ఏడాది ఇప్పటివరకు 54 మంది గురుకుల విద్యార్థులు విషపూరిత ఆహారం వల్ల మరణించారని ఆరోపించారు. ఒకరు చనిపోయారని ఒక హీరోను అరెస్టు చేసిన సర్కారు.. ఈ మరణాలకు ఎవర్ని అరెస్టు చేయాలని ప్రశ్నించారు.

ఇంకా యూనిఫాంలు ఇవ్వలేదు: హరీశ్

ఇంకా అనేక పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కోడిగుడ్ల బిల్లులు ఆరు నెలలుగా చెల్లించలేదన్నారు. ఈ ఏడాది హాస్టళ్లలో 54 మంది పిల్లలు చనిపోయారని, ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన కోరారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గురుకుల పాఠశాల్లో 1,425 మంది విద్యార్థులు కలుషితాహారంతో అస్వస్థతకు గురయ్యారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయంలో ప్రారంభించిన గురుకులాల్లో 66 శాతం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు.

గురుకులాల్లో భోజనం బాగుంది: రాకేశ్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గురుకులాల్లో భోజనం చాలా బాగుందని, తాను వెళ్లి తిన్నానని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కితాబిచ్చారు. 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపవుట్స్ కావడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్: అక్బరుద్దీన్

బీఆర్ఎస్ హయంలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక డైట్, కాస్మెటిక్స్ చార్జీలు పెంచడాన్ని ఆయన అభినందించారు. అయితే పెంచిన చార్జీలు కూడా సరిపోవన్నారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ పిరికిపందలా?

ఇదే అంశంపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై పొన్నం మండిపడ్డారు. తాను మాట్లాడడం మొదలుపెట్టిన ఒక నిమిషానికే అడ్డుపడుతున్నారని, మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి ఇటీవల ఇచ్చిన శిక్షణలో ఇంకేం చెప్పారని గంగుల వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది. దీంతో పొన్నం ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'మాట్లాడాలంటే శిక్షణ అవసరమా? నాకు సంస్కారం ఉంది. మొదటిసారి ఎన్నికై వస్తే మాట్లాడకూడదా? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ఉద్యమం చేశానని, రాష్ట్రం కోసం పార్లమెంటులో కొట్లాడనని, తన గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. గంగుల స్పందిస్తూ తెలంగాణ కోసం కొట్లాడిన వ్యక్తి కరీంనగర్ నుంచి ఎందుకు పారిపోయారని అన్నారు. తాను హుస్నాబాద్‌కు పారిపోలేదని, రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే నియోజకవర్గం మారాల్సి వచ్చిందన్న పొన్నం.. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి పోటీ చేయాలంటూ గంగులకు సవాల్ విసిరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సొంత నియోజకవర్గాలు ఎక్కడ? వారు ఎక్కడి నుంచి పోటీ చేశారు? వాళ్లు పిరికిపందలు కాబట్టే నియోజకవర్గాలు మారారా? లేదంటే వాళ్లని అనలేక నన్ను అంటున్నారా? అని గంగులను నిలదీశారు. రాష్ట్రం కోసం పార్లమెంటులో కొట్లాడిన పొన్నం లాంటి నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని మరో మంత్రి శ్రీధర్‌బాబు హితవు పలికారు.

మామ చాటు అల్లుడిగా.. 10 వేల కోట్లు దోచుకున్నావ్!

» కాళేశ్వరం.. కమీషన్లు.. హరీశ్‌రావు

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శ

» అసెంబ్లీకి మద్యం తాగి వస్తున్నారు.. బ్రీత్ అనలైజర్లు పెట్టాలి: హరీశ్‌రావు

» సభకు డుమ్మా కొట్టి తాగి ఫామ్‌హౌస్‌లో పన్నడు

» కాంగ్రెస్ ప్రత్యారోపణ,అసెంబ్లీలో రచ్చ



హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మామ చాటు అల్లుడిగా 10 వేల కోట్లు దోచుకున్నావ్ అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాళేశ్వరం.. కమీషన్లు.. హరీశ్‌రావు.. అని ఎద్దేవా చేశారు. బుధవారం శాసనసభ ప్రారంభమైన వెంటనే సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానమిచ్చారు. కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి రహదారిని జాతీయ రహదారిగా మార్చే అంశంపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ.. 'రోడ్డుపై గుంతలు చూపిస్తే ఒక్కో గుంతకు ఒక వెయ్యి రూపాయలు బహుమతిగా ఇస్తామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కానీ, రోడ్లన్నీ గుంతలమయంగానే ఉన్నాయి. గత ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఇతర ప్రాజెక్టులను, రహదారులను పూర్తిగా విస్మరించింది' అని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు నాలుగు లైన్ల రహదారి వేసుకున్నారన్నారు. రూ.లక్ష కోట్లు విలువచేసే ఔటర్ రింగ్ రోడ్డును గత ప్రభుత్వం రూ.7 వేల కోట్లకు అమ్ముకుందని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు మంగళవారం చేతులకు బేడీలతో సభకు హాజరు కావటాన్ని ప్రస్తావిస్తూ.. రేపో మాపో నిజంగానే పోలీసులు వచ్చి మిమ్మల్ని బేడీలు వేసి తీసుకెళ్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంత్రి వ్యాఖ్యలపై హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలోకి కొందరు ఉదయాన్నే తాగి వచ్చినట్టుంది.. అసెంబ్లీలోనూ బ్రీత్ అనలైజర్ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రతిపక్ష నాయకుడి హోదా కట్టబెడితే.. అసెంబ్లీకి రాకుండా డుమ్మా కొట్టి తాగి ఫామ్ హౌస్‌లో పడుకుంటున్నాడు.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపుతూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మద్యంపై హరీశ్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు సభాపతి ప్రకటించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ ధరణి బాధితులే: పొంగులేటి

ధరణి స్థానంలో భూభారతి బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణితో వేలాదిమంది అవస్థలు పడ్డారన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో 1398 ఎకరాల గిరిజనుల భూమిని ధరణిలో అటవీ భూమిగా పేర్కొన్నారని ఉదహరించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎంపీటీసీ తన దృష్టికి తెచ్చారని, ఇలాంటి ఉదాహరణలు రాష్ట్రంలో కోకొల్లలుగా ఉన్నాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కేసీఆర్ ఎవరినీ సంప్రదించకుండా గడిలో కూర్చుని ఏకపక్షంగా ధరణిని రాత్రికిరాత్రి అమలు చేశారని విమర్శించారు.

మహిళలకు ఉచిత ప్రయాణం.. ప్రతిపక్షాల ఓర్వలేనితనం: సీతక్క

మంగళవారం నల్ల షర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. బుధవారం ఆటోడ్రైవర్ల యూనిఫాంలో వచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించటం వల్ల ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను సభ దృష్టికి తెచ్చేందుకే ఇలా వచ్చామని వారు తెలిపారు. సభ సజావుగా జరగకుండా, కేవలం ఆందోళనలు చేయాలన్న లక్ష్యంతోనే సభకు వస్తున్నారంటూ శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దొంగల్లా రోజుకో వేషం మారుస్తున్నారని విమర్శించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లపై ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఓలా, ఊబర్‌లను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు.

ఎందుకు వచ్చామనిపిస్తోంది?: ఎమ్మెల్యే మదన్‌మోహన్

కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ.. ప్రతిపక్షాల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. '21 ఏళ్లుగా అసెంబ్లీలో ఉన్నానని హరీశ్ చెబుతుంటారు. ఇంత సీనియార్టీ ఉన్నా సభా మర్యాదలు పాటించడం లేదు. నిన్న సభలో ప్రవేశపెట్టిన పర్యాటక విధానంపై మాట్లాడాలని 3 రోజులుగా సిద్ధమయ్యా. కానీ మాట్లాడే అవకాశమే దక్కలేదు. సభను విపక్ష సభ్యులుమాటిమాటికి అడ్డుకుంటున్నారు. బయట ప్రజల్లోకి వెళ్తే సిగ్గుపోతోంది' అని పేర్కొన్నారు.




ముంబై సముద్రతీరంలో పడవ ప్రమాదం

- 13 మంది మృతి, ప్రాణాలతో బయటపడిన 101 మంది
- ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొన్న నేవీ బోటు

ముంబై, డిసెంబరు 18: ముంబై సముద్రతీరంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. 'గేట్‌వే ఆఫ్ ఇండియా' నుంచి ప్రసిద్ధి చెందిన ఎలిఫెంటా దీవులకు ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ అనే పడవను నేవీకి చెందిన బోటు ఢీకొట్టిన ఘటనలో 13 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటనలో 101 మందిని కాపాడినట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ప్రయాణికులతో నీల్‌కమల్ ఫెర్రీ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన నేవీ స్పీడ్ బోటు ఢీకొట్టింది. దీంతో ఆ ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. నేవీ బోటుకు ఇటీవలే కొత్త ఇంజన్‌ను బిగించారు. దాన్ని పరీక్షిస్తున్న సమయంలో అది నియంత్రణ కోల్పోయి నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొట్టింది. నేవీ బోటులో ఆరుగురున్నారని, వీరిలో ఇద్దరు నేవీ సిబ్బంది, నలుగురు ఇంజన్ సరఫరా చేసిన కంపెనీకి చెందిన వారున్నారని తెలుస్తోంది.

సరిహద్దులో చొచ్చుకొస్తున్న చైనా

- డోక్లాం సమీపంలో వేగంగా గ్రామాల నిర్మాణం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: భారత సరిహద్దుల్లో చైనా ఘర్షణ పెంచే చర్యలకు పాల్పడుతోంది. డోక్లాం సమీపంలో జోరుగా ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తూ కవ్విస్తోంది. గత ఎనిమిదేళ్ల నుంచి చూస్తే ఇప్పటి వరకు ఆ వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతానికి సమీపంలో 22 గ్రామాలు, జనావాసాలను ఏర్పాటు చేసింది. 2020 నుంచి ఇప్పటి వరకు అక్కడ 8 గ్రామాలు నిర్మించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఈ గ్రామాలను డోక్లాం సమీపంలో భూటాన్ భూభాగంలోని పశ్చిమ ప్రాంతంలో కడుతున్న చైనా.. ఆ భూమి తమదేనంటూ చెప్పుకుంటోంది. ఈ గ్రామాలు భూటాన్ పశ్చిమ భాగంలోనే ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, 2017లో డోక్లాం సరిహద్దులో చైనా రోడ్డు నిర్మిస్తున్న సమయంలో భారత్ అడ్డుకుంది. అప్పుడు ఇరు పక్షాల మధ్య ఘర్షణ నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ వ్యూహాత్మక పీఠభూమిలో భారత్ సరిహద్దువైపు చొచ్చుకురావడానికి చైనా ప్రయత్నిస్తోంది. దానిలో భాగంగా భూటాన్ భూగాన్ని ఆక్రమించి గ్రామాలు నిర్మిస్తూ తన ప్రజలను అక్కడకి తరలిస్తోంది.

శాంతి చర్యలకు భారత్, చైనా ఓకే

బీజింగ్, డిసెంబరు 18: సరిహద్దుల్లో శాంతిని కొనసాగించడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాల్లో ఆరోగ్యకరమైన, సుస్థిర వృద్ధిని ప్రోత్సహించడానికి భారత్, చైనాలు అంగీకారానికి వచ్చాయి. ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో భాగంగా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో బుధవారంనాడిక్కడ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆరు అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. సమావేశం సందర్భంగా సరిహద్దు సమస్యలపై ఇరు దేశాల మధ్య కుదిరిన పరిష్కారాన్ని ఇరు పక్షాలు సానుకూలంగా మదింపు చేసి అమలు పనులు కొనసాగించాలని పునరుద్ఘాటించినట్టు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. భారత ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తున్న డోభాల్.. 23వ దఫా ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇక్కడకు చేరుకున్నారు. కాగా, ఈ చర్చలతో కైలాస మానసరోవర యాత్రను త్వరలో పునరుద్ధరించే అవకాశం ఉంది.

హైకోర్టు విశ్రాంత జడ్జిలకు పెన్షన్ రూ.15 వేలేనా..?: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 18: హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు మాత్రమే నెలవారీ పెన్షన్ అందుతుండటంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దయనీయమని విచారం వ్యక్తం చేసింది. ఇలాంటి విషయాల్లో చట్టపర విధానాలకు బదులుగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అధికార వర్గాలకు సూచించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు వేర్వేరు పెన్షన్లు చెల్లించాలనే అంశాన్ని లేవనెత్తుతూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. 13 ఏళ్లు జిల్లా కోర్టు జ్యుడీషియల్ అధికారిగా సేవలందించానని.. అనంతరం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి రిటైరైన తనకు రూ.15 వేలే పెన్షన్ అందుతోందని ఓ పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టు ఈ విషయాన్ని అటార్నీ జనరల్ వెంకటరమణి ముందు ప్రస్తావించగా.. ఆయన ఈ కేసును జనవరికి వాయిదా వేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు.

జేఎన్‌యూ మాజీ నేత ఉమర్ ఖలీద్‌కు ఊరట

న్యూఢిల్లీ, డిసెంబరు 18: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌కు ఎట్టకేలకు ఢిల్లీ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. 2020లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన అల్లర్ల కేసులో భాగంగా ప్రస్తుతం ఉమర్ ఖలీద్ జైల్లో ఉన్నాడు. అయితే బంధువు వివాహానికి హాజరయ్యేందుకు 10 రోజుల బెయిల్ కావాలని అతడు కోరగా.. కోర్టు వారం (ఈనెల 28 నుంచి జనవరి 3 వరకు) రోజులకు మంజూరు చేసింది. అలాగే సామాజిక మాధ్యమాలను వాడకూడదని.. పెళ్లి వేడుకలకు తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదంటూ ఈ సందర్భంగా పలు షరతులను పెట్టింది. ఉపా కేసు కింద అరెస్టయిన ఖలీద్.. గత నాలుగేళ్లుగా జైల్లోనే ఉన్నాడు. అప్పట్నుంచి బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయిస్తూనే ఉన్నాడు.

రోహిణి సింధూరిపై ఐపీఎస్ రూప పరువునష్టం

బెంగళూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరిపై ఐపీఎస్ అధికారి రూపా మౌద్గిల్ పరువునష్టం దావా వేశారు. వీరిద్దరి మధ్య వివాదం దాదాపు 22 నెలలుగా కొనసాగుతోంది. రోహిణి సింధూరి గతంలో రూపా మౌద్గిల్‌పై పరువునష్టం దావా వేశారు. దాన్ని రద్దు చేయాలని కోరుతూ రూపా మౌద్గిల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇద్దరు అధికారులు బాధ్యతాయుతమైన హోదాలలో ఉన్నారని, ఇలా వ్యవహరించడం సరికాదని సుప్రీం కోర్టు హితవు పలికింది. ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదం కొనసాగితే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుందని, రాజీ చేసుకోవాలని కూడా సూచించింది. అయితే రూపా మౌద్గిల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే కోర్టులోనే కేసును పరిష్కరించుకుంటానని రోహిణి సింధూరి పట్టుబట్టారు. దీంతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వివాదాన్ని స్థానిక కోర్టులోనే పరిష్కరించుకోవాలని తిప్పి పంపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బెంగళూరు హోం సెక్రటరీ ఐజీపీగా ఉన్న రూపా మౌద్గిల్, బెంగళూరు 7వ ఏసీఎంఎం కోర్టులో రోహిణి సింధూరిపై పరువునష్టం దావా వేశారు..

నెల్లూరు జిల్లాలో 'జీకా' కలకలం

మర్రిపాడు/నెల్లూరు(వైద్యం),ఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అమెరికా, ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న జీకా వైరస్ ఏపీలోని నెల్లూరు జిల్లాలోని ఓ బాలుడికి సోకినట్టు తెలియడంతో వైద్య ఆరోగ్య శాఖ ఉలిక్కిపడింది. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నాగరాజు, కల్యాణిల ఆరేళ్ల కుమారుడు సుబ్బారాయుడు 20 రోజుల క్రితం జ్వరం బారినపడటంతో నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాలుడ్ని పరీక్షించిన వైద్యులు జీకా వైరస్ అనే అనుమానంతో కొన్ని నమూనాలు తీసి ముంబయి ల్యాబ్‌కు పంపారు. అక్కడ జీకా వైరస్‌గా నిర్ధారణ అయింది. దీంతో మంగళవారం సుబ్బారాయుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నై ఎగ్మోర్‌కు తరలించారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆ బాలుడి నమూనాలను పూణే వైరల్ ల్యాబ్‌కు పంపించారు.

అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు!

కాంగ్రెస్ బండారాన్ని అమిత్‌షా బయటపెట్టారు.. దాంతోనే కొత్త నాటకాలు.. ప్రధాని మోదీ ఆగ్రహం

- హోం మంత్రి వ్యాఖ్యలకు సమర్థన
- అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఎన్నటికీ మాట్లాడను: అమిత్‌షా

న్యూఢిల్లీ, డిసెంబరు 18: ప్రతి దానికీ అంబేడ్కర్ పేరు ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఫ్యాషన్‌గా మారిందని.. ఆయన పేరు కాకుండా దేవుడిని స్మరించుకుంటే ఏడు జన్మలు స్వర్గం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ గట్టిగా సమర్థించారు. అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు ఆ పార్టీ పన్నని కుట్ర లేదని విమర్శించారు. బాబాసాహెబ్‌ను అవమానించిన ఆ పార్టీ చరిత్రను, వాస్తవాల చిట్టాను షా రాజ్యసభలో బయటపెట్టారని.. అది చూసి కాంగ్రెస్ నేతలు బిత్తరపోయారని అన్నారు. అందుకే అంబేడ్కర్‌ను ఆయన అవమానించారని, కేబినెట్ నుంచి బహిష్కరించాలంటూ కొత్త నాటకాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. 'వారి దురదృష్టం ఏమిటంటే.. ప్రజలకు నిజం తెలుసు' అని ప్రధాని బుధవారం 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. అటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్, కిరెన్ రిజిజు కూడా షాకు అండగా నిలిచారు. తాను అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఒక్కనాటికీ మాట్లాడనని షా తేల్చిచెప్పారు. 'అంబేడ్కర్‌ను అవమానించిన, ఎస్సీ, ఎస్టీలను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ చీకటి చరిత్రను అమిత్‌షా పార్లమెంటులో బట్టబయలు చేశారు. ఏళ్ల తరబడి అధికారం అనుభవించి.. ఎస్సీ, ఎస్టీల సాధికారతకు చేసింది శూన్యం' అని ప్రధాని విరుచుకుపడ్డారు. అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ చేసిన 'పాపాల' జాబితాను ఆయన విడుదల చేశారు. 'ఎన్నికల్లో ఒకసారి కాదు.. రెండు సార్లు ఆయన్ను ఓడించారు. ఎలాగైనా ఆయన్ను ఓడించాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నెహ్రూయే స్వయంగా వ్యతిరేక ప్రచారం చేశారు. ఆయనకు భారతరత్నను తిరస్కరించారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆయన చిత్రపటాన్ని కూడా పెట్టలేదు. ఓ కుటుంబం సారథ్యంలోని ఒకానొక పార్టీ.. డాక్టర్ అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు పన్నిన పన్నాగాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు' అని తెలిపారు.



పార్లమెంటు ఆవరణలో ఇండియా కూటమి నిరసన

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం చేసిన పనులను ప్రధాని ప్రస్తావించారు. బాబాసాహెబ్‌తో సంబంధం ఉన్న ఐదు చారిత్రక స్థలాలను.. 'పంచతీర్థ' పేరిట అభివృద్ధి చేశామన్నారు. 'చైత్యభూమి వ్యవహారంలో దశాబ్దాల తరబడి స్థలం సమస్య పెండింగ్‌లో ఉంటే.. మేం దానిని పరిష్కరించాం. అక్కడకు నేనే వెళ్లి ప్రార్థన చేసి వచ్చాను. ఢిల్లీలో అంబేడ్కర్ చివరి సంవత్సరాల్లో గడపిన ఇంటిని అభివృద్ధి చేశాం. లండన్‌లో ఆయన నివసించిన ఇంటిని కూడా భారత ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇవాళ మేమీ స్థాయిలో ఉన్నామంటే అంబేడ్కర్ వల్లనే' అని ప్రధాని స్పష్టం చేశారు.

నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది: షా

అంబేడ్కర్‌పై తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరిస్తోందని అమిత్‌షా విరుచుకుపడ్డారు. బాబాసాహెబ్‌కు వ్యతిరేకంగా తాను ఎన్నటికీ మాట్లాడనని తేల్చిచెప్పారు. బుధవారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీ. రాజ్యాంగ విలువలను మసకబార్చిన చరిత్ర కాంగ్రెస్‌ది' అని దుయ్యబట్టారు. తన రాజీనామాకు ఖర్గే డిమాండ్ చేయడాన్ని ప్రస్తావించగా.. 'అది ఆయన్ను సంతృప్తిపరిచేటట్లయితే పదవి నుంచి వైదొలుగుతా. కానీ దానివల్ల ఆయన సమస్యలు తీరవు. మరో 15 ఏళ్లు ఆయన ప్రతిపక్షంలోనే ఉండాల్సి ఉంటుంది' అని షా తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించడాన్ని దేశం సహించదు

- అమిత్‌షా క్షమాపణ చెప్పాలి: రాహుల్
- క్యాబినెట్ నుంచి తొలగించాలి: ఖర్గే
- పార్లమెంటు ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, డిసెంబరు 18: బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడాన్ని దేశం సహించదని లోక్‌సభలో ప్రధానప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహ ఇండియా కూటమి ఎంపీలు బుధవారం పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ ఫొటోలను రాహుల్ ఫేస్‌బుక్‌లో, ప్రియాంక 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంబేడ్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని ఆ పోస్టు కింద రాహుల్ హిందీలో రాశారు. అలాగే, పార్లమెంటు ఆవరణలో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ సేవలను తుడిచిపెట్టేసేందుకు వారంతా(బీజేపీ) పనిచేస్తున్నారు. ఇది దేశం మొత్తానికీ తెలుసు' అన్నారు. కాగా, అంబేడ్కర్ పేరు చెబితే ఎవరికైనా హక్కులు లభిస్తాయని ప్రియాంక హిందీలో పోస్టు చేశారు. 'మానవుల గౌరవానికి అంబేడ్కర్ ప్రతీక. కోట్లాదిమంది దళితులు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక' అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రధాని మోదీకి అంబేడ్కర్‌పై ఏ మాత్రం గౌరవమున్నా.. తక్షణమే కేంద్ర కేబినెట్ నుంచి అమిత్‌షాను తొలగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఖండించదగినవి. దళిత నాయకుడిని ఆయన అవమానించారు. వారికి ఆయన పూజ్యనీయులు. అమిత్‌షా వ్యాఖ్యలను మోదీ తప్పుబట్టకుండా సమర్థిస్తున్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎంపీ లేదా మంత్రి దానిని అవమానిస్తే, తక్షణమే కేబినెట్ నుంచి తొలగించాలి. లేకుంటే ప్రజలు నిరసన తెలుపుతారు. నినాదాలు చేస్తారు. బాబాసాహెబ్ కోసం తమ ప్రాణాలను అర్పించడానికీ ప్రజలు సిద్ధం' అన్నారు. మరోవైపు రాజ్యసభలో అమిత్‌షా చేసిన ప్రసంగం వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ప్రధాని మోదీని కలిసిన పవార్



న్యూఢిల్లీ, డిసెంబరు 18 : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ-ఎస్పీ) అధినేత శరద్ పవార్ ప్రధాని నరేంద్ర మోదీని బుధవారం కలిశారు. పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో వీరి భేటీ జరిగింది. మహారాష్ట్రకు చెందిన పలువురు దానిమ్మ రైతులతో కలిసి పవార్ ప్రధానిని కలిశారు. సదరు రైతులు తమ తోటలో పండించిన దానిమ్మకాయలను ప్రధానికి ఇచ్చారు. అనంతరం పవార్ కాసేపు ప్రధానితో మాట్లాడారు. కాగా, తమ మధ్య రాజకీయాల ప్రస్తావన రాలేదని, దానిమ్మ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మోదీ దృష్టికి తీసుకెళ్లానని ప్రధానితో భేటీ అనంతరం పవార్ పేర్కొన్నారు. అలాగే, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా పవార్ బుధవారం కలిశారు. కాగా, కాంగ్రెస్, ఎన్సీపీ-ఎస్పీ, శివసేన (యూబీటీ)తో కూడిన మహావికాస్ అఘాడీ కూటమి నవంబరులో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన- ఎన్సీపీతో కూడిన మహాయుతి చేతిలో ఘోర ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే.

జమిలి ఎన్నికల బిల్లు జేపీసీలో ప్రియాంక!



న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లుపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఉభయసభలకు చెందిన 31 మంది సభ్యులు ఉంటారు. లోక్ సభకు చెందిన 21 మంది సభ్యుల పేర్లను బుధవారం న్యాయశాఖమంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రకటించారు. వీరిలో ఏపీకి చెందిన బీజేపీ సభ్యుడు సీఎం రమేశ్, టీడీపీ సభ్యుడు జీఎం హరీశ్ బాలయోగి, జనసేన సభ్యుడు వల్లభనేని బాలశౌరి ఉన్నారు. ఇతర సభ్యుల్లో పీపీ చౌదరి, బాన్సురీస్వరాజ్, పురుషోత్తం రూపాలా, విష్ణుదయాల్ రామ్, భర్తృహరి మెహతాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదయాళ్ శర్మ, ప్రియాంకాగాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖ్ దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వగణపతి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిండే, చందన్ చౌహాన్ ఉన్నారు. ఇక మిగతా 10 మంది రాజ్యసభ నుంచి ఉంటారని, వారి పేర్లను గురువారం ప్రకటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జమిలి బిల్లుల సమయంలో.. గడ్కరీ, సింధియా డుమ్మా

న్యూఢిల్లీ, డిసెంబరు 18: మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా లోక్‌సభలో మంగళవారం 'ఒక దేశం-ఒకే ఎన్నిక' సంబంధ బిల్లులు ప్రవేశపెట్టింది. ఆ సందర్భంగా సభకు తప్పకుండా హాజరు కావాలని తన ఎంపీలకు విప్ కూడా జారీచేసింది. అయినా కూడా కేంద్ర మంత్రి గడ్కరీ సభకు రాకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆయన, మరో ముగ్గురు కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, గిరిరాజ్ సింగ్, సీఆర్ పాటిల్ సహా మొత్తం 20 మంది ఎంపీలు సభకు రాలేదు. వారందరికీ నోటీసులు జారీ చేయాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. తమ గైర్హాజరుపై వారు పార్టీకి ముందస్తు సమాచారం ఇచ్చారో లేదో తెలియరాలేదు.

వారి నుంచి 17,750 కోట్లు తిరిగి రాబట్టాం: నిర్మల

న్యూఢిల్లీ, డిసెంబరు 18: బ్యాంకుల వద్ద అప్పు తీసుకుని తిరిగి కట్టకుండా దేశం వదిలి పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ నుంచి ఈడీ రూ. 17,750 కోట్లు తిరిగి వసూలు చేసి బ్యాంకులకు చెల్లించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఓ ప్రశ్నకు నిర్మలా సీతారామన్ బదులిస్తూ, విజయ్ మాల్యా నుంచి రూ. 14,131 కోట్లు, నీరవ్ మోదీ నుంచి రూ.1,052.58 కోట్లు, మెహుల్ చోక్సీ నుంచి రూ.2,565.90 కోట్లు తిరిగి వసూలు చేసి బ్యాంకులకు చెల్లించామని తెలియజేశారు. బ్యాంకులను ముంచిన ఆర్థిక నేరస్థుల నుంచి మొత్తంగా రూ.22,280 కోట్లు తిరిగి వసూలు చేశామని ఆమె వెల్లడించారు.

అధిక పెన్షన్ పథకం.. వివరాల సమర్పణ గడువు పెంపు

జనవరి 31 వరకు అవకాశం: ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, డిసెంబరు 18: అధిక పింఛన్‌కు సంబంధించిన వివరాలను సమర్పించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) గడువు పెంచింది. వచ్చేనెల (జనవరి) 31 వరకు ఉద్యోగుల వేతన వివరాలను అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొంది. 2023 ఫిబ్రవరి 26న ఈ పథకం ప్రారంభమవ్వగా.. గడువు(2023 జూలై 11) లోగా మొత్తం 17.49 లక్షల మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఉద్యోగుల వేతన వివరాలను అప్‌లోడ్ చేసే విషయంలో యాజమాన్యాల నుంచి ఆలస్యం జరుగుతోంది. దీంతో.. ఇంకా 3.1 లక్షల దరఖాస్తుదారులకు సంబంధించిన వివరాలు ఈపీఎఫ్‌వోకు అందలేదు. నిజానికి ఈ ఏడాది మే 31 కల్లా ఈ వివరాలను అందజేయాల్సి ఉండగా.. ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వచ్చే నెల 31 వరకు గడువును పొడిగించారు.

మహా కుంభమేళాకు ఉచిత రైలు ప్రచారం అవాస్తవం: రైల్వే శాఖ

న్యూఢిల్లీ, డిసెంబరు 18: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 14 నుంచి జరగనున్న మహాకుంభమేళాకు రైల్వే శాఖ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుందని జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తవమని రైల్వే శాఖ స్పష్టం చేసింది. అవన్నీ తప్పుడు ప్రచారాలని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. టికెట్ లేకుండా రైలు ప్రయాణాలు చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. అయితే మహా కుంభమేళా నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపింది.

హెచ్-1బీ రూల్స్ సరళతరం

ఎఫ్-1ను హెచ్-1బీగా మార్చుకునే చాన్స్.. బైడెన్ నిర్ణయం.. జనవరి 17 నుంచి అమలు

లక్షల మంది భారత ఐటీ నిపుణులకు లబ్ధి

వాషింగ్టన్, డిసెంబరు 18: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగం చేయాలని కలలు కనే భారతీయులకు ఇదో తీపికబురు! అమెరికాలోని కంపెనీలు విదేశీ నిపుణులను సులభంగా నియమించుకునే అవకాశం కల్పిస్తూ జో బైడెన్ ప్రభుత్వం వీసా నిబంధనలను సరళతరం చేసింది. ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను హెచ్-1బీ వీసాలుగా సులభంగా మార్చుకునే అవకాశం కల్పించింది. ఫలితంగా లక్షల మంది భారత ఐటీ నిపుణుల అమెరికా కల సాకారం కానుంది.



ప్రస్తుతం ఉన్న హెచ్-1బీ వీసాలు నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు. వీటి ద్వారా అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను ప్రత్యేకమైన పనులకు నియమించుకుంటున్నాయి. ఏటా ఇలా భారత్, చైనా సహా విదేశాల నుంచి వేల మందిని ఐటీ కంపెనీలు తీసుకుంటున్నాయి. ఇప్పుడు చేసిన వీసా నిబంధనల సరళీకరణతో మరింత మందికి అవకాశం కల్పించే చాన్స్ ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) ప్రకటించింది. తాజా సరళీకరణ ప్రకారం లాభాపేక్ష లేని సంస్థలు, ప్రభుత్వ పరిశోధన సంస్థల నిర్వచనం, నిబంధనల్లో మార్పు చేశారు. ఆయా సంస్థలు ఇక నుంచి వార్షిక హెచ్-1బీ వీసాల చట్టపరమైన పరిమితి నుంచి మినహాయింపు పొందనున్నాయి. ప్రస్తుతం చట్టబద్ధంగా ఏడాదికి 65 వేల హెచ్-1బీ వీసాలను అనుమతిస్తున్నారు. అడ్వాన్స్ డిగ్రీలు ఉన్న మరో 20 వేల మందికి ఇస్తున్నారు. అయితే, ఇక నుంచి పలు సంస్థలను ఈ పరిమితి నుంచి మినహాయించనున్నారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విద్యార్థులకు కూడా ఈ నిబంధన వర్తించనుంది. ఇక, గతంలోనే హెచ్-1బీ వీసాలు కలిగి ఉన్న వారి పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించనున్నారు. ఈ నిబంధనలు జనవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు హెచ్-1బీ వీసాలను లాటరీ విధానంలో ఏటా ఒకసారి(ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో) ఇస్తున్నారు. దీంతో ఎంతో మంది ఆశావహులు ఈ లాటరీ తగలక నీరుగారుతున్నారు. ఇప్పుడు నిబంధనల సరళీ కరణతో ఎక్కువ మంది అవకాశం లభించనుంది.

కెనడాలో జాబ్ ఆఫర్.. ఇమ్మిగ్రేషన్ పాయింట్ల ఎత్తివేత!

న్యూఢిల్లీ, డిసెంబరు 18: కెనడాలో శాశ్వత నివాసం పొందేందుకు జాబ్ ఆఫర్ల పేరిట మోసాలు జరుగుతున్నట్లు ఆ దేశ ప్రభుత్వం భావిస్తోంది. దీనిని కట్టడి చేసేందుకు నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం జాబ్ ఆఫర్‌తో ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ పొందే పాయింట్లను ఎత్తేసే ఆలోచన చేస్తున్నట్లు కెనడా ఇమ్మిగ్రేషన్ శాఖ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు. సాధారణంగా దేశంలోని వివిధ సంస్థలు నిపుణులైన ఉద్యోగులను నియమించుకోవాలనుకున్నప్పుడు.. అందుకు అర్హత కలిగినవారు ఆ దేశ పౌరుల్లో, అప్పటికే శాశ్వత నివాసం ఉన్నవారిలో లేకపోతే విదేశీ వ్యక్తులను నియమించుకుంటాయి. ఇందుకోసం లేబర్ మార్కెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎల్ఎంఐఏ) కింద దరఖాస్తు చేసుకుంటాయి. ఈ విధంగా ఇచ్చే జాబ్ ఆఫర్ ద్వారా ఆయా వ్యక్తులకు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ పేరుతో 50 పాయింట్లు అదనంగా లభిస్తాయి. దీంతో.. ఆ వ్యక్తులు కెనడాలో శాశ్వత నివాసం లేదా తాత్కాలిక నివాసం కోరుకుంటే ఈ పాయింట్ల ద్వారా వారికి అదనపు ప్రయోజనం చేకూరుతుంది. అయితే ఈ పేరుతో పలు సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయని, విదేశీ వ్యక్తులు వీటిని కొనుగోలు చేసి.. శాశ్వత నివాసాలు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నాయని జస్టిన్ ట్రూడో ప్రభుత్వం భావిస్తోంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

సముద్ర రాయబారిగా ఐఎన్ఎస్ నిర్దేశక్

- రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్

విశాఖపట్నం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన సర్వే నౌక ఐఎన్ఎస్ నిర్దేశక్ విదేశాలతో సంబంధాలు పెంచుకోవడానికి సముద్ర రాయబారిగా ఉపయోగపడుతుందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. కోల్‌కతా గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ తయారు చేసిన ఈ నౌకను విశాఖపట్నం నావల్ డాక్‌యార్డులో బుధవారం ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, 'సముద్రాలను సర్వే చేసి కొత్త విషయాలను వెలుగులోకి తేవడానికి ఉపయోగపడే ఈ నౌక ఒక్క భారతదేశానికే కాకుండా ఇతర దేశాలకు కూడా సేవలు అందిస్తుంది. ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా అందించే ఈ సేవల వల్ల ఆయా దేశాలతో వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు బలపడతాయి. 80% స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ నౌకలో అడ్వాన్స్‌డ్ హైడ్రోగ్రఫీకి చెందిన మల్టీ బీమ్ ఎకో సౌండర్లు, సైడ్ స్కాన్ సోనార్లు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్(ఏయూవీ), రిమోట్ ఆపరేటెడ్ వెహికల్(ఆర్ఓవీ) వంటివి ఉన్నాయి. సముద్రాలలో మ్యాపింగ్, నేవిగేషన్, డీప్ సీ ఆపరేషన్లలో కచ్చితమైన ప్లానింగ్‌కు ఇది బాగా ఉపయోగపడుతుంది.



ప్రమాదకరమైన ప్రాంతాల్లోనే కాకుండా, నిషేధించిన జోన్లలోను ఇది సర్వే చేసి కచ్చితమైన డేటాను అందిస్తుంది. సముద్ర అంతర్భాగంలో ఉండిపోయిన శిథిలాలను గుర్తించడంతో పాటు పర్యావరణ అధ్యయనాలు కూడా చేస్తుంది. ఇది సముద్రంలో ఓ ఆస్పత్రిగా కూడా సేవలు అందిస్తుంది. ఈ నౌక నిర్మాణంలో నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో, జీఆర్ఎస్ఈ, ఎల్ అండ్ టీ, సెయిల్, ఐఆర్ఎస్‌తో పాటు పలు ఎంఎస్ఎంఈలు పాల్గొన్నాయి' అని వివరించారు. ఈ కార్యక్రమానికి తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ అధ్యక్షత వహించగా, నౌక కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ అజయ్ చౌహాన్ పాల్గొన్నారు.

దరఖాస్తులు ఇంతింతై.. హాజరు అంతంతే!

- గ్రూప్ పోస్టుల పరీక్షలకు తగ్గుతూ వచ్చిన అభ్యర్థుల హాజరు

హైదరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రూపు పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య రానురాను తగ్గిపోయింది. మొదట్లో నిర్వహించిన పరీక్షలకు అభ్యర్థుల హాజరు శాతంతో పోలిస్తే... చివర్లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన వారి శాతం గణనీయంగా పడిపోయింది. నిరుడు అంటే... 2023 జూలై 1వ తేదీన నిర్వహించిన గ్రూపు-4 పరీక్షలకు ఏకంగా 80 శాతం మంది అభ్యర్థులు హాజరు కాగా, తాజాగా డిసెంబరు 15, 16వ తేదీల్లో నిర్వహించిన గ్రూపు-2 పరీక్షలకు 45.57 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరు కావడం గమనార్హం. 8,180 గ్రూపు-4 పోస్టుల భర్తీలో భాగంగా 2023 జూలై 1న నిర్వహించిన పరీక్షకు 9.51 లక్షల అభ్యర్థులకు గాను 7.61 లక్షల మంది (80శాతం) హాజరయ్యారు. 2024 జూన్ 9వ తేదీన జరిగిన గ్రూపు-1 ప్రిలిమనరీ పరీక్షలకు 4.03 లక్షల మంది అభ్యర్థులకు గాను 3.02 లక్షల మంది (74 శాతం) హాజరయ్యారు. ఈ ఏడాది అక్టోబరు 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన గ్రూపు-1 మెయిన్స్‌కు 31,403 మంది అభ్యర్థులకు గాను 21,151 మంది (67.34 శాతం) హాజరయ్యారు. ఈ ఏడాది నవంబరు 17, 18వ తేదీల్లో నిర్వహించిన గ్రూపు-3 పరీక్షలకు 5.36 లక్షలకు గాను 2.69 లక్షల మంది (50.24 శాతం) హాజరయ్యారు. తాజాగా అంటే... డిసెంబరు 15, 16వ తేదీల్లో నిర్వహించిన గ్రూపు-2 పరీక్షలకు 5.51 లక్షల మందికి గాను 2.51 లక్షల మంది (45.57 శాతం) అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఈ సంవత్సర కాలంలో అనేక పోస్టుల భర్తీ కోసం పరీక్షలను నిర్వహించడం, వాటి ఫలితాను ప్రకటించి ఉద్యోగ నియామకాలను కూడా పూర్తి చేశారు. ఈ నియామకాల్లో చాలా మంది కొత్త ఉద్యోగాల్లో చేరిపోయారు. ఇలా ఉద్యోగాల్లో చేరిన వారిలో చాలా మంది తర్వాతి పరీక్షలకు హాజరు కావడం లేదు.

తేదీ	పరీక్ష పేరు	హాజరు శాతం
01-07-2023	గ్రూప్-4	80
09-06-2024	గ్రూప్-1 ప్రిలిమనరీ	74
2024 అక్టోబరులో	గ్రూప్-1 మెయిన్స్	67.34
17,18 నవంబరు 2024	గ్రూప్-3	50.24
15,16 డిసెంబరు 2024	గ్రూప్-2	45.57

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.